ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 02.11.2024 | సంపుటి : 11 సంచిక : 111 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



## ఇస్రో 'అనలాగ్ స్పేస్ మిషన్'

**బేస్ స్టేషన్లలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు సన్నాహాలు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత అంతరిక్ష సంస్థ ఇస్రో తొలి అనలాగ్ స్పేస్ మిషన్‌ను లద్దాఖ్ లేహ్‌లో ప్రారంభించింది. హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్, ఆకా స్పేస్ స్టూడియో, లడఖ్ విశ్వవిద్యాలయం, ఐఐటీ బాంబే, లడఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్

మిగతా 2లో..



## కమర్షియల్ సిలిండర్ల ధర పెంపు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** గ్యాస్ ధరలు పెంచుతున్నట్లు చమురు సంస్థలు ప్రకటించాయి. దీపావళి మరుసటి రోజునే ఎల్ పీజీ గ్యాస్ సిలిండర్ ధరలు పెంచాయి. నవంబర్ 1 నుంచి 19 కిలో కమర్షియల్ ఎల్ పీజీ గ్యాస్ సిలిండర్ ధరలు పెంచుతున్నట్లు ప్రకటన చేశాయి.

మిగతా 2లో..

# సమగ్ర కుటుంబ సర్వేకు సిద్ధం



### అన్ని పథకాలకూ ఇదే దిక్సూచి : మంత్రి పొన్నం

### రాష్ట్ర ప్రజలంతా ప్రక్రియకు సహకరించాలని విజ్ఞప్తి

**కరీంనగర్ బ్యూరో, నవంబర్ 01 (జనంసాక్షి)** రాహుల్ గాంధీ హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన ప్రక్రియను ప్రకటించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా సమగ్రకుటుంబ సర్వేకు సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించాలని, దేశములో తొలిసారిగా రాష్ట్రంలో జరుగుతున్న ఈ సర్వేను ఈ ప్రభుత్వము ప్రతిష్టాత్మ కంగా తీసుకుందని, ఈ సర్వే రాబోయే కాలములో అన్ని రకాల పథకాలు అందుటకు, ఇది ఒక మెగా హెల్త్ చెకప్ లాగా సమాచారముతో పాటుగా భవిష్యత్ ప్రక్రియ పూర్తి చేయడానికి ఉపయోగపడుతుంది కాబట్టి తప్పకుండా ప్రతి ఒక్కరూ సమాచారము సేకరిస్తున్న వారు సమాచారము తెలుపుతున్న ప్రతి తెలంగాణ బిడ్డ ఈ యొక్క సర్వే లో భాగస్వాములై సహరించాలని కోరారు ప్రభుత్వం డైట్ , కాస్మొటిక్ చార్జీలు పెంచిన సందర్భంగా విద్యార్థులతో కలిసి దీపావళి వేడుకల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్.ప్రభుత్వం డైట్ కాస్మొటిక్ చార్జీలు పెంచడంతో విద్యార్థులతో కలిసి

**పెరుగుతున్న ధరలకు అనుణంగా విద్యార్థులకు డైట్,మెస్ ఛార్జీలు పెంచాం**

**గత ప్రభుత్వ హయాంలో అధ్వాన్న స్థితికి గురుకులాలు**

**ఇప్పటివరకు 19 వేల ప్రమోషన్లు ,35 వేల బదిలీలు చేపట్టామని వెల్లడి**

కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రంథాలయ కమిటీ చైర్మన్ సత్తు మల్లేష్ , జగిత్యాల మున్సిపల్ చైర్మన్, కార్పొరేటర్లు, ఆర్సివో అంజలి, ప్రిన్సిపాల్ వేణుగోపాల్, గురుకుల సిబ్బంది కరీంనగర్ పట్టణ కాంగ్రెస్ ముఖ్య నేతలతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... గత 10 సంవత్సరాలుగా ఓపెన్ మార్కెట్ లో అనేకంగా ధరలు పెరిగినప్పటికీ విద్యార్థుల మెస్ చార్జీలు పెరగలేదని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా నేను విద్యార్థి నాయకుడిగా పిల్లలకు మెస్ చార్జీలు, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని ముఖ్యమంత్రి , ఉప ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోవడం జరిగిందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ,

మిగతా 2లో..

## కులంపేరు తప్పుగా నమోదు చేయిస్తే క్రిమినల్ చర్యలు

**బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ హెచ్చరిక**

**కరీంనగర్‌బ్యూరో(జనంసాక్షి):** కులగణన సర్వే సందర్భంగా కులం పేరు తప్పుగా నమోదు చేయించుకుంటే క్రిమినల్ చర్యలు తప్పవని బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ హెచ్చరించారు.కులగణన బృహత్తర కార్యక్రమమని, ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కరీంగర్‌లో నిర్వహించిన అభిప్రాయ సేకరణ కార్యక్రమంలో నిరంజన్ మాట్లాడారు.

మిగతా 2లో..

## ఎస్పీఎఫ్ పహారాలోకి సెక్రటేరియట్

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ సెక్రటేరియట్ భద్రతను శుక్రవారం నుంచి ఎస్పీఎఫ్ పోలీసులు పర్యవేక్షించనున్నారు. కొత్త సెక్రటేరియట్ ప్రారంభం నుంచి విధులు నిర్వహిస్తున్న టీజీఎస్పీ బెటాలియన్ సిబ్బందిని మార్చి ఎస్పీఎఫ్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇటీవల ఏక్ పోలీస్ నినాదంతో టీజీఎస్పీ బెటాలియన్ పోలీసులు ఆందోళనల బాట పట్టిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.సెక్రటేరియట్ వీవీఐపీ జోన్‌లో ఉన్నందునే భద్రత నుంచి టీజీఎస్పీని ప్రభుత్వం తప్పించినట్లు తెలుస్తోంది.గతంలో చాలాకాలం పాటు సెక్రటేరియట్ భద్రతా వ్యవహారాలను చూసిన అను



భవం ఎస్పీఎఫ్‌కు ఉంది. భద్రతా విధుల్లో చేరిన తొలి రోజు శుక్రవారం సచివాలయం ప్రాంగణంలోని అమ్మ వారి గుడిలో పూజలు చేసిన ఎస్పీఎఫ్ సిబ్బంది కవాతు నిర్వహించారు.

## మాది అభివృద్ధి మంత్రం.. భారాసది విధ్వంస తంత్రం..

### గత ప్రభుత్వం పదేళ్లలో చేయలేని అభివృద్ధిని పదినెలల్లో చేశాం : మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణలో పదేళ్ల పాలనలో భారాస చేయలేని అభివృద్ధిని.. తాము పది నెలల కాలంలో చేశామని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మేడ్చల్‌- మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో సుమారు రూ.6.68 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. బోడుప్పల్‌లో వక్ఫ్ బోర్డు సమస్య న్యాయస్థానం పరిధిలో ఉందని.. అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అధికారంలోకి రాగానే మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్ల నిధులు కేటాయించామని చెప్పారు. గత ప్రభుత్వం పేదలకు ఇళ్లు ఇవ్వకుండా, తమ బంధువులకు, కార్యకర్తలకు ఇచ్చారని ఆరోపించారు. అర్హులను గుర్తించే ప్రక్రియ ప్రారంభమైందని, ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని తెలిపారు. రూ.13 కోట్లతో బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని చెరువుల అభివృద్ధి కోసం నిధులు కేటాయించామన్నారు. ఆరోగ్య శ్రీ పథకం ద్వారా రూ.10 లక్షలతో పేదలకు వైద్యం అందిస్తున్నామని చెప్పారు. జూనియర్, డిగ్రీ కళాశాలలు మంజూరు కోసం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల 5వేల ఉద్యోగాలు ఇస్తున్నామని, ఇప్పటి వరకు 50వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చామని తెలిపారు.

## భవిష్యత్తులో పాదయాత్ర చేస్తా

**పార్టీ కార్యకర్తల ఆకాంక్షల మేరకే ఈ నిర్ణయం**

**ప్రభుత్వ వ్యతిరేతను ప్రజల్లోకి తీసుకుని వెళ్లే ఆలోచన:కేటీఆర్**



**హైదరాబాద్(జనంసాక్షి):** ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఉందని, రాజకీయంగా తమకు అనుకూలంగా ఉందిన విపక్ష బిఆర్ఎస్ భావిస్తోంది. దీనిని తమకు అనుకూలంగా మలచుకునేందుకు ప్రజల్లోకి చొచ్చుకు వెళ్లాలని నిర్ణయించింది. ప్రభుత్వ కార్యక్రమాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని భావి స్తోంది. ఇందులో భాగంగా కెటిఆర్ పాదయాత్ర ఆలోచన చేసున్నారు. అలాగే కార్యకర్తల ఆకాంక్షల మేరకు భవిష్య త్తులో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని పార్టీ కార్యని ర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. పార్టీ కార్యకర్తలు అంతా కోరుతున్నందున భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని కేటీఆర్ అన్నారు. ఎక్స్ వేదిగా నిర్వహించిన 'ఆస్క్ కేటీఆర్' క్యాంపెయిన్‌లో యూజర్లు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. దేశంలోని అనేక పార్టీల నేతలు ప్రభుత్వాల వైఫల్యాలను

మిగతా 10లో..

## డైట్,కాస్మొటిక్ ఛార్జీలు 40 శాతం పెంపు

**గురుకుల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు**

### గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడూ పట్టించుకోలేదు

### మీడియా సమావేశంలో మంత్రి సీతక్క వెల్లడి



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో గురుకులాలకు డైట్, కాస్మొటిక్ ఛార్జీలు పెరిగాయి. 40శాతం మేర పెంచినట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. ఎన్నడు లేని విధంగా హాస్టల్, గురుకుల విద్యార్థులకు డైట్ కాస్మొటిక్ 40శాతం పెంచారని గుర్తుచేశారు. శుక్రవారం సచివాలయంలో మంత్రి సీతక్క మిడియా సమావేశంలో మాట్లాడుతూ... ఎన్నడూ లేని విధంగా విద్యార్థులకు 40శాతం చార్జీలను పెంచిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పెంచిన చార్జీలు అందుకుబోతున్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఇదే విద్యార్థులకు అసలైన దీపావళి అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు.ఇక హాస్టల్ విద్యార్థులు అర్ధాకలితో అవస్థలు పడాల్సిన అవసరం లేదని చెప్పారు. పెంచిన చార్జీలతో విద్యార్థులకు పోషకాహారం అందించాల్సిన బాధ్యత టీచర్లది, హాస్టల్ సిబ్బందిది అని తెలిపారు. హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ చార్జీలు గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లిస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.డైట్ చార్జీలు ఏడేళ్లుగా, కాస్మొటిక్ చార్జీలు గత 16 సంవత్సరాలుగా పెరగలేదని అన్నారు. ఏడు సంవత్సరాల క్రితం డైట్ చార్జీలు కొంచెం పెంచి.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుందని మంత్రి సీతక్క మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో

మిగతా 2లో..

## ఏకపక్షంగా వ్యవహరిస్తే న్యాయపరమైన చర్యలకు వెనుకాడం

**ఈసీతీరును విమర్శిస్తూ కాంగ్రెస్ లేఖ**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కేంద్ర ఎన్నికల సంఘం పై కాంగ్రెస్ తీవ్రస్థాయిలో విమర్శలు చేసింది. తన స్వతంత్రతను పూర్తిగా పక్కనపెట్టడమే లక్ష్యమైతే.. ఆ విషయంలో ఎన్నికల సంఘం అద్భుతమైన పనితీరు చూపుతోందని మండిపడింది.ఇటీవల జరిగిన హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తలకిందులు చేస్తూ ఫలితాలు వెలువడ్డాయి. భాజపా అనూహ్య విజయాన్ని సొంతం చేసుకుంది. ఎన్నికల్లో అవకతవకలు చోటుచే సుకున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఫిర్యాదు చేయగా.. ఈసీ తోసిపుచ్చింది. "తమకు అనుకూల ఫలితాలు రానప్పుడు కాంగ్రెస్ నిరాధార ఆరోపణలు చేస్తుంటుంది" అని విమర్శించింది. ఆ ఆరోపణలు బాధ్యతారాహిత్యమైనవని తోసిపుచ్చింది. హరియాణా ఎన్నికల్లో ఎలాంటి అవకతవకలు చోటుచేసుకోలేదని, ఇలాంటి పనికిమాలిన ఫిర్యాదులు చేసే ధోరణిని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించింది.ఎన్నికల సంఘం తనకు తాను

మిగతా 2లో..

**మహారాష్ట్రలో ఎలాంటి గ్యారంటీలు ప్రకటించబోం**

**మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు**

వార్త 2లో

**జన్వాడ ఫాంహౌజ్ కేసు..**

## విచారణకు రాజ్‌పాకాల హాజరు



**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణలో కాకరేపిన జన్వాడ ఫామ్ హౌస్ కేసులో పోలీసులు దూకుడు పెంచారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఆధారాలు సేకరించిన చేవెళ్ల ఎక్సైజ్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగానే జన్వాడ ఫామ్ హౌస్ కేసులో కీలక నిందితులైన కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాల, విజయ్ మద్దూరిలను శుక్రవారం చేవెళ్ల ఎక్సైజ్

మిగతా 2లో..

**కాళేశ్వరంపై విచారణ..**

## కమిషన్ గడువు మరోసారి పొడిగింపు?

**హైదరాబాద్(జనంసాక్షి):** కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించిన అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలో కమిషన్‌ను నియమించింది.దీనిపై వంద రోజుల్లో విచారణ పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

మిగతా 2లో..



## కాళ్లు మొక్కి మరీ కాల్చేశారు

**న్యూఢిల్లీలో తుపాకి తూటాలకు ఇద్దరి బలి**

**ఆసుపత్రిలో మరొకరికి చికిత్స**

**పండగవేళ కాల్పుల కలకలం**


**న్యూఢిల్లీ (జనంసాక్షి):** దీపావళి రోజున దేశ రాజధాని ఢిల్లీలో విషాదకర ఘటన చోటు చేసుకున్నది. షహదారా ప్రాంతంలో తుపాకీ తూటాలకు ఇద్దరు బలయ్యారు. మరో మైనర్ గాయాలకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఫార్స్ బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి ఈ కాల్పుల ఘటన చోటు చేసుకున్నది. మృతులు ఆకాశ్ (40), రిషబ్ (16) మృతి చెందగా..

మిగతా 2లో..

## అంగుళం భూమినీ వదులుకోం

### సైనిక దళాన్ని బలోపేతం చేస్తున్నాం.. అత్యాధునిక సైనిక జాబితాలో చేర్చుతున్నా : మోదీ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** భారత్‌-చైనా సరిహద్దులో బలగాల ఉపసంహరణ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతమున్న కేంద్ర ప్రభుత్వం దేశానికి సంబంధించిన ఒక్క అంగుళం భూమి విషయంలో కూడా రాజీపడబోమని ఆయన వ్యాఖ్యానించారు. "21వ శతాబ్దపు అవసరాలను దృష్టిలో ఉంచుకుని మనం మన సైన్యాలను, మన భద్రతా దళాలను ఆధునిక వనరులతో బలోపేతం చేసుకుంటున్నాం. ప్రపంచంలో అత్యాధునిక సైన్యాల జాబితాలో చేర్చుతున్నాం. ఈ ప్రయత్నాలకు ఆధారం రక్షణ రంగంలో స్వావలంబన" అని నరేంద్ర మోదీ అన్నారు. గుజరాత్‌లోని కచ్ఛ్‌లో ఉన్న సర్ క్రీక్ ప్రాంతంలోని లక్కీ నాలా వద్ద బీఎస్ఎఫ్, ఆర్మీ, నేవీ, వైమానిక దళ సిబ్బందితో ఇవాళ (గురువారం) ఆయన దీపావళిని జరుపుకున్నారు. "నేడు అభివృద్ధి చెందిన దేశంగా అవతరించడమే లక్ష్యంగా వేగంగా ముందుకు సాగుతున్న వేళ మీరందరూ (సైనికులు) ఈ కలల రక్షకులు" అని మోదీ అన్నారు. కాగా తూర్పు లడఖ్ దగ్గర చైనా-భారత్ బలగాల ఉపసంహరణ ప్రక్రియ దాదాపు పూర్తవుతున్న నేపథ్యంలో ప్రధానమంత్రి మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా సరిహద్దు పర్యాటకం జాతీయ భద్రతకు సంబంధించిన అంశమని, దీని గురించి పెద్దగా చర్చించలేదని మోదీ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎప్పటిలాగానే ఈ సంవత్సరం కూడా దీపావళి పండగను సైనికుల మధ్య జరుపుకున్నారు. ఇందుకోసం ఆయన ఈ రోజు



గుజరాత్‌లోని కచ్ఛ్‌లో సర్ క్రీక్‌లోని లక్కీ నాలా వద్ద బీఎస్ఎఫ్, ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ సిబ్బందిని కలిశారు. ఆర్మీ యూనిఫాం ధరించి సైనికులతో గడిపారు. సైనికులకు ఆయన పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

**బూటకపు వాగ్దానాలు సులభమే..**

## కానీ ఆచరణ కష్టం

**కాంగ్రెస్‌పై ప్రధాని వరుస ట్వీట్లతో మోదీ ధ్వజం**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆర్థికంగా చేయగలిగే హామీలు మాత్రమే ఇవ్వాలని తమ పార్టీ శాఖలకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సూచించిన నేపథ్యంలో ప్రధాని తనదైన శైలిలో స్పందించారు."బూటకపు

మిగతా 2లో..

## కమ్మేసిన కాలుష్యం

**ఢిల్లీలో దీపావళి సందర్భంగా పూర్తిగా తగ్గిన గాలి నాణ్యత**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దేశవ్యాప్తంగా దీపావళి పండుగను అక్టోబర్ 31న ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇదే సమయంలో అనేక ప్రాంతాల్లో ప్రజలు బాణాసంచాను పెద్ద ఎత్తున పేల్చారు. దీంతో అనేక చోట్ల వాయు కాలుష్యం మరింత పెరిగింది. ప్రధానంగా ఢిల్లీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలి నాణ్యత తీవ్ర స్థాయికి చేరుకుంది. అనేక ప్రాంతాల్లో 350 దాటేసింది. ఢిల్లీలో కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని బాణసంచా కాల్చడం నిషేధించారు. అయినప్పటికీ ఢిల్లీ ఎన్సీఆర్‌లో అనేక మంది బాణాసంచా కాల్చారు. ఈ క్రమంలో ఢిల్లీతోపాటు దాని పరిసర ప్రాంతాల్లో గాలి

మిగతా 10లో..


## ప్రతిదాడులకు సిద్ధంకండి

### దళాలకు సూచించిన ఇరాన్ సుప్రీంలీడర్ అలీఖమేని



**టెహ్రాన్(జనంసాక్షి):**ఇరాన్ సైనిక స్థావరాలు, క్షిపణి తయారీ కేంద్రాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ ప్రతీకార దాడులకు పాల్పడిన విషయం తెలిసిందే. ఈ దాడులకు ప్రతిదాడి చేస్తామని టెహ్రాన్ ఇప్పటికే హెచ్చరించింది.ఈనేపథ్యంలో ఇజ్రాయెల్‌పై ప్రతిదాడికి సిద్ధం చేయాలని ఇరాన్ సుప్రీంలీడర్ అయతొల్లా అలీఖమేని తన దళాలను ఆదేశించినట్లు తెలుస్తుంది. ఈమేరకు ఓ వార్తాసంస్థ కథనాన్ని ప్రచురించింది.కథనం ప్రకారం.. ఇటీవల ఇజ్రాయెల్ జరిగపిన దాడుల్లో జరిగిన నష్టం, ప్రతిదాడికి సంబంధించి ఇరాన్ అధికారులు చర్చలు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ చర్చల సమయంలో జాతీయ భద్రతామండలి రూపొందించిన ప్రణాళికలపై ప్రతిదాడికి సిద్ధం చేయాలని అలీఖమేనీ తన సైనిక అధికారులను ఆదేశించినట్లు వర్గాలు వెల్లడించాయి. ఇందులోభాగంగా టెహ్రాన్ దళాలు టెల్‌అవీవ్‌కు చెందిన సైనిక స్థావరాల జాబితాను రూపొందిస్తున్నట్లు కథనంలో వెల్లడైంది. మరోవైపు ఇరాక్ భూభాగం నుంచి ఇరాన్ తన అనుకూల మిలిటెంట్ల ద్వారా దాడికి పాల్పడుతుందని ఇజ్రాయెల్ నిఘావర్గాలు భావిస్తున్నాయి.'ఐడీఎఫ్,

మిగతా 2లో..



## సంధి అంటూనే.. దాడులా!

**కాల్పుల విరమణకు వ్యతిరేకంగానే ఇజ్రాయెల్ వ్యవహారం**

**లెబనాన్ ప్రధాని ఆగ్రహం**

**బీరుట్(జనంసాక్షి):** ఇజ్రాయెల్‌- హమాస్‌ల మధ్య యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. గాజాపై ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా లెబనాన్‌లోని హెజ్‌బొల్లా గ్రూప్‌నకు చెందిన 70 శాతం డ్రోన్లను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది.కాగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ తీవ్రంగా విరుచుకుపడుతుండటంతో ఆ

మిగతా 2లో..

# సదర్ ఉత్సవాల్లో ' ఉప్పల'




**హైదరాబాద్(జనంసాక్షి):**అఖిల భారత యాదవ్ సంఘం,నగేష్ వారి యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సదర్ ఉత్సవాల్లో టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొని మాట్లాడుతూ యాదవుల ఐక్యత,పాడిపంటలుపశువు సంపదను ప్రతిబింబిస్తూప్రతి యోట నిర్వహించే సదర్ పండుగ ఉత్సవాలలో భాగంగా యాదవ్ సోదరుల ఆహ్వానం మేరకు పాల్గొనడం సంతోషకరం అని ఆయన అన్నారు.ఆ కృష్ణుని ఆశీస్సులతో యాదవ సోదరులు అందరూ సంతోషంగా ఉండాలని అన్ని కులాల వారితో మంచిగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.అధికారికంగా సదర్ సమ్మేళనం జరపడం సంతోషం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.యాదవ సోదరులు దీపావళి సందర్భంగా ఏర్పాటు చేసుకునే సదర్ ఉత్సవాలను ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరుపుకోవడం సంతోషకరమైన అంశమని ఆయన అన్నారు .నేడు హైదరాబాదు, శివారు ప్రాంతాల అభివృద్ధిలో యాదవుల పాత్ర చాలా వరకు ఉందని అన్నారు. సదర్ అనేది యాదవుల ఖదార్ అని అందుకే ప్రతి దీపావళి పండుగ సందర్భంగా సదర్ ఉత్సవాలు చేసుకోవడం జరుగుతుందని అన్నారు.

# ప్రతిదాడులకు సిద్ధంకండి

భద్రతా సేవలకు నేను నిర్దేశించిన అత్యున్నత లక్ష్యం ఇరాన్ అణ్వాయుధాలను సాధించకుండా నిరోధించడమే. దీంతో టెహ్రాన్‌కు గట్టి దెబ్బ తగిలింది. ఇరాన్ నాయకుల అహంకారపు మాటలు నేడు అక్కడి వాస్తవాన్ని కప్పిపుచ్చలేవు. మునపటికంటే మాకు ఎక్కువ స్వేచ్ఛ ఉంది. మేము వారి భూభాగంలో ఎక్కడికైనా వెళ్లొచ్చు' అని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు పేర్కొన్నట్లు ప్రధాని కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది.అక్టోబరు 1న టెల్‌అవీవ్‌పై దాదాపు 200 క్షిపణులతో ఇరాన్ విరుచుకుపడింది. దీనికి ప్రతీకారంగా ఇరాన్ సైనిక స్థావరాలు, క్షిపణి తయారీ కేంద్రాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో టెహ్రాన్‌కు చెందిన నలుగురు సైనికులు మృతి చెందగా.. క్షిపణి తయారీ కేంద్రాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ దాడులను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు ఇరాన్ హెచ్చరించింది. ఈ అంశాన్ని తీవ్రతరం చేయొద్దని పలు దేశాలు ఇరాన్‌కు సూచించాయి. మరోవైపు అమెరికాలో అధ్యక్ష ఎన్నికలకు ముందే ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతిదాడి చేస్తోందని ఇటీవల ఓ అంతర్జాతీయ వార్తా సంస్థ ఓ కథనాన్ని ప్రచురించడం ఆందోళన కలిగిస్తోంది.

## సంధి అంటూనే.. దాడులా!

దేశ ప్రధాని నజీబ్ మికాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ దాడుల తీరు చూస్తుంటే సంధి ఒప్పందం కుదుర్చుకోవడానికి కాకుండా.. యుద్ధం తీవ్రతను పెంచేందుకే యత్నిస్తున్నట్లు ఉందన్నారు. అయితే.. నవంబర్ 5న అమెరికా ఎన్నికలు జరగడానికి ముందే ఇజ్రాయెల్‌-హెజ్‌బొల్లా యుద్ధంలో కాల్పుల విరమణ సాధ్యమవుతుందని అమెరికా రాయబారి అమోస్ హోచ్‌స్టెయిన్ చెప్పారని పేర్కొన్నారు."లెబనాన్‌లోని వివిధ ప్రాంతాలపై ఇజ్రాయెల్ తన దురాక్రమణను విస్తరిస్తోంది. మొత్తం నగరాలను, గ్రామాలను ఖాళీ చేయాలని ప్రజలపై తరచూ బెదిరింపులకు పాల్పడటం, బీరుట్‌కు దక్షిణంగా ఉన్న ప్రాంతాలను లక్ష్యంగా చేసుకోవడం వంటివన్నీ ఇజ్రాయెల్ తన శత్రువులను పూర్తిగా రూపుమాపడానికి చేస్తున్న పనులని తెలుస్తోంది. ఇజ్రాయెల్ దౌత్య ప్రవర్తన కాల్పుల విరమణను తిరస్కరిస్తున్నట్లుగా ఉంది" అని లెబనాన్ ప్రధాని పేర్కొన్నారు. లెబనాన్‌లో యుద్ధాన్ని ముగించే ఒప్పందం గురించి చర్చించడానికి ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహు అమెరికా అధికారులతో సమావేశమైన ఒక రోజు అనంతరం నజీబ్ మికాటి ఈ వ్యాఖ్యలు చేశారు.సెప్టెంబర్ 23న ఇజ్రాయెల్ లెబనాన్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడినప్పటి నుంచి ఇప్పటి వరకు 1,829 మంది ప్రాణాలు కోల్పోయినట్లుగా ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది.అమెరికా విదేశాంగశాఖ కార్యదర్శి ఆంటోని బ్లింకెన్ చొరవతో ఇజ్రాయెల్- హమాస్ వర్గాలు సంధి ఒప్పందానికి వస్తున్నాయి. గాజాలో కాల్పుల విరమణ ఒప్పంద చర్చల్లో తమ నిఘా అధిపతి పాల్గొంటున్నారని ఇటీవల ఇజ్రాయెల్ పేర్కొంది. ఒప్పందం కుదిరితే పోరాటం ఆపేస్తామని హమాస్ వర్గాలు సైతం వెల్లడించాయి. ఓ వైపు ఒప్పందం దిశగా అడుగులు పడుతున్నా.. దాడులు మాత్రం తగ్గకపోవడం ఆందోళనకరంగా మారింది.

బీరుట్‌పై భీకర దాడులు

హెజ్‌బొల్లా పుట్టినిల్లు లెబనాన్‌పై ఇజ్రాయెల్ తీవ్ర స్థాయిలో దాడులు చేస్తోంది. ఇరాన్‌-ఇజ్రాయెల్ మధ్య ప్రత్యక్ష దాడులు జరిగిన నేపథ్యంలో టెల్ అవీవ్‌పై ఇటీవల హెజ్‌బొల్లా కూడా దాడులను ఉద్ధృతం చేసింది.ఈ క్రమంలోనే బీరుట్‌లోని దహియే ప్రాంతంలో జనావాసాలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులకు దిగింది. పదుల సంఖ్యలో భవనాలను నేల మట్టం చేసింది. దీనిపై లెబనాన్ ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఎంతమేర ప్రాణనష్టం జరిగిందన్న వివరాలను మాత్రం వెల్లడించలేదు. హెజ్‌బొల్లాకు చెందిన కీలక నేతే లక్ష్యంగా ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది.మరోవైపు శుక్రవారం క్వామతియే ప్రాంతంలో ఇజ్రాయెల్ సేనలు బాంబు దాడుల చేసినట్లు లెబనాన్ ప్రభుత్వం వెల్లడించింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. పదుల సంఖ్యలో గాయపడినట్లు ప్రకటన విడుదల చేసింది. గతేడాది అక్టోబర్ 8న ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా రాకెట్లు ప్రయోగించినప్పటి నుంచి ఇప్పటి వరకు లెబనాన్‌కు చెందిన 2,800 మంది ప్రాణాలు కోల్పోగా, 13 వేల మందికిపైగా గాయపడినట్లు లెబనాన్ ఆరోగ్యశాఖ వెల్లడించింది.ఇజ్రాయెల్ ఉత్తర ప్రాంతంపై హెజ్‌బొల్లా రాకెట్లు ప్రయోగించడంతో గురువారం థాయ్‌లాండ్‌కు చెందిన నలుగురు పౌరులతో సహా ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. దీనిపై థాయ్ ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మిలటరీ జోన్స్ సమీపంలోకి తమ దేశస్థుల్ని విధులకు పంపవద్దని కోరింది. ఈ మేరకు దేశంలోని వివిధ సంస్థల నిర్వాహకులకు ఇజ్రాయెల్ ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని థాయ్‌లాండ్ విదేశీ వ్యవహారాల అధికార ప్రతినిధి బాలంకుర కోరారు.

**70 శాతం హెజ్‌బొల్లా డ్రోన్లు ధ్వంసం: ఇజ్రాయెల్**

లెబనాన్‌లోని హెజ్‌బొల్లా గ్రూప్‌నకు చెందిన 70 శాతం డ్రోన్లను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ ప్రకటించింది. సెప్టెంబర్ మధ్య నుంచి దాడులను తీవ్రతరం చేసి దాని 'యూనిట్ 127'ను భారీగా దెబ్బతీసినట్లు పేర్కొంది.ఆ డ్రోన్ యూనిట్ కమాండర్, 10 శాతం మంది ఆపరేటర్లను మట్టుబెట్టినట్లు తెలిపింది.ఉత్తర లిటానీ ప్రాంతంలో జరిగిన ఆపరేషన్‌లో 54 పొజిషన్లను కూడా దెబ్బతీశామని చెప్పింది. దాదాపు ఆ యూనిట్ ఆపరేషన్లు నిర్వహిస్తున్న 24 ప్రదేశాలు, 8 అసెంబ్లింగ్ సెంటర్లు, ఆరు అండర్ గ్రౌండ్ బేస్‌లు, 7 డ్రోన్ గోదాములను పేల్చేసినట్లు ఐడీఎఫ్ వెల్లడించింది.వాస్తవానికి హెజ్‌బొల్లా డ్రోన్లతో ఇజ్రాయెల్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు కూడా ఇబ్బంది పడుతున్నాయి. రాకెట్లతో పోలిస్తే వీటిని కూల్చివేసిన సందర్భాలు చాలా తక్కువగా ఉన్నాయి. ఫలితంగా ఇజ్రాయెల్ ఆస్తి, ప్రాణ నష్టాలకు డ్రోన్లే ప్రధాన కారణంగా నిలిచాయి. మొత్తం 1,300 ప్రయోగించగా.. వాటిల్లో 231ని మాత్రమే కూల్చేశాయి. 90 శాతం రాకెట్లను కూల్చేసిన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు .. కేవలం 80 శాతం మాత్రమే యూఏవీలను అడ్డుకున్నాయి.

# సమగ్ర కుటుంబ సర్వేకు సిద్ధం




మైనారిటీ వర్గాల తరుపున ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి లకు ధన్యవాదాలు తెలిపారు.డైట్ చార్జీలు 3 నుంచి 7వ తరగతి విద్యార్థినీ విద్యార్థుల కు రూ.950 నుంచి రూ.1330కు పెరిగింది. 8 నుంచి 10వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు రూ.1100 నుంచి రూ.1540కు పెరిగింది. ఇంటర్ నుంచి పీజీ వరకు విద్యార్థినీ విద్యార్థులకు రూ.1500 నుంచి రూ. 2100కు పెంపు, కాస్మొటిక్ చార్జీలు 3 నుంచి 7వ తరగతి విద్యార్థినులకు రూ.55 నుంచి రూ.175కు పెంపు.8 నుంచి 10వ తరగతి విద్యార్థినులకు రూ.75 నుంచి రూ.275కు పెంపు. బాయ్స్ 3 నుంచి 7వ తరగతి విద్యార్థులకు రూ.62 నుంచి 150కు పెంపు, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.62 నుంచి రూ.200కు పెంచామని,పెరుగుతున్న ధరలకు అనుగుణంగా భారీగా ధరలు పెంచడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత మెస్ చార్జీలకు పెంపు తో పాటు ఆ బిల్లులు నాణ్యత గల వస్తువులు సరఫరా చేయడానికి బిల్లులు గ్రీన్ ఛానెల్ ద్వారా చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకుంటున్నారని 7 లక్షల 65 వేల మందికి లాభం జరుగుతుందన్నారు.

**19 వేల ప్రమోషన్లు ,35 వేల బదిలీలు చేపట్టినం..**

దశాబ్ద కాలంగా మోడల్ స్కూల్ బదిలీలు లేకుండే వారి బదిలీలు చేపట్టామని జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఆటల్లో రాణించేలా విద్యార్థులను స్పోర్ట్స్ టీచర్ తీర్చిదిద్దాలని త్వరలోనే ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్స్ వస్తున్నాయని స్పోర్ట్స్ మైదానాలు వస్తున్నాయని మీ ఊరికి మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకోవాలన్నారు. దీపావళి పండగ సందర్భంగా ఎమ్మెల్యేలు , ఎమ్మెల్సీలు , లోక్ సభ సభ్యులు ,రాజ్య సభ సభ్యులు గురుకుల హాస్టల్ లను సందర్శించాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా మీకు విజ్ఞప్తి చేస్తున్న మీ నియోజకవర్గాల్లో హాస్టల్ లో విజిట్ చేసి వారి సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. ప్రైవేట్ బిల్డింగ్ లో నడిచే గురుకులలకు 50 శాతం అద్దెలు చెల్లించాలని 1020 భవనాల్లో 320 మాత్రమే ప్రభుత్వ భవనాలు ,మిగిలినవి కిరాయి లో నడుస్తున్నాయని ఇప్పటికే సగం అద్దెలు 100 కోట్లు రిలీజ్ చేశాం.. బిల్డింగ్ లో ఉన్న సమస్యలు టాయిలెట్స్ ఇతర సమస్యలు క్లియర్ చేయండి.40-50 నెలలుగా బిల్డింగ్ ల అద్దె పెండింగ్ లో ఉంటే దానిని మా ప్రభుత్వం క్లియర్ చేయండి. 7 లక్షల కోట్లు అప్పు చేశారు. గతంలో ఎప్పుడూ జీతాలు వచ్చేదో తెలిసేది కాదని ఇపుడు ఒకటో తారీఖు జీతాలు వస్తున్నాయన్నారు.

# ఇస్రో'అనలాగ్ స్పేస్ మిషన్'

కౌన్సిల్ సహకారంతో ఈ మిషన్ చేపట్టింది. మిషన్‌లో భాగంగా ఇస్రో లేహ్‌లో ఓ స్పేస్‌ను సృష్టిస్తుంది. ఇందులో మరో గ్రహంలో పరిస్థితులు ఎలా ఉంటాయో అలాగే ఉంటాయి. దాంతో భూమికి దూరంగా ఉన్న ప్రదేశాల్లోని బేస్ స్టేషన్లలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు ఇస్రో సన్నాహాలు చేయనున్నది. ఇస్రో లేహ్‌లో ప్రారంభించిన తొలి భారీ అనలాగ్ మిషన్ మిషన్ ఇదే. అంతరిక్షం, ఏదైనా ఖగోళ వస్తువు తరహాలో వాతావరణం, పర్యావరణాన్ని పోలి ఉంటుంది. నిర్ధిత ప్రమాణాలకు అనుగుణంగా శాస్త్రవేత్తలు తీర్చిదిద్దుతుంటారు. అందులో వ్యోమగాములకు శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. రాబోయే రోజుల్లో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ కీలకమైన మిషన్లు చేపట్టనున్న విషయం తెలిసిందే. ఇందులో కీలకమైన మిషన్ గగన్‌యాన్. ఇందులో మిషన్‌లో తొలిసారిగా అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపబోతున్నది. ఈ పరిస్థితుల్లో అనలాగ్ మిషన్ కీలకంగా మారనున్నది. రాబోయే కాలంలో వ్యోమగాములకు శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. లద్దాఖ్‌లోని వాతావరణ పరిస్థితులు కొంత వరకు చంద్రుడు, మార్స్ పరిస్థితులను పోలి ఉంటాయి. చల్లని, పొడి వాతావరణం, ఎక్కువ ఎత్తు ఉండడంతో ఇక్కడి నుంచి దీర్ఘకాలిక అంతరిక్ష మిషన్ల కోసం సన్నాహాలకు ఉపయుక్తంగా ఉండనున్నది. అనలాగ్ మిషన్‌లో పాల్గొనేవారంతా ఇతర గ్రహాలు, స్పేస్‌షిప్‌ల్లో ఉండే పరిస్థితులు అనుభవిస్తారు. భవిష్యత్‌లో ఇక్కడే అంతరిక్ష యాత్రకు సిద్ధం కానున్నారు. నిర్వహణ, మానసిక స్థితిని సైతం శాస్త్రవేత్తలు పర్యవేక్షించనున్నారు.

# కాళ్ళు మొక్కి మరీ కాల్చేశారు

క్రిష్ శర్మ (10) గాయపడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. షహదారా ప్రశాంత్ గౌతమ్ మాట్లాడుతూ.. రాత్రి సమయంలో బిహారీ కాలనీలో కాల్పులు జరిగినట్లు పీసీఆర్ కాల్ వచ్చిందన్నారు. సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా.. ఆకాశ్, అతడి మేనల్లుడు రిషబ్, కొడుకు కుమారుడు క్రిష్‌కు గాయాలయ్యాయన్నారు. తీవ్ర గాయాలతో ఆకాశ్, రిషబ్ చనిపోయారని చెప్పారు. ప్రాథమిక విచారణలో ఐదురౌండ్లు క్పాలు జరిగినట్లుగా తేలింది. గుర్తు తెలియని వ్యక్తి తుపాకీ కాల్పులు జరిపే ముందు పాదాలను తాకాడు. ఆ తర్వాత కాల్పులకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో ఆకాశ్ శర్మ పక్కనే ఉన్న రిషబ్, క్రిష్‌కు సైతం తూట గాయాలయ్యాయి. వారిని ఆసుప్రతికి తరలించగా.. ఆకాశ్ శర్మ, రిషబ్ చనిపోయినట్లుగా వైద్యులు ప్రకటించారు. క్రిష్ శర్మ చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, కాల్పులకు కారణాలు తెలియరాలేదు.

## దంచి కొట్టిన వాన

**హైదరాబాద్(జనంసాక్షి):** నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. కొండాపూర్, మియాపూర్, లింగంపల్లి, కేపీహెచ్‌బీ, మూసాపేట, నిజాంపేట, మాదాపూర్, మేడ్చల్, కండ్లకోయ, కృష్ణాపూర్, దుండిగల్, గండి మైసమ్మ, మల్లంపేట్ తదితర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షానికి రహదారులు జలమయమయ్యాయి.

# కులంపేరు తప్పుగా నమోదు చేయిస్తే క్రిమినల్ చర్యలు



"జనాభాలో బీసీలు 52 శాతం ఉన్నామని ఇప్పటిదాకా చెప్పుకొంటున్నాం. అది నిరూపించుకునేందుకు ఈ సర్వే కీలకం. ఈ గణన ద్వారా బీసీలతో పాటు అన్ని కులాల జనాభా లెక్కలు, వారి ఆర్థిక స్థితిగతులు తెలుస్తాయి. ఎవరి ఒత్తిళ్లకు లొంగకుండా మా దృష్టికి వచ్చిన విషయాలను ప్రభుత్వానికి నివేదిస్తాం. కులగణన జరుగుతున్న సమయంలో కుల సంఘాలు కీలక పాత్ర పోషించాలి. సర్వే సక్రమంగా జరిగేలా చూడాలి. 80వేల నుంచి 90వేల మంది ఎన్యుమరేటర్లు జనగణనలో పాల్గొంటారు. ఎవరూ దీన్ని రాజకీయం చేయొద్దు. అపోహలు, ఆటంకాలు సృష్టించడం మంచిది కాదు.న్యాయస్థానం పట్ల గౌరవం ఉంది. కోర్టు సూచించినట్లే ముందుకు వెళ్తాం. న్యాయనిపుణల సలహా మేరకు ఈనెల 13 వరకు ప్రజాభిప్రాయ సేకరణ కొనసాగిస్తాం. ప్రజాభిప్రాయ సేకరణలో చాలా రకాల విజ్ఞప్తులు వస్తున్నాయి. కొన్ని కులాల పేర్లు ఎప్పుడూ విననివి కూడా మా దృష్టికి వస్తున్నాయి. రిజర్వేషన్ల ప్రక్రియ సజావుగా సాగేలా అందరు సహకరించాలి. అనాథలకు ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేయాలన్న డిమాండ్లు కూడా ఉన్నాయి" అని నిరంజన్ తెలిపారు.

# డైట్,కాస్మోటిక్ ఛార్జీలు 40శాతం పెంపు

విద్యా వ్యవస్థ నాశనమైందని మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క విమర్శలు చేశారు. విద్యా శాఖకు కేసీఆర్ ప్రభుత్వం చేసింది శూన్యమని విమర్శించారు. విద్యార్థుల బాధలు తెలిసిన రేవంత్ రెడ్డి సీఎంగా ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉండాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని ఉద్ఘాటించారు. ఏడేళ్లుగా ధరలు విపరీతంగా పెరిగాయని.. అందుకు అనుగుణంగా డైట్, కాస్మోటిక్ ఛార్జీలు ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచకపోవడంతో పిల్లలు అర్ధాకలితో ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. పదేళ్లు కేసీఆర్ అధికారంలో ఉండి టాయిలెట్స్ కట్టలేదని..తాగునీరు, మౌలిక వసతులు కల్పించలేదని ధ్వజమెత్తారు. ఈ సమస్యలను గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి పాఠశాలల్లో మౌలిక సదుపాయల కల్పన కోసం ప్రత్యేక దృష్టి పెట్టారని మంత్రి సీతక్క అన్నారు. డైట్, కాస్మోటిక్ చార్జీలు పెంచడంతో 7.65 లక్షల మంది విద్యార్థులకు లబ్ది జరగనుందని వివరించారు.పిల్లలకు కడుపునిండా భోజనం పెట్టాలని పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచిన సీఎం రేవంత్‌రెడ్డికు ధన్యవాదాలు తెలిపారు.

# కమిషన్ గడువు మరోసారి పొడిగింపు?

అందుకు అనుగుణంగా జస్టిస్ పీసీ ఘోష్ విచారణ కొనసాగిస్తున్నారు. కాగా, మొదటి వంద రోజుల గడువు జూన్ నెలాఖరుతో పూర్తయింది. దీనిపై విచారణ ప్రక్రియ కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు రెండుసార్లు రెండు నెలల చొప్పున కమిషన్ గడువును పొడిగించింది. ప్రభుత్వం పొడిగించిన గడువు నేటితో పూర్తికానుంది.అయితే, జస్టిస్ పీసీఘోష్ కమిషన్ విచారణ ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ఇంజినీర్లు, విశ్రాంత ఇంజినీర్లకు సంబంధించిన క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తయింది. ఐఏఎస్ అధికారులు, మాజీ ఐఏఎస్ అధికారులను కమిషన్ విచారించాల్సి ఉంది. విజిలెన్స్, ఎన్డీఎస్ఏ, కాగ్ నివేదికల ఆధారంగా ఇతర అంశాలపైనా విచారణ జరపాల్సి ఉంది. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత అప్పటి ప్రభుత్వపెద్దలను కూడా దర్యాప్తు చేసేందుకు కమిషన్ సిద్ధమవుతోంది. ఈనేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ పీసీఘోష్ కమిషన్ గడువును మరోసారి పొడిగించనుంది. సంబంధిత దస్త్రం ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. మరో రెండు నెలలపాటు పొడిగింపు ఇస్తూ ఇవాళో.. రేపో ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉంది.

## కమర్షియల్ సిలిండర్ల ధర పెంపు

దీంతో ఇప్పుడు మరింత భారం పడనుంది. ఒక్కో సిలిండర్ పై రూ. 62 పెంచుతున్నట్లు ఆయిల్ కంపెనీలు ప్రకటించాయి. దీంతో ఒక్కో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర్ రూ 1802లకు చేరింది. అయితే 14.2 కేజీల డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల ధరల్లో ఎలాంటి మార్పు లేకపోవడం కొంత ఊరటనిచ్చింది.

## విచారణకు రాజ్‌పాకాల హాజరు

పోలీసులు విచారించారురాజ్ పాకాల ఇంట్లో జరిగిన పార్టీలో డ్రగ్స్ కోణాలపై ఆరా తీస్తున్న పోలీసులు.. మరోవైపు విజయ్ మద్దూరి ఫోన్?కు సంబంధించి ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఈ కేసులో ఇది వరకే మోకిలా పోలీసులు రాజ్ పాకాలను, విజయ్ మద్దూరి విడివిడిగా దర్యాప్తు చేశారు. దీనికి కొనసాగింపుగా శుక్రవారం చేవెళ్ల ఎక్సైజ్ పోలీసులు నిందితులను విచారిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడ పరిధిలో అక్టోబర్ 26న కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాలకు చెందిన ఫామ్‌హౌస్‌లో పార్టీ జరిగింది. అనుమతి లేకుండా పార్టీ నిర్వహించడంతో పాటు ఫారిన్‌లిక్కర్ వాడినందుకు ఎక్సైజ్ యాక్ట్ కింద కూడా కేసుఫైల్ చేశారు. నిర్వహించిన సోదాల్లో 12 ఫారిన్ లిక్కర్ బాటిల్స్.. ఢిల్లీ, మహారాష్ట్రకు చెందిన రెండు నాన్ డ్యూటీ లిక్కర్ బాటిల్స్.. 11 కేఎఫ్ బీర్లు.. 7.35 లీటర్లు టీజీ ఐఎంఎఫ్ఎల్ బాటిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు పెద్ద మొత్తంలో క్యాసినో కాయిన్స్, ప్లేయింగ్ కార్డ్స్ సీజ్ చేశారు. పార్టీలో 22 మంది పురుషులు,18 మంది మహిళలతో పాటు ఐదుగురు పిల్లలున్నట్టు పోలీసులు గుర్తించారు. 22 మందికి డ్రగ్స్‌ర్యాపిడ్ టెస్ట్‌లు చేయగా ప్రముఖ వ్యాపారి విజయ్ మద్దూరి కొకైన్ తీసుకున్నట్లు నిర్ధారణయింది. ఎన్‌డీపీఎస్‌యాక్ట్ కింద కేటీఆర్ బామ్మర్ది రాజ్ పాకాల (50), విజయ్ మద్దూరి (55), ఫామ్‌హౌస్‌మేనేజర్ కార్తీక్(30)పై మోకిలా పోలీసులు కేసు నమోదు చేశారు.

# మహారాష్ట్రలో ఎలాంటి గ్యారంటీలు ప్రకటించబోం

## మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక ప్రకటన చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు, ఏడు అంటూ ఎలాంటి గ్యారంటీలూ ప్రకటించడం లేదని స్పష్టం చేశారు. బడ్జెట్ ఆధారంగా హామీలు ప్రకటించాలని.. లేదంటే రాష్ట్రం దివాలా పరిస్థితికి చేరుతుందని వ్యాఖ్యానించారు. విలేకరులతో ఖర్గే మాట్లాడుతూ.. 'త్వరలో జరగబోయే మహారాష్ట్ర ఎన్నికల్లో 5, 6, 10, 20 ఇలా ఏ ఒక్క హామీలను ప్రకటించడం లేదు. బడ్జెట్ ఆధారంగా హామీలు ప్రకటించాలి. లేదంటే రాష్ట్రం దివాలా పరిస్థితికి చేరుతుంది. ప్రణాళికా రహిత విధానం ఆర్థిక ఇబ్బందులకు దారి తీస్తుంది. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే.. భవిష్యత్తు తరాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. రోడ్లు వేసేందుకు కూడా డబ్బు లేకపోతే.. ప్రభుత్వంపై ప్రజలు తిరగబడతారు. ప్రభుత్వం విఫలమైతే భవిష్యత్తు తరానికి చెడ్డపేరు తప్ప మరొకటి మిగలదు' అంటూ ఎన్నికల హామీలపై ఖర్గే వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ప్రజలు ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు పలు హామీలను ఇస్తున్న విషయం తెలిసిందే. కర్ణాటకలో ఐదు గ్యాంరటీలతో, తెలంగాణలో ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చింది. అయితే, గ్యారెంటీల పేరుతో ఆకర్షించి ఓట్లు వేయించుకున్న ఆ పార్టీ ఇప్పుడు ఉచిత పథకాలను అమలు చేయలేక చేతులెత్తేస్తున్నది. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన నెల రోజులకే ఆడంబరంగా ప్రారంభించిన ఉచిత బస్సు పథకానికి ఏడాదిన్నరకే మంగళం పాడేందుకు సిద్ధమైంది. ఈ పథకాన్ని నిలిపేసేందుకు ఇప్పటికే కసరత్తు మొదలు పెట్టినట్లు సమాచారం. తెలంగాణలో సైతం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో హస్తం పార్టీ విఫలమవుతోందని విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ పరిణామాల దృష్ట్యా రాబోయే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఈ హామీలపై కాంగ్రెస్ పార్టీ వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

## ఏకపక్షంగా వ్యవహరిస్తే న్యాయమపరమైన చర్యలకు వెనుకాడం

క్లీన్‌చిట్ ఇచ్చుకో వడం తమనేమీ ఆశ్చర్యపర్చలేదని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. అయితే సమాధానం ఇచ్చిన తీరు, వాడిన భాష, పార్టీపై చేసిన ఆరోపణలు తాము తిరిగి లేఖ రాసేందుకు కారణమయ్యాయని వ్యాఖ్యానించింది. ఈసీ ఇదే తరహా భాషను ఉపయోగిస్తూ ఉంటే.. అలాంటి వ్యాఖ్యలను తొలగించేందుకు న్యాయపరమైన ఆశ్రయం పొందడం మినహా తమకు మరో మార్గం లేదంటూ ఆ లేఖలో తీవ్రంగా స్పందించింది.

# బూటకపు వాగ్దానాలు సులభమే.. కానీ ఆచరణ కష్టం

వాగ్దానాలు చేయడం సులభమే.. కానీ, వాటిని అమలు చేయడం కష్టం లేదా అసాధ్యమని కాంగ్రెస్ పార్టీ గ్రహిస్తోంది" అని 'ఎక్స్'లో వరుస పోస్టులు చేశారు. ఆచరణ సాధ్యం కాని హామీలని తెలిసినా.. ప్రచారంలో ఊదరగొట్టారని.. ఇప్పుడేమో ప్రజల ముందు ఘోరంగా నిలబడ్డారని పేర్కొంటూ హ్యాష్‌ట్యాగ్‌ను జత చేశారు.కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రాన్ని చూసినా.. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలలో అభివృద్ధి కుంటుపడిందని, ఆర్థిక పరిస్థితి దిగజారిందని ప్రధాని (ఖఓ ఓనీటతి) విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడమంటే.. వారిని మోసగించడమేనన్నారు. ఇలాంటి రాజకీయాలతో పేదలు, యువత, రైతులు, మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను నిరాకరించడమే కాదు.. ప్రస్తుతం అమలవుతున్న పథకాలను సైతం నీరుగార్చేలా చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ బూటకపు హామీల సంస్కృతిపై దేశ ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. హరియాణా ప్రజలు కాంగ్రెస్ నేతల హామీలను ఎలా తిరస్కరించారో ఇటీవలే అందరమూ చూశామన్నారు. అక్కడి ప్రజలు సుస్థిరత, అభివృద్ధితో నడిపించే ప్రభుత్వాన్ని ఎంచుకున్నారన్నారు. కాంగ్రెస్‌కు వేసే ఓటు పాలనా రహితం, అసమానమైన దోపిడీకి దారితీస్తుందన్న భావన ప్రజల్లో వ్యక్తమవుతోందని మోదీ పేర్కొన్నారు. దేశ ప్రజలు అభివృద్ధి, ప్రగతిని కోరుకుంటున్నారన్నారు.కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ అంతర్గత రాజకీయాలు, దోపిడీలో బిజీగా ఉందంటూ ప్రధాని మోదీ మండిపడ్డారు. అక్కడ ఇప్పటికే ఉన్న పథకాలను సైతం ఉపసంహరించుకుంటున్నారని ఆరోపించారు. హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించడంలేదని, తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన రుణమాఫీ హామీ అమలు కోసం రైతులు ఎదురుచూస్తున్నారని మోదీ పేర్కొన్నారు. అలాగే, గతంలో ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో కొన్ని అలవెన్సులు ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్.. ఐదేళ్ల పాటు అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ఎలా పనిచేస్తుందో చెప్పేందుకు ఇవే అనేక ఉదాహరణలని పేర్కొన్నారు.

**మోదీ చెప్పేవి అవాస్తవాలు.. కాంగ్రెస్**

ప్రధాని నరేంద్ర మోదీ ట్వీట్లపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పందించారు. 'కర్ణాటకలో ప్రతిదీ బాగా అమలు చేస్తున్నాం. ఎవరైనా చెక్ చేసుకోవచ్చు. మేం ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం.. కాంగ్రెస్ మోడల్‌లో భాగంగా ఏయే హామీలు ఇచ్చామో.. అవన్నీ చేస్తున్నాం. ప్రధాని చెప్పినవి అవాస్తవాలు. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వమే ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదు. పైగా మేం ఇవ్వడంలేదని నిందిస్తున్నారు" అని పేర్కొన్నారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో భారీగా డ్రగ్స్ పట్టివేత

## చందానగర్ పరిధిలోనూ..

**హైదరాబాద్(జనంసాక్షి):** హైదరాబాద్ శంషాబాద్ ఎయిర్ పోర్టులో శుక్రవారం భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. దాదాపు రూ.7 కోట్ల విలువ చేసే మాదక ద్రవ్యాలను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు ప్రయాణికులను అరెస్ట్ చేశారు. గురువారం దీపావళి పండుగ రోజు బ్యాంకాక్ నుండి డ్రగ్స్ స్మగ్లింగ్ జరుగుతోందని ఇంటలిజెన్స్ అధికారులు ఎయిర్ పోర్టు డీఆర్ఐ అధికారులకు సమాచారం అందించారు. ఇంజలిజెన్స్ సూచన మేరకు అప్రమత్తమైన డీఆర్ఐ అధికారులు ఎయిర్ పోర్టులో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలోనే బ్యాంకాక్ నుండి శంషాబాద్ ఎయిర్ పోర్టుకు వచ్చిన ఇద్దరు ప్రయాణికులపై అనుమానం రావడంతో వారిని అడ్డుకుని అధికారులు సోదాలు చేశారు. వారి చెక్-ఇన్



లగేజీని తనిఖీ చేయగా.. 13 ప్యాకెట్లలో గంజాయికి సంబంధించిన హైడ్రోపోనిక్ డ్రగ్స్?ను గుర్తించారు. నిందితుల నుండి 7.096 కిలోల హైడ్రోపోనిక్ డ్రగ్?ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్ స్లగ్మింగ్ చేస్తోన్న ఇద్దరిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అనంతరం ఇద్దరిని జ్యుడీషియల్ కస్టడీకి రిమాండ్ చేశారు.

**చందానగర్ పరిధిలో భారీగా డ్రగ్స్ పట్టివేత**

హైదరాబాద్ శివారు చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో నార్కోటిక్ డ్రగ్స్ కంట్రోల్ అధికారులు భారీగా డ్రగ్స్ పట్టుకున్నారు. నిందితుడి నుంచి 155 గ్రాముల ఎండీఎంఏను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన డ్రగ్స్ విలువ రూ.18 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన కృష్ణారామ్ గురువారం హైదరాబాద్‌కు వచ్చాడు. తనతో పాటు ఎండీఎంఏ డ్రగ్స్ తీసుకువచ్చి విక్రయిస్తున్నాడు. పక్కా సమాచారంతో నార్కోటిక్ డ్రగ్స్ కంట్రోల్ అధికారులు లింగంపల్లి గుల్ మోహర్ పార్క్ వద్ద ఇంట్లో తనిఖీలు చేపట్టారు. మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుని చందానగర్ పోలీసులకు అప్పగించారు. నిందితుడు కృష్ణారామ్‌తో పాటు ఏడుగురిపై కేసు నమోదు చేశారు. మరో మగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నారు. మెయిన్ పెడ్లర్ కృష్ణారామ్‌కు నిందితులు లోదారం రామ్, విక్రమ్ సింగ్, పునిత్, సమీర్ రామ్ సింగ్ డ్రగ్స్ విక్రయాలు జరుపుతున్నట్లు దర్యాప్తులో వెల్లడైందని చందానగర్ సీఐ పాలవెల్లి తెలిపారు. ఈ కేసులో నిందితులైన సమీర్, లోదా రామ్‌ను చౌటుప్పల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. ఆ ఇద్దరినీ పీటీ వారెంట్‌తో అదుపులో తీసుకొని విచారిస్తామని చెప్పారు. కృష్ణారామ్ స్నేహితుడు రూపారాం డ్రగ్స్ గురించి పోలీసులకు సమాచారం ఇచ్చాడన్నారు. పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు సీఐ వివరించారు.

# కరీంనగర్‌లో బీసీ కమిషన్ బృందం ప్రజాభిప్రాయ సేకరణ




కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 01 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల నుండి అభ్యర్థనలు స్వీకరించేందుకు వీలుగా తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ నేతృత్వంలోని సభ్యుల బృందం శుక్రవారం కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ జరిపింది. కమిషన్ విధివిధానాల గురించి చైర్మన్ క్లుప్తంగా వివరించారు. అనంతరం ఆయా పార్టీలు, వివిధ సంఘాల నాయకులు, ప్రజల నుండి కమిషన్ కు రాతపూర్వకంగా విజ్ఞాపనలను స్వీకరించింది. బహిరంగ విచారణ ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. అంతకుముందు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయానికి చేరుకున్న కమిషన్ బృందానికి కలెక్టర్ పమేలా సత్పతి పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు.

### బీసీల లెక్క తేల్చేందుకే సర్వే

రాష్ట్ర జనాభాలో బీసీల లెక్క తేల్చేందుకే రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉపాధి, సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిస్తుందని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖరారు చేసే విషయమై వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ లోని కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉమ్మడి జిల్లా స్థాయిలో బహిరంగ విచారణ చేపట్టారు. బీసీ కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మితో కలిసి నాలుగు జిల్లాల నుంచి తరలివచ్చిన బీసీ సంఘాల నాయకులు, కులస్తుల అభిప్రాయాలు తెలుసుకొని విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ కుల సంఘాల నాయకులు మాట్లాడారు. తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆర్థికంగా అండగా నిలవాలని కోరారు. రాజకీయంగా వెనుకబడి ఉన్నామని, మా పిల్లలకు ఉన్నత చదువులు చెప్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాము వెనుకబడ్డామని, వేరే కులంలో చేర్చాలని విన్నవించారు. బీసీ మహిళా రిజర్వేషన్లు కూడా కల్పించాలని కోరారు.

### విజ్ఞప్తులు స్వీకరణ..

ఈ సందర్భంగా నాలుగు జిల్లాల వారీగా వచ్చిన అర్జీలను స్వీకరించారు. తమకు వచ్చిన అర్జీలను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని సభ్యులు పేర్కొన్నారు. అర్జీలు అందించేందుకు వచ్చిన కుల సంఘాల నాయకులకు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా హెల్ప్ డెస్క్ , రిజిస్ట్రేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి, పెద్దపల్లి కలెక్టర్ శ్రీ కోయ హర్ష, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పుష్ప సినిమా సీన్‌లోలాగా ఆయిల్ ట్యాంకర్‌లో

# గంజాయి తరలింపు

- 2.90 క్వింటాళ్ల గంజాయి స్వాధీనం
- పక్క సమాచారంతో గంజాయి పట్టివేత
- ఎస్ పి శ్రీనివాసరావు వెల్లడి



కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో (జనం సాక్షి) : పుష్ప సినిమాను తలపించే విధంగా ఎవరికి అనుమానం రాకుండా మహారాష్ట్ర కు చెందిన ముఠా గంజాయి తరలింపుకు పూనుకుంది. వివరాల్లోకి వెళితే కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా పోలీసు అధికారి డి .వి శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం గురువారం వాంకిడి చెక్పోస్ట్ వద్ద ఎస్సై ప్రశాంత్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానస్పదంగా ఆల్ టాంకర్ కనిపించడంతో లారీ కంటైనర్ ను ఆపి తనిఖీలు చేయగా అందులో అక్రమంగా తరలిస్తున్న 2 క్వింటాళ్ల 90 కిలోల గంజాయి పట్టుబడినట్లు ఎస్ .పి తెలిపారు. దీని విలువ రు.72 లక్షల 50 వేలు ఉంటుందని పేర్కొన్నారు. లారీ డ్రైవర్ బల్వీర్ సింగ్ ను అదుపులోకి తీసుకొని విచారించగా తాను రాజమండ్రి నుండి మధ్యప్రదేశ్ కు గంజాయి రవాణా చేస్తున్నట్లు తెలిపారు. మహారాష్ట్రకు చెందిన అరవింద్ అనే వ్యక్తి తనను గంజాయి రవాణా కోసం రాజమండ్రి కి పంపించినట్లు ఎస్పి వివరించారు. తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు ఈ గంజాయి రవాణా వాహనాన్ని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈ గంజాయి అక్రమ రవాణా వెనుక ఎవరెవరు ఉన్నారు? అనే కోణంలో పోలీస్ బృందాలను మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ కు పంపిస్తున్నట్లు ఎస్పి శ్రీనివాసరావు వివరించారు. గంజాయి రవాణాను సినిమా హీరో అల్లు అర్జున్ పుష్ప సినిమాలో గంధపు చెక్కలను తరలించే స్టైల్లో ఈ గంజాయి రవాణా సరఫరా జరిగి పట్టుకోవడం జరిగిందని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్పీ శ్రీనివాస్ రావు తో పాటు డి.ఎస్.పి కరుణాకర్, వాంగిడి సిఐ సత్యనారాయణ, ఆసిఫాబాద్ సిఐ రవీందర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రాణా ప్రతాప్, వాంకిడి ఎస్ఐ ప్రశాంత్ లు పాల్గొన్నారు.

## బాలికపై నలుగురు మైనర్ల లైంగికదాడి

వికారాబాద్,నవంబర్1(జనంసాక్షి) : వికారాబాద్ జిల్లాలో దారుణం చోటు చేసుకుంది. ఎనిమిదో తరగతి చదవుతున్న 13 ఏళ్ల బాలికపై 4గురు మైనర్లు లైంగిక దాడికి పాల్పడటం స్థానికంగా కలకలం రేపింది. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ముబావంగా ఉన్న బాలికను తల్లిదండ్రులు ప్రశ్నించడంతో జరిగిన ఘోరాన్ని వివరించింది. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసు లు నలుగురు మైనర్లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం.

# రైతుపై దహేగం ఎస్ఐ కర్కశత్వం

- పాదం కింది భాగంలో ఇనుప రాడుతో వాతలు, గొంతు నులుమట
- భార్య సంగీత పట్ల అసభ్య దుర్భాషలాట



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో (జనం సాక్షి) : పోలీసులు అంటేనే ప్రజల మాన ప్రాణ లను కాపాడేవారు.., ఫ్రెండ్లీ పోలీస్, రక్షక బట్టలు.. ఇలా చెప్పుకుంటూ పోతే పోలీసులకు ఎంత గొప్ప పేరు ఉందో.. కొంతమంది పోలీసు అధికారులు, పోలీసుల ప్రవర్తన, వ్యవహార శైలితో ప్రజల్లో పోలీసులపై దురాభిప్రాయం, అపవాదు సైతం ఉంది. వివరాల్లోకి వెళ్తే కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దహేగామ్ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ కే .రాజు వ్యవహరించిన తీరు పట్ల సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. గ్రామానికి చెందిన కొంతమంది రైతులు తమకు చెందిన వ్యక్తి ఆవులను హత మారుస్తున్నారని, గాయపరుస్తున్నారని ఐ నం గ్రామానికి చెందిన రైతు ఎల్ములే బాపూరావు ( 40) అనే రైతుపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో దహగాం సబ్ ఇన్స్పెక్టర్ కె. రాజు ఐ నం గ్రామానికి చెందిన ఎలుములే బాపురావును పోలీస్ స్టేషన్కు పిలిపించి తనదైన స్టైల్ లో ఇంటరాగేషన్ మొదలుపెట్టారు. ఎస్సై హద్దు మీరీ రైతు బాపురావు పై థర్డ్ డిగ్రీ ప్రయోగించినట్లు బాధిత రైతు బాపురావు, ఆయన భార్య సంగీత ఆరోపిస్తున్నారు. ఈ విషయం సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతూ వైరల్ అయింది. గురువారం ఉదయం పోలీస్ స్టేషన్కు బాబురావును పిలిపించి పశువులను చంపావని, గాయపరుస్తున్నావని ఈ విషయంలో నేరం ఒప్పుకోవాలని తీవ్రంగా కొట్టడంతో పాటు, థర్డ్ డిగ్రీ ప్రయోగించినట్లు వారు పేర్కొన్నారు. ఎస్సై రాజు తన గొంతు నలిపి చంపుతానని బెదిరించారని, అంతటితో ఆగకుండా తన పాదాల కింది భాగంలో ఎర్రగా కాల్చిన ఇనప రాడుతో వాతలు పెట్టారని బాధిత రైతు బాపు రావు విలపిస్తూ తెలపడం పలువురిని విస్మయానికి గురిచేస్తుంది. తన భర్త గురించి విషయం అడిగేందుకు పోలీస్ స్టేషన్ కు వచ్చిన బాపురావు భార్య సంగీత పట్ల సదరు ఎస్ ఐ రాజు అమర్యాదగా, అసభ్యకరంగా ప్రవర్తించి నోటికి వచ్చినట్లు బూతులు తిట్టినట్లు సంగీత పేర్కొన్న వీడియో వైరల్ అయింది. తన భర్త బాపురావు వద్ద గల సెల్ ఫోన్ ను లాక్కొని త నపట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని సంగీత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తన భర్తను చిత్రహింసలకు గురి చేయడంతో కోమలోకి వెళ్లిపోవడంతో పోలీస్ స్టేషన్ నుంచి తీసుకెళ్లాలని ఎస్సై బెదిరించాలని సంగీత తెలిపారు. దీనికి వారు నిరాకరించడంతో స్థానికంగా గల మెడికల్ షాప్ వ్యక్తితో ప్రాథమికంగా చికిత్స చేయించి , పోలీస్ వాహనంలో మంచిరాల్ లోని ప్రైవేట్ హాస్పిటలకు తరలించినట్లు బాధిత రైతు బాపురావు భార్య సంగీత పేర్కొన్నారు. మంచిరాల్లో చికిత్స పొందుతున్న ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విషయం వార్తల్లోకి ఎక్కింది. హాస్పిటల్లో బాపురావు ఆరోగ్య పరిస్థితి మెరుగుపడంతో పోలీస్ అధికారులు ద హేగాం మండలానికి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. అంతకు ముందు రోజు తన వరి పొలంలో పశువులు వచ్చి పంటకు నష్టం చేస్తున్నాయని,ఐనం గ్రామంలో గల పశువుల యజమానులకు బాబురావు తెలపడం జరిగిందని, బాబురావుకు తెలిసినవారు చెప్పడం గమనార్హం . ఏది ఏమైనప్పటికీ ఎస్సై రాజు బాధిత రైతు పట్ల ప్రవర్తించిన తీరు పట్ల అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. సాధారణ రైతు ముఖ్యంగా పశువుల కేసు విషయంలో ఎస్. ఐ రాజు హద్దు మీరి అతిగా ప్రవర్తించిన వ్యవహార శైలి కరెక్ట్ కాదని విశ్లేషకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. బాధిత రైతు దేశద్రోహం చేయలేదని, పెద్ద నేరస్తుడు కాదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ద హగం ఎస్సై రాజు వ్యవహరించిన తీరుపై కాగజ్ నగర్ రూరల్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ను వివరణ కోరగా బాధిత రైతు బాబురావు కాస్త అనారోగ్యంతో ఉండడంతో మంచిర్యాల్ ప్రైవేట్ హాస్పిటల్కు తరలించి చికిత్స అందించినట్లు తెలిపారు. ఈ విషయంలో పూర్తిస్థాయిలో విచారణ చేసిన తర్వాత చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

## కాంగ్రెస్ కమిషన్‌లా బిసి కమిషన్

- కమిషన్ విచారణకు హాజరైనా సమయమివ్వలేదు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శలు



కరీంనగర్, నవంబర్ 1 (జనంసాక్షి) : బీసీ కమిషన్ పనితీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బీసీ కమిషన్ కాంగ్రెస్ కమిషన్‌లా తయారైందని ఆరోపించారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కమిషన్‌ను కోరాం. భారాస తప్ప ఇతర పార్టీల నుంచి ఎవరూ రాలేదు. కాంగ్రెస్, భాజపా నేతలు ఎందుకు రాలేదు? కొత్త కమిషన్ వేయాలని కోర్టు చెప్పిన తర్వాత అభిప్రాయ సేకరణ ఎందుకని కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు.స్థానిక సంస్థల రిజర్వేషన్లపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం శుక్రవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన బహిరంగ విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమిషన్ మీద ఉన్న గౌరవంతో ఇక్కడికి వస్తే మాట్లాడేందుకు సమయం కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ నుంచి ఒక్కరు కూడా కమిషన్ ముందుకు రాలేదని, కమిషన్ మీద కాంగ్రెస్‌కు నమ్మకం లేదు కాబట్టే ఎవరు రాలేదని ఎద్దేవా చేశారు. డెడికేటెడ్ కమిషన్‌తోనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. హైకోర్టు తీర్పుకు అనుగుణంగా ప్రభుత్వం నడుచుకోవాల్నారు. కాగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రాజకీయ పార్టీలు, బీసీ సంఘాల ప్రతినిధులు ప్రజలు అభిప్రాయాలు చెప్పేందుకు భారీగా తరలివచ్చారు. సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ విచారణ కొనసాగనున్నది. వచ్చే నెల 13 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో బీసీ కమిషన్ బహిరంగ విచారణ చేపట్టనున్నది.కాంగ్రెస్ నుంచి ఒక్కరు కూడా కరీంనగర్‌లో బీసీ కమిషన్ బహిరంగ విచారణకు రాలేదని భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. బహిరంగ విచారణలో ఆయనతో పాటు భారాస నేతలు నిరసన తెలిపారు. కమిషన్ మీద కాంగ్రెస్ నేతలకు నమ్మకం లేనందునే ఎవరూ రాలేదన్నారు. 'బీసీ కమిషన్‌కు విలువ లేదని హైకోర్టు చెప్పింది. దాని మీద ఉన్న గౌరవంతో ఇక్కడికి వచ్చాం. కానీ మాకు మాట్లాడటానికి సమయం కూడా ఇవ్వలేదన్నారు.

## మావోయిస్టు లేఖలో అసత్య ఆరోపణలకు ఖండన

- మాజీ సర్పంచ్ శ్రీపతి బాపు



మహాదేవపూర్, నవంబర్ 1 (జనంసాక్షి) : మావోయిస్టు రాష్ట్ర కమిటీ పేరిట విడుదలైన లేఖలో తనపై చేసిన అసత్య ఆరోపణలను ఖండిస్తున్నట్లు మహాదేవపూర్ మాజీ సర్పంచ్ శ్రీపతిబాపు శుక్రవారం తమ ప్రకటనలో పేర్కొన్నారు. దళిత బంధు పథకం పేరుతో ఏ ఒక్కరిదగ్గరి నుండైనా డబ్బులు వసూలు చేసినట్లు మీరు నిరూపిస్తే ప్రజాక్షేత్రంలో ఎలాంటి శిక్షకైనా నేను సిద్ధంగా ఉంటానని అన్నారు.ఒక నిరుపేద కుటుంబం నుండి,కష్టపడి పైకి వచ్చినవాడినని,ప్రజా సమస్యలపై నిరంతరంగా పోరాడే స్వభావం,ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజా సేవలో రాణిస్తున్నానని శ్రీపతి బాపు అన్నారు.

## నిర్మల్ వాసికి సౌదీ అరేబియాలో ఉత్తమ అవార్డు



నిర్మల్, నవంబర్ 1 (జనంసాక్షి) : నిర్మల్ పట్టణానికి చెందిన సయ్యద్ ముజహిద్ అలీ కు శుక్రవారం సౌదీ అరేబియాలోని రియాద్ పట్టణంలో షాహిన్ గ్రూప్ ఆఫ్ ఎక్సలెన్స్ తరుపున ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందజేశారు. సయ్యద్ ముజాహిదీను పలువురు చరవాణి ద్వారా అభినందనలు తెలిపారు. ఇండియన్ అడ్మిన్స్‌అఫ్ ఇంచార్జి, డైరెక్టర్ ఖదీర్, ఆయస్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

## ఉద్యోగులు సమయపాలన పాటించాల్సిందే: కలెక్టర్

భువనగిరి, నవంబర్1 (జనంసాక్షి) : యాదాద్రి భువనగిరి కొత్త కలెక్టర్ హనుమంతరావు దూకుడు ప్రదర్శించారు. ఆలేరు స్పెషల్ ఆఫీసర్ విధులకు హాజరుకాకపోవడంతో అతడికి కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సమయ పాలన పాటించని ఆలేరు పిహెచ్ సి వైద్య సిబ్బందిపై వేటు వేశారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. తనిఖీలతో ఉద్యోగుల్లో వణుకు పుట్టించారు. సమయ పాలన పాటించాలని గట్టిగా ఆదేశాలు ఇచచారు.

## పలు ఆలయాల్లో చోరీలు

వరంగల్, నవంబర్1 (జనంసాక్షి) : వరంగల్ జిల్లాలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఆలయాలే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడ్డారు. వర్ధన్నపేటలోని కోనారెడ్డి చెరువు వద్ద ఉన్న దుర్గమ్మ, పెద్దమ్మ ఆలయాల్లో చోరీకి పాల్పడ్డారు. దుండగులు అమ్మవారి నగలు అపరించుకుపోయారు. ఆలయాల్లోని హుండీలు పగులగొట్టి నగదు ఎత్తుకెళ్లారు. అలాగే ఆలయాల పక్కనే ఉన్న ఓ మిల్లులో కూడా నగదు ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పూర్తి విరాలు తెలియాల్సి ఉంది.

# ఇళ్ల జాబితా తయారీ పకడ్బందీగా చేపట్టాలి

- ప్రతి ఇంటికి వెళ్లి స్టిక్కరింగ్ వెయ్యాలి...
- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.



ములుగు ప్రతినిధి, నవంబర్ 05(జనంసాక్షి).: ఎనుమరేషన్ బ్లాక్ లో ఇళ్ల జాబితా తయారీ పకడ్బందీగా చేపట్టాలనీ, ప్రతి ఇంటికి వెళ్లి స్టిక్కరింగ్ వెయ్యాలని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నూగురు వెంకటాపురం మండలంలోని బొల్లారం, నూగురు, చొక్కాల గ్రామాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 6వ తేదీ నుండి చేపట్టే సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే లో భాగంగా హౌస్ లిస్టింగ్ ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి స్టిక్కరింగ్ చేస్తున్న తీరును జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం ఏటూరునాగారం మండలంలోని ముళ్ళకట్ట గ్రామంలో హౌస్ లిస్టింగ్ ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి స్టిక్కరింగ్ చేస్తున్న తీరును జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా లోని ప్రతి ఎనుమరేషన్ బ్లాక్ లో ఒక్క ఇల్లు కూడా వదిలివేయకుండ ఇళ్ల జాబితా తయారీ పకడ్బందీగా చేపట్టాలనీ, ప్రతి ఇంటికి వెళ్లి స్టిక్కరింగ్ వేయాలని అధికారులను సూచించారు. హౌస్ లిస్టింగ్ చేయు సమయం లో ఇంటి యజమాని పేరు, ఫోన్ నంబర్ నమోదు చేసుకోవాలని తెలిపారు. మండల అభివృద్ధి అధికారులు, మండల తాహసిల్దార్లు, మండల పంచాయతీ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శులతో, ఎనిమిరేటర్స్, సూపర్వైజర్లతో సమన్వయం చేసుకొని ఏ రోజు ఏ గ్రామం నందు, ఏ వార్డు నందు హౌస్ లిస్టింగ్ జరుగుతుందో దానికి సంబంధించిన వివరాలు ప్రజలందరికీ ముందస్తు గా తెలియచేయాలని సూచించారు. శనివారం, ఆదివారం రెండు రోజులు హౌస్ లిస్టింగ్ ద్వారా ప్రతి ఇంటికి వెళ్లి స్టిక్కరింగ్ చేయడం, ప్రతి ఇంటికి సంబంధించిన వివరాలు తీసుకోవడం కొరకు ఎనుమరేటర్స్ ఇంటింటికి రావడం జరుగుతుందనీ, జిల్లా ప్రజలందరూ వారు వారి ఇంటి వద్ద ఉండాలని ఈ యొక్క సర్వేకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## రైతులను తక్షణమే ఆదుకోవాలి




బెల్లంపల్లి, నవంబర్ 1, (జనంసాక్షి) : అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండు బానేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం నెన్నెల మండల కేంద్రంలో మండల కమిటి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు గత రెండు రోజులుగా కుండ పోతగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా, ఈదురు గాలుల వలన పంట నేలమట్టం అయి రైతన్నలు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. అప్పులు చేసి వేసిన పంట అర్ధాంతరంగా ప్రకృతి విలయానికి ఆవిరైపోతుంటే దిక్కు తోచని స్థితిలో గుండె పగిలేలా రోదిస్తున్న రైతు కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వము వెంటనే ఆదుకోవాలని, పంటనష్టాన్ని వ్యవసాయ అధికారులు అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందించాలని అన్నారు. పత్తికి ఎకరాకు 40 వేల రూపాయలు, వరికి ఎకరాకు 20వేల రూపాయలు, పెంపుడు జంతువులు మరణిస్తే ఒకదానికి 30 వేల రూపాయలు ఇవ్వాలని కోరారు.

## గోల్ఫ్ ఆడాలంటే శారీరక, మానసిక బలం కావాలి

- ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ జెర్సీ ఆవిష్కరణలో గవర్నర్

హైదరాబాద్, నవంబర్1 (జనంసాక్షి) : గోల్ఫ్ లో విజయం సాధించాలంటే మానసికంగా బలం అవసరమని తెలంగాణ గర్నర్ జిష్ణు దేవ్ వర్ అన్నారు. శారీరక బలంతో పాటు గోల్ చేసే నైపుణ్యం ఇక్కడ ముఖ్యమని అన్నారు. అప్పుడే గెలుపు సాధ్యమని చెప్పారు. శ్రీనిధి యూనివ్సిటీ తెలంగాణ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్ జెర్సీ లాంఛ్ కార్యక్రమానికి ముఖ్యఅధిగా హాజరయ్యారు జిష్ణు దేవ్ వర్మ. ఈ సందర్భంగా టీపీజీఎల్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. గతంలో డంప్ యార్డ్ గా ఉన్న ప్రాంతాన్ని అందమైన గోల్ఫ్ కోర్స్ గా చేసినందుకు అభినందించారు. మన ప్రాంతంలో గోల్ఫ్ అభివృద్ధికి ఈ లీగ్ ఉపయోగ పడుతుందన్నారు. మనిషి ఎలా ప్రవర్తించాలో గోల్ఫ్ నేర్పిస్తుందన్నారు. గత 15 ఏళ్లుగా గోల్ఫ్ స్టిక్ పట్టుకోలేదని.. మళ్ళీ ఇపుడు మొదలుపెడతానని చెప్పారు. వారసత్వ సంపద, పర్యావరణ హితంగా ఉన్న ఈ గోల్ఫ్ క్లబ్ తనకు బాగా నచ్చిందన్నారు. బహుశా త్వరలో తనను గోల్ఫ్ క్లబ్ లో చూడొచ్చని గవర్నర్ చెప్పారు .



# గూడూరు చరిత్ర

**ప్రపంచీకరణ దేశవ్యాప్తంగా వివిధ సామాజిక, ఆర్థిక రాజకీయ రంగాలను ప్రభావితం చేసినట్లే దానికి సమాంతరంగా అస్తిత్వ ఉద్యమాలు సాగుతున్నాయి. తెలంగాణలో మలిదశ ఉద్యమం ప్రారంభమైన తరువాత ఇక్కడి చరిత్ర సాహిత్య సాంస్కృతిక రంగాలలోని మూలాలను అన్వేషిస్తూ అనేకమంది కవులు, రచయితలు ఇక్కడి చరిత్రను వెలికితీస్తున్నారు.**

సుమారు పదివేలకు పైగా, పాటలు దాదాపు అదే సంఖ్యలో గ్రంథాలు వెలువడ్డాయి. ఇవి ఒకరకంగా జరుగుతున్న ఉద్యమానికి సిద్ధాంత నేపథ్యాన్ని సమకూర్చి బలపరిచాయి. ఇది ఒక గుణాత్మకమైన మార్పు. ఈ నేపథ్యంలో తరతరాలుగా గ్రామాలలో ఉంటూ తమ ఉనికికి , ఉన్నతికి కారణమైన దాని మూలాలను, అది అందించిన మూల్యాలను మరవలేక గ్రామాన్ని విడిచి వెళ్లినా తమ వ్యక్తిత్వం పై వికాసంపై అది వేసిన బలమైన ముద్రను కాదనలేక తాము పొందిన స్ఫూర్తిని అక్కడి వారు కూడా పొందాలని అనేకమంది రచనలు చేస్తున్నారు. అలాంటి విశిష్ట వ్యక్తులలో పాలకుర్తి మండలం గూడూరుకు చెందిన పాలడుగు రత్నాకర్ రావు ముఖ్యులు. గూడూరు గ్రామ వారసత్వంగా పట్వారి బాధ్యతలను నిర్వహించిన రత్నాకర్ రావు ఆ గ్రామ విజ్ఞాన సర్వస్వంగా గూడూరు చరిత్రను వెలువరించారు. నిరంతర అధ్యయనం, పరిశీలన ,వాస్తవిక దృష్టి వెరసి ఆయనను ఈ రచనకు పురికొల్పాయి. 238 పుటలు గల ఈ గ్రంథం శాతవాహనుల కాలం నుంచి నేటి దాకా చోటు చేసుకున్న పరిణామాలను వివరించారు. గ్రామానికి పడమర దిశన ఉన్న పాటిగడ్డ లో బౌద్ధ ,జైన, శైవ, వైష్ణవ మతాలకు చెందిన విగ్రహాలు ఉన్నాయి. అంతేకాకుండా ఇటీవలనే ఇక్ష్వాకుల కాలం నాటి మహా తలవర నాణెములు లభించాయి. క్రీస్తు శకం 1124 కు చెందిన గూడూరు శాసనం చరిత్రలో ప్రసిద్ధమైనది. విరియాల వంశానికి చెందిన మల్లన పూర్వీకుల ప్రశంసతో పాటు తాను నిర్మించిన మల్లేశ్వర స్వామి ధూప దీప నైవేద్యాల కై ప్రక్కనున్న బమ్మెరను మధిర గ్రామంగా దానం చేసినట్లు ఉంది. 24-12-2024 నాటికి ఈ శాసనం వేయించి 900 సంవత్సరాలు పూర్తవుతాయి. ప్రామాణికమైన చంపకోత్పలమాల పద్యాలకు ఇది నిదర్శనం. నాడు పాటి గడ్డమీద ఉన్న ఊరు గుముడూరు నుండి గూడూరుగా మారిందని చెప్పారు. అలాగే గ్రామంలోని బొడ్రాయి ,పోచమ్మ కోమట్ల బొమ్మలు ,కట్ట మైసమ్మ, మాంకాలమ్మ, మల్లేశ్వర దేవాలయం, గడి ,మసీదు, బురుజు తదితర చారిత్రిక సాంస్కృతిక ఆధారాలను తెలిపారు .నాడు విరియాల మల్లన తవ్వించిన ఊర చెరువు సాగునీటికి, మాంకాలమ్మ బావి తాగునీటికి ఉపయోగపడుతున్నాయి. ఆసఫ్ జాహీల పరిపాలన కాలంలో వారి సామంతులుగా కోడూరు దొరలు పాలన సాగించారు. ఆనాటి వ్యవస్థను గూర్చి రాస్తూ భూమి పన్ను నిర్ధారణకు పట్వారి ,పన్ను వసూళ్లకు మా లీ పటేల్, గ్రామ రక్షణ పోలీస్- పటేల్ , సేథి సింది -కాపలాదారు నీరటి సాగునీటి నిర్వహణ బాధ్యతలు చేసేవారు. ఈ విషయాలు ఇప్పటి యువతకు తెలియవు. పాలడుగు రత్నాకర్ రావు చారిత్రక ఆధారాలతో పాటు అటు స్వాతంత్ర్య ఉద్యమంలో ముఖ్యంగా గూడూరు వాసులు నిర్వహించిన ప్రజా పోరాటాన్ని చిత్రించారు. గాంధీయవాదిగా స్వాతంత్ర్య సమరయోధులు చౌడవరపు విశ్వనాథం గారు, నిజాముకు అతని తాబేదారులైన దొరలకు, రజాకార్లకు, వ్యతిరేకంగా జ్యోతి మల్లయ్య




నాయకత్వంలో తిరుగుబాటు చేశారు. బొబ్బల ఇంద్రసేనారెడ్డి గ్రామ జ్యోతి గోడపత్రికను, విశ్వనాథం గారు వెలుగు పత్రికను, భారతి పఠనాలాయాన్ని నిర్వహించారు. కోడూరు జగన్నాథ రెడ్డి, విశ్వనాథం, చుక్కారామయ్య, పూజారి కొమురెల్లి, వైట్ల పాపయ్య, సత్తయ్య , చక్రవర్తుల తిరుమలాచార్యులు ,జ్యోతి మల్లయ్య మొదలైన యోధులందరూ ఇక్కడి పీడిత ప్రజానీకం పక్షాన నిలచి పోరాడారన్నారు.

ఇంకా ఈ గ్రంథంలో వ్యవసాయరంగం, నీటిపారుదల ,పంటలు, చేతివృత్తులు, కులవృత్తులు, విద్యా, వైద్యం ,సాహిత్యం మొదలైన రంగాలలో గూడూరు సాధించిన ప్రగతిని విశ్లేషించారు. తెలుగు రాష్ట్రాలలో ఐ .ఐ .టి శిక్షణకు సంబంధించి ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య చేసిన కృషి అనన్య సామాన్యమైనది . ఆయన దగ్గర శిక్షణ పొందిన వేలాది మంది విద్యార్థులు ఈనాడు దేశ విదేశాలలో పనిచేస్తున్నారు. ఆయన చేసిన పోరాటం వల్లే రాష్ట్రానికి ఐ.ఐ.టి వచ్చింది. విద్యారంగానికి సంబంధించి ఇప్పటికే ఆయన 50 కి పైగా పుస్తకాలు రాశారు. గూడూరు బడికి ,గుడికి తన చేయూతనందించారు. గ్రామంలో విద్యా ,సాహిత్య, సామాజిక, రంగాల వికాసం కోసం ఏర్పాటైన శ్రీ పోతన చైతన్య వేదిక అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుంది. గూడూరు గ్రామానికి చెంది వివిధ రంగాలలో స్థిరపడిన అనుముల ఎల్లయ్య, ఆర్తి పరాంకుశం, సాహితీవేత్త య ల్లంభట్ల నాగయ్య, పాలడుగు రత్నాకర్ రావు ప్రభృతులు శక్తివంచన లేకుండా నిరంతరం గ్రామాభివృద్ధి కి తోడ్పడుతున్నారు. చరిత్ర రచన కత్తి మీద సాము లాంటిది . శాసనాలు, గ్రంథాలు, శిల్పాలు, నాణెములు అన్నింటికీ మించి నిష్పాక్షికత ,సత్యదృష్టి, ఆధారాలు ప్రధానమైనవి. అందుకు ఎంతో శ్రద్ధ, శ్రమ అవసరం. పాలడుగు రత్నాకర్ రావు వ్యయ ప్రయాసలు భరించి వెలువరించిన గూడూరు చరిత్ర స్థానిక యువతకు స్ఫూర్తినివ్వడమే కాకుండా తెలంగాణలోని మిగతా గ్రామాల చరిత్రల పరిశోధనకు స్ఫూర్తినిస్తుంది. అందుకు పాలడుగు రత్నాకర్ రావు కు అభినందనలు .

**డాక్టర్ శంకరమంచి శ్యాంప్రసాద్**
**9989148305**

# సత్యం సుందరం.. మంచి మనిషి సినిమా

**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్,
విశ్లేషకులు
**9951865223**



అంతా హంగామా, పుష్కల డిషుమ్ డిషుమ్,రొమాన్స్, ఒకటి, రెండు ఇమోషనల్ సీన్స్, వందల మందిని అలసిపోకుండా హీరో కొట్టడం, రైలు బోగి మీద, వేలాడుతూ ఫైట్ లు, తుపాకుల చప్పుళ్ళు, దహనాలు, హత్యలు, తీవ్ర మైన హింస గల సినిమాలు వస్తున్న క్రమం లో,అసలు మానవ సంబంధాలనే, బాంధవ్యాలనే మర్చి, డబ్బు వెంట పరుగులెత్తు తున్న మనిషి కి మానవ సంబంధాలను, ప్రేమ గల మనుషులు ఇంకా బతికే ఉన్నారు. మనిషి ఒక సారి తిరిగి చూడు అని చూయించే అద్భుతమైన సినిమా ఒకటి వచ్చింది.తమిళ నటులు జ్యోతిక, సూర్యలు నిర్మించిన తమిళ చిత్రం తెలుగులో సత్యం సుందరం పేరిట డబ్ చేసారు. ఎక్కడ కూడ ఈ సినిమా డబ్బింగ్ సినిమా అనిపించదు.




### ఇంటిల్లిపాది చూడాలి

నిన్న ఒక మిత్రుడు ఆ సినిమా చూడుమని చెబితే నేను టీవీ లో కుటుంబ సమేతంగా ఇంటిలో కూర్చుని చూసాము. సినిమా చూస్తున్నంత సేపు మూడు, నాలుగు సార్లు నా కండ్లు నీళ్లు తీసుకున్నాయి.సూర్య తమ్ముడు కార్తి, సీనియర్ నటుడు రోజా సినిమా హీరో అర్వింద స్వామి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా స్టోరీ చాలా చిన్నదే, అదే ఉమ్మడి కుటుంబాల స్టోరీ ఇది, సత్యం గా అర్విండ్, సుందరం గా కార్తీ నటన అద్భుతం గా ఉంది. ఏడ్పించినా, నవ్వించినా కార్తీ నే విధంగా నటించాడు.ఆస్థి విభజన అనంతరం సత్యం తల్లి తండ్రులతో అయిష్టంగానే తంజావూరు వదిలి వైజాగ్ కు వచ్చేస్తాడు. పాత సైకిల్ ఒకటి వరుసకు బావమరిది అయిన బంధువుకు ఇచ్చి ఎవరికైనా అవసరం ఉన్న వాళ్లకు ఇచ్చేయండి అని వచ్చేస్తాడు.ఆ సైకిల్ కొంత రిపేర్ చేయించుకుని దానిని కార్తీ తండ్రి ఉంచేసుకుంటాడు! అంతే!చాలా సంవత్సరాల అనంతరం తండ్రి తన కొడుకు అయిన సత్యం ను చిన్నాన బిడ్డ పెండ్లికి తంజావూరు కు పంపిస్తాడు, వాస్తవానికి చాలా మందిని అప్పటికే సత్యం మర్చి పోతాడు!ఎవరికి వారు వచ్చి పరిచయం చేసుకుంటే తప్ప సత్యం కు గుర్తు ఉండదు!అక్కడ రిసెప్షన్ జరుగుతూ ఉంటుంది. అక్కడకు వెళ్లి వెనుక కుర్చీలో తన క్యారీ బ్యాగ్ తో సహా కూర్చున్న సత్యం ను అక్కడ పెట్టి ఉన్న డిజిటల్ స్క్రీన్ మీద వరుసకు మరదలు అయ్యే మహిళ సత్యం ను చూసి, కూర్చున్న కాడికి వచ్చి, బావా ఎప్పుడు వచ్చావని పలకరించి, తన గురించి కూడ కొద్ది సేపట్లోనే చెప్పేస్తుంది. ఆ పలకరింపు మాటలు సత్యం ను మానవ సంబంధాల్లోకి దింపుతాయి.ఈలోపు కార్తీ అక్కడికి చేరుకొని సత్యం ను బావా అని పల్కరిస్తాడు. చాలా విషయాలు మాట్లాడుతాడు. బాత్రూం కు దారి చూపే దగ్గరి నుంచి, నూతన దంపతులు ఉన్న స్టేజి వరకు తీసుకెళ్లడం,చేస్తాడు. సత్యం బ్యాగ్ భుజానికి వేసుకుంటాడు.అక్కడ సత్యంను చూడగానే పెళ్లి కూతురు, తన భర్తకు మా అన్న అని పరిచయం చేస్తుంది. అప్పుడు సత్యం అమె కోసం తెచ్చిన గిఫ్ట్ ప్యాక్ ఇస్తాడు, అక్కడే ఓపెన్ చేయించి కాళ్ళ పట్టిలను సైతం సత్యంతో




కాళ్లకు తొడిగించుకునే సీక్వెన్స్ అద్భుతంగా చిత్రీకరించారు. సత్యం రాత్రికే వెళ్లి పోయే హడావిడిలో ఉంటాడు, తండ్రి తో ఫోన్లో చిన్నానతో మాట్లాడిస్తాడు. ఫోన్ సంభాషణ కూడ పండింది. అక్కడి నుంచి భోజనం అనంతరం తన స్కూటీ మీద బస్సు కోసమని తీసుకెళ్లుతూ, ఒక టీ కొట్టు దగ్గర ఆపి బెల్లం చాయ్ తాగిపిస్తాడు, బస్సు ఈ మధ్యలో వీరికి బస్సు స్టాండ్ కు చేరే లోపు మిస్ అవుతుంది. లాడ్జి లు వెతికి అవి బాగా లేవని చూసి, అతి బలవంతం మీద కార్తీ ఇంటికి పడుకోడానికి సత్యం వెళ్ళక తప్పదు!అంతే అక్కడ నుంచి అసలు సినిమా ఉంటుంది.మనిషి తనం ఉట్టిపడుతుంది. ప్రతి సీను పండింది. బావను అడిగి కార్తీ బీర్ తెచ్చి తాగిపిస్తాడు, ఇద్దరు ఫుల్ గా తాగి మాట్లాడుకుంటారు. హాస్యం, దుఃఖం అన్నీ కనిపిస్తాయి. కార్తీ భార్య పలు మార్లు సత్యం కు అన్నా,ఏమైనా కావాలి అంటే పిలవండి అని చెప్పి వెళుతుంది. మీరు వెళ్ళాక మీ ముచ్చట్లే అన్నీ ఏడాది అంతా చెబుతాడు అని భర్త గురించి చెబుతుంది.ఎప్పుడు మిమ్మల్నే తలచుకుంటూ ఉంటాడు అని చెబుతుంది.సత్యం తండ్రి వదిలి వెళ్లిన సైకిల్ పై తన నాన్న బట్టలు పెట్టుకుని అమ్మే వాడని, మిగతా సమయాల్లో తానే నడిపే వాడినని ఆ సైకిల్ గురించి స్టోరీ చెప్పి చూయిస్తాడు. సైకల్ మీద సత్యం, కార్తీ కాసేపు తిరిగి ఎంజాయ్ చేస్తారు. తన భార్య కడుపుతో ఉందని,ఆడ, మగ బిడ్డ, ఎవరు పుట్టినా కలిసే విధంగా ఒక పేరు చెప్పు మని సత్యం ను అడుగుతాడు కార్తీ. ఏవేవో పేర్లు ప్రస్తావనకు వస్తాయి, చివరికి కార్తీ సత్య అని చెబుతాడు. అప్పుడు సత్యం తన బిడ్డకు తన పేరు పెట్టుకోనున్న, తన మీద ఇంత ప్రేమ చూపుతున్న కార్తీ ఎవరు? అని ఆందోళన పడిపోతూ ఉంటాడు.అక్కడ ఉన్న చిన్నప్పటి గ్రూప్ ఎన్సిసి ఫోటో లో దేవులాడుతాడు!అక్కడక్కడా ఇంటిలో వెతుకుతాడు!అతను ఎవరో తెలుకోడానికి, అడగడానికి మొహమాట పడిపోయి, తనలో తాను కుమిలి పోతూ ఉంటాడు.ఆ రాత్రి తన మంచం పక్కన కింద పడుకున్న కార్తీ తలకింద మంచం మీది దిండు పెట్టి,కార్తీ కి చెప్పకుండానే వైజాగ్ కు వచ్చేస్తాడు. అయినా కార్తీ ఎవరో తెలియాలి, తెలుసుకోవాలి. ఎలా?కార్తీ ఒక విసిటింగ్ కార్డు మీద రాసిన నంబర్ కూతురు వెతికి సత్యం కు ఆ నంబర్ కలిపి ఇస్తుంది. అప్పుడు కార్తీ అలా చెప్పకుండా వెళ్ళావు, ఎమ్ బావా అంటూ అమాయకంగా, నేను నీ నంబర్ కు ట్రై చేశాను, ఎవరెవరో ఎత్తారు, బహుశా నేను తప్పుగా రాసుకున్నానేమో అంటాడు, కాదు నేనే నీకు తప్పు నంబర్ ఇచ్చాను అంటాడు సత్యం, కార్తీ బాధపడుతాడు. చివరికి అసలు నీపేరు చెప్పు రా, నిజంగా నాకు తెలియదు అంటాడు, అప్పుడు నీవు ఇల్లు కొనడానికి డబ్బుల కోసం వెతుకున్నావు, అని,తనదగ్గర ఉన్నాయి ఇస్తాను,ఆ డబ్బులు తీసుకుంటానంటే చెబుతానని, అప్పుడు పేరు చెప్పకుండా తంజావుర్ లో ఉన్నప్పుడు సెలవుల్లో బంధువుల పిల్లలు వచ్చి సత్యం ఇంటిలో ఉండే వారు. అందులో, ఆ గుంపులో కార్తీ ఉండే వాడు, కార్తీ అప్పుడు చిన్నవాడు,అందరికన్నా పెద్ద వాడు అయిన సత్యం పిల్లలందరిని వెంటేసుకుని తిరిగే వాడు, కూరగాయలకు వెళ్లే సందర్భంగా ఒకరికి టమాటా, మిర్చి, ఆలుగడ్డ ఇలా ఎంత, ఎంత తెచ్చుడో అంత అంటే టమాటా మూడు కిలోలు ఒకరికి, ఆలుగడ్డ రెండు కిలోలు ఇలా వారు చెప్పుకుంటూ ఒకరి వెంట ఒకరు పరుగులు తీసుకుంటు వెళ్లేవారు, ఆ క్లూ ఒకటి పలు క్లూ ల అనంతరం కార్తి ఇస్తాడు, దీనితో కార్తీ ని అరే పొటాటో అంటాడు, అవును నేనే అంటాడు కార్తీ అయితే సత్యం ను అసలు పేరు చెప్పు అంటాడు, ఇంటికి వచ్చి చెబుతానని, వెంటనే తంజావూరు కు చేరుకుని కార్తీ ఇంటి తలుపులు కొడుతాడు, పేరు చెబితేనే తలుపు తీస్తానంటాడు, అరే పొటాటో, సుందరం అంటూ అరుస్తాడు సత్యం. తలుపు తెరుచుకుంటుంది. సినిమా ముగుస్తుంది!

సినిమాలో పాటలు రెండు బాగున్నాయి. ఒక పాట ను తమిళ్ వర్షన్ లో కమలహాసన్ పాడారు!తెలుగు లో ఇదే పాటను మధు క్రిష్ నన్ పాడాడు!సత్యం ముందు బస్సులో ఊరికి వస్తున్నప్పుడు కండక్టర్ తో సత్యం సంభాషణ బాగుంటుంది. కండక్టర్ కు సత్యం తండ్రి చదువు చెప్పిన టీచర్ అని చెబుతాడు! అడిగినట్లు చెబుతాడు. బంధుత్వాలు, దోస్తానాలు దెబ్బతింటున్న ప్రస్తుత పరిస్థితి లో వాటిని ఎలా మనిషి కలుపుతూ, గుర్తు చేస్తూ కనిపిస్తాడు ఈ సినిమాలో. మనిషి తనం మర్చిన మనుషుల్లో కొంత అయినా ఇలాంటి సినిమాలు మార్పును తీసుకుని రావాలి. ఏ ఆద్మీ ఇన్సాన్ బనో. అంటుంది. సత్యం సుందరం. మంచి సందేశాత్మక సినిమా తీసిన సూర్య, జ్యోతిక దంపతులకు అభినందనలు. ఒక్క ఫైట్, ఒక్క రొమాన్స్ సీన్ లేని ఇలాంటి సినిమాలు తీయడానికి కమిట్మెంట్, ధైర్యం కావాలి. కార్తీ, అర్విండ్ నటన అద్భుతం గా ఉంది. మిగతా పాత్రల్లోను అందరు బాగా నటించారు. అందరికీ అభినందనలు. నెట్ ఫ్లిక్స్ లో ఉంది. వెంటనే చూడండి.

# యువత రాజకీయాలు - ఆసక్తి ప్రభావం

నేడు ప్రపంచవ్యాప్తంగా రాజకీయ వ్యవస్థలో చోటు చేసుకున్న పరిణామాలు వర్తమాన రాజకీయాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతాయి. ముఖ్యంగా ప్రజాస్వామిక వ్యవస్థలో రాజకీయాలు ప్రజా సంక్షేమ దిశగా పయనించాలి. కానీ నేడు అనుసరిస్తున్న రాజకీయ విలువలు ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా, రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పవచ్చు. ప్రపంచంలోని దేశాలన్నింటిలో రాజకీయాలు పూర్తిగా కురువృద్ధులతో నిండిపోయింది. అయితే కొత్తగా రాజకీయాలలోనికి రావాలని యువత పెద్దగా ఆశ చూపడం లేదు. దీనికి ప్రధానమైన కారణం రాజకీయాలలో ధన ప్రభావం బాగా పెరిగిపోయింది. ఒక సర్పంచ్ కావాలన్నా 25 లక్షల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితులు నేడు ఉంది. రాజకీయాలలో ఖర్చులు పెరిగిపోతే ప్రజలపై దోచుకునే నాయకుడే రాజకీయ నాయకుడు అవుతాడు. నీతి, నిజాయితీ ప్రజాస్వామ్య విలువల పట్ల నమ్మకం ఉన్న నాయకులు నేడు కరువవుతున్నారు. అయితే వర్తమాన సమాజంపై ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుందని చెప్పవచ్చు. నేడు రాజకీయాలలో 80 సంవత్సరాలు పైబడిన వ్యక్తులు కూడా ఇంకా వ్యవస్థలోనే ఉంటున్నారు. కొత్తవారికి , యువతను ప్రోత్సహించడంలో దాదాపు భారతదేశంలో అన్ని రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్న తీరే అని చెప్పాలి. ప్రస్తుతం మనం ఎదుర్కొంటున్న సమస్యలను యువత రాజకీయాలు ప్రభావం వీటిని ఒకసారి పరిశీలిస్తే పూర్తిగా తెలిసిపోతుంది. యువత రాజకీయాలు అనేది యువతను ప్రత్యేకంగా ప్రభావితం చేసే, ప్రభావితం చేసే సమస్యల వర్గం . ఇది యువకులపై ప్రత్యేకంగా ప్రభావం చూపే యువజన విధానాన్ని కలిగి ఉంటుంది (ఉదాహరణకు, విద్య, గృహనిర్మాణం, ఉపాధి, విశ్రాంతి), సంస్థాగత రాజకీయాలు (ఎన్నికలు, రాజకీయ పార్టీ సభ్యత్వం ), యువజన సంస్థలు, జీవనశైలితో సహా యువత రాజకీయాల్లో ఎలా పాల్గొంటారు.

20వ శతాబ్దం ప్రారంభంలో యువ రాజకీయాలు 1930లలో అమెరికన్ యూత్ కాంగ్రెస్ ఏర్పాటుతో అమెరికన్ రాజకీయాల్లో మొదట గుర్తించబడ్డాయి . 1950లు, 1960లలో స్టూడెంట్ అహింసా కోఆర్డినేటింగ్ కమిటీ, స్టూడెంట్స్ ఫర్ డెమోక్రటిక్ సొసైటీ వంటి సంస్థలు యువత రాజకీయాలతో దగ్గరి సంబంధం కలిగి ఉన్నాయి, ఉదారవాద పోర్ట్ హురాన్ స్టేట్మెంట్ , కన్జర్వేటివ్ షారన్ స్టేట్మెంట్ , మార్టిన్ లూథర్ వంటి నాయకులు ,ఇది యువతపై ఆధారపడటం. వేగంగా మారుతున్న ఈ గ్రహం యొక్క క్రూరత్వం , అడ్డంకులు వాడుకలో లేని సిద్ధాంతాలు , అరిగిపోయిన నినాదాలకు లొంగవు. ఇప్పటికే చనిపోతున్న వర్తమానాన్ని అంటిపెట్టుకుని ఉన్నవారు, ప్రమాదం యొక్క ఉత్సాహం కంటే భద్రత యొక్క భ్రమను ఇష్టపడేవారు దీనిని కదిలించలేరు. ఇది యవ్వన లక్షణాలను కోరుతుంది: జీవిత సమయం కాదు, మానసిక స్థితి, సంకల్పం యొక్క స్వభావం, ఊహ యొక్క నాణ్యత, పిరికితనం కంటే ధైర్యం యొక్క ఆధిపత్యం, యూరప్లో కూడా యువ రాజకీయాలకు విస్తృతమైన చరిత్ర ఉంది. ఫ్రీ జర్మన్ యూత్ జర్మనీలోని సోవియట్ ఆక్రమణ జోన్లో 1946లో స్థాపించబడింది తూర్పు జర్మనీ అధికారిక యువజన సంస్థగా పనిచేసింది. యూకేలో ప్రధానంగా బ్రిటిష్ యూత్ కౌన్సిల్, యూకే యూత్ పార్లమెంట్, స్కాటిష్ యూత్ పార్లమెంట్లతో కూడిన బలమైన యువ రాజకీయ ఉద్యమం ఉంది. వారికి ప్రత్యక్ష అధికారం లేనప్పటికీ, ఈ సంస్థలలోని యువకులు పార్లమెంటు సభ్యులతో సన్నిహితంగా పని చేసే సంబంధాన్ని కలిగి ఉంటారు ప్రత్యక్ష మార్పు లేదా ప్రత్యక్ష లక్ష్యాలను తీసుకురావడంలో అసమర్థమైనప్పటికీ, వారు చాలా ప్రభావవంతంగా ఉంటారు. యువత ఉద్యమం కోసం పాటుపడే అనేక సంస్థలు పెరుగుతున్నాయి. యూత్ డిబేట్స్ అనేది ఒక ప్రముఖ సంస్థ, ఇది యువకులను రాజకీయ ప్రపంచంలోకి చేర్చాలనే లక్ష్యంతో ఒక ఆన్లైన్ సంస్థ.చెక్ రిపబ్లిక్ నుండి వచ్చిన పరిశోధన ప్రకారం, యువ ఎంపీలు తమ మధ్య వయస్కులైన సీనియర్ సహోద్యోగుల కంటే వారి శాసన విధుల్లో ఎక్కువ ఉత్పాదకత కలిగి ఉంటారు, రోల్ కాల్ వద్ద పార్టీ క్రమశిక్షణను సవాలు చేసే అవకాశం కూడా ఎక్కువగా ఉంది. ఇతర ఖండాలు అనేక రకాల యువ రాజకీయాలు , రాజకీయ ఉద్యమాలను చవిచూ శాయి. ఇటీవలి మెక్సికో అధ్యక్ష ఎన్నికల్లో యువత రాజకీయాలను అసలు ప్రపంచంలో ఎలా తీసుకుంటారు అనేదానికి మరో అభివ్యక్తి కనిపించింది, “ యో సోయ్ 132 ” అనే విద్యార్థి ఉద్యమం ఎన్నికలు ఎలా అభివృద్ధి చెందిందో, వారు భావించిన ఎన్నికల మోసానికి రుజువులను చూపడంలో చాలా ముఖ్యమైన మార్పు చేసింది. జరుగుతుంది, వారు పి ఆర్ ఐ అభ్యర్థి ఎన్రిక్ పెనా నీటో యొక్క అంగీకార శాతాన్ని మార్చారు , అభ్యర్థికి అత్యధిక పోల్ ఫలితాలు మరియు ఎన్నికల తుది ఫలితాల మధ్య దాదాపు 12 శాతం పాయింట్లను తగ్గించారు. భారతదేశంలో యువ రాజకీయ నాయకులు ముఖ్యమైన పాత్ర పోషిస్తు న్నారు. రిషబ్ ముకాటి భారతదేశపు అతి పిన్న వయస్కుడైన రాజకీయ నాయకుడు , నాయకుడు. యువత వారి కలలను సాకారం చేసుకోవడానికి, భారతదేశ యువశక్తిని మేల్కొల్పడానికి అతను క్రీడా కార్యక్రమాలు, వివిధ కార్యక్రమాలను నిర్వహించాడు. ప్రపంచ యువత



నేతృత్వంలోని నిరసన ఉద్యమాలలో యువకులు ఎక్కువగా పాల్గొంటున్నారు , ఉదాహరణకు, సామాజిక , పర్యావరణ న్యాయం గురించి యువకులు వివిధ సంక్షోభాల (రాజకీయ, సామాజిక, ఆర్థిక, పర్యావరణ) ముఖ్యంగా కాఠిన్యం కారణంగా ప్రభావితమ య్యారు కాబట్టి ఈ క్రియాశీలత కొంత భాగం . అంతేకాకుండా, యువకులు భౌతికవాద అనంతర విలువలను కలిగి ఉంటారు.

2.ఇప్పుడు భారతదేశంలోని అందరి దృష్టి నేటి యువతపైనే. ఆశలు కూడా యువతపైనే. దేశ భవిష్యత్తూ, జాతి భవిష్యత్తూ యువతపైనే చాలా వరకు ఉంది. ప్రస్తుతం భారతీయ సమాజంలోని విద్యావేత్తలు, మేధావులు, ధనవంతులు ఉన్న ప్రతి ఒక్కరూ పాలకవర్గం నాయకత్వంలో యువకులు పని చేయాల్సిందే. మనది గొప్ప ప్రజాస్వామిక దేశం. అందులో ప్రపంచంలోనే అతిపెద్ద దృఢ లిఖిత రాజ్యాంగం కలదు. ఆనాడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలకు మేలు చేయడానికి వారికి పాలకవర్గంలో చోటు కల్పించడానికి అవకాశం కల్పించారు. కానీ రాజ్యాంగంలోని లోసుగులను సవరణలు చేసుకుంటూ ప్రజాస్వామ్యంలో జరిగే ఎన్నికలకు డబ్బున్న వారికి అవకాశాలు కల్పించే విధంగా వాతా వరణం కల్పించి.. నేటికి ఇంత సాంకేతిక అభివృద్ధి గావించిన పేద, దళిత వర్గాలకు చెందిన పాలకవర్గం లోనికి రానివ్వకుండా జాగ్రత్తలు వహిస్తూ అల్ప సంఖ్యాక ప్రజలు పెత్తనం చెలాయిస్తు న్నారనడంలో ఎలాంటి శక్తి లేదు. కుల ప్రాతిపదికన సమాజం లోని పేదరికం విభిన్న కులాల్లో చదువుకున్న మేధావులు రాజ్యాం గాన్ని అర్థం చేసుకుని తమ హక్కుల సాధనకై తమ ప్రజలను చైతన్య పరుస్తూ ముందడుగు వరుసలో విభజించి-పాలించు అనే ధోరణితో ఎక్కడికక్కడ వర్గాలుగా చీల్చి అనేక్యతకు పాల్పడుతూ నామమాత్రపు అరకొర అవకాశాలు కల్పిస్తూ ఎలాంటి నిర్ణయాధికారాలు తీసుకోకుండా ఉత్సవ విగ్రహాలుగా మారుస్తున్నారనడంలో నిజం లేక పోలేదు. రాజ్యాంగపరంగా నామమాత్రంగా ఎన్నిక అవుతున్నారు తప్ప ! తమ ప్రజల కోసం చేయెలని అనుకున్నా పనులు చేయలేని పరిస్థితిలు అనడంలో ఎలాంటి వాస్తవం లేదు. రాజకీయ,విద్యా, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు వివిధ రంగాల్లో ఉన్నతమైన స్థానంలో నెలకొందన్నారు. కానీ నేడు పుట్టి పెరిగిన నేపథ్యంలోమొదటగా తమ కుటుంబాలను ఆర్థికంగా బలోపేతానికి కృషి చేస్తుంది. ప్రస్తుతం నెలకొంటున్న పరిమాణాల దృష్ట్యా రాజకీయంగా ఎలాంటి సాహసాలకు పూనుకోవడం లేదనడంలో నిజం లేక పోలేదు. సమాజంలోని మహిళలకు రాజ్యాంగ పరంగా 33 శాతం రిజర్వేషన్ కలిగి ఉన్నది. గత కొంతకాలంగా పురుషులకు సరిసమానంగా అన్ని రకాల కార్యకలాపాల్లో పాల్గొంటూ తమకు ఎవరూ సాటి లేరులి అని నిరూపిస్తూ చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కావాలని పోరాడుతూ వస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో అక్కడక్కడ మహిళల పెత్తనం, అధికారం పురుషులు చూసుకుంటున్నారు. రాజ్యాంగ పరంగా మహిళలు ఎన్నికైన వారిని అడ్డం పెట్టుకుని మగవారి అధికారం చెలాయిస్తూ రాజకీయంగా ఎదగనివ్వకుండా లేదు అని అనడంలో ఎలాంటి అబద్ధం లేదు. ఇంటికి దీపం ఇల్లాలు అంటారు. ప్రస్తుతం అధిక శాతం కుటుంబంలోని మహిళలు నిర్ణయమే శిరోధార్యం. అలాంటి కుటుంబాలే అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాయని అనడంలో సైతం జగమెరిగిన సత్యం. వారికి పూర్తి స్వేచ్ఛ అవకాశం ఇస్తే వారి తెలివిని రుజువు చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. అంతెందుకు దేశానికి ఇందిరాగాంధీ ప్రధానమంత్రిగా పగ్గాలు చేపట్టిన ఒక మహిళా శక్తి ఏమిటో నిరూపించ లేదా ? అలాంటిది ప్రస్తుతం రాజకీయ పట్ల మహిళామణులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. నిస్వార్థ పూరిత పాలన జరగాలంటే ముందుగా పౌరులందరికీ రాజకీయ చైతన్యం రావాలి. ప్రతి ఒక్కరికి రాజ్యాంగం పట్ల అవగాహన హక్కులు విధులు గురించి పూర్తిస్థాయిలో తెలిసి ఉండాలి. సమాజంలోని ఎవరి జనాభా ఎంత ? వారు పొందే అవకాశాలెన్ని ? జరగాల్సిన అభివృద్ధి ఎంత ? ఆర్థిక వనరులు ఎలా ఉన్నాయి ? తక్షణమే చేయాల్సిన కార్యకలాపాలు ఏమిటి ? ఎక్కడ అన్యాయం జరుగుతుంది? పాలక పక్షాలు అనుసరిస్తున్న తీరు ఎలా ఉంది? వాటిని అరికట్టే మార్గాలు ఏమిటి ? ప్రతిపక్ష పాత్ర ఎలా ఉండాలి ? ప్రసార సాధనాలు పనితీరు ఎలాంటి ఉండాలి? ప్రతి పౌరుడు బాధ్యతా యుతంగా ఎలా ప్రవర్తించాలి ? సమయానికి అనుగుణంగా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి ? ఇలాంటి పలు రకాల పై అంశాల పట్ల ప్రతి పౌరుడికి అవగాహన ఉండాల్సిన అవసరం ఉంది. అందుకే రాజ్యాంగం పట్ల, సామాజిక పట్ల అవగాహన కల్పించే పాఠ్యాంశాలు పాఠశాల విద్య నుండి వయస్సుకు తగిన ట్లుగా ప్రతి తరగతిలో ప్రస్తుత వర్తమాన అంశాలపై ఆలోచింప జేసే విధంగా బోధన కొనసాగాలి. యువత రాజకీయాల్లోకి వచ్చి సమాజ గతిని నిర్దేశించాలని మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్కలాం చెప్పేవారు. సమాజానికి చోదకశక్తి యువతరమే. యువత సామాజిక స్పృహ పెంచు కోవాలి. సమాజంలోని అధిక శాతంలో చదువుకున్న యువత ఉన్నారు. ఈ రోజుల్లో ప్రతి ఒక్కరి దగ్గర స్మార్ట్ ఫోన్ సౌకర్యం ఉంది. ప్రతి ఒక్కరు రాజకీయ చైతన్యం కలిగేలా ప్రజాస్వామిక ఎన్నికల విధానంలో డబ్బులు ఖర్చు పెట్టే విధానానికి స్వస్తి పలకాలి. అరచేతిలో ప్రపంచ విజ్ఞానాన్ని తెలుసుకునే వెసులుబాటు ఉన్నది. ప్రతి గ్రామం నుండి యువత గల్లికో లీడర్ గా ఉంటూ రాజకీయ నాయకులకు అనుచరులుగా మారుతున్నారు. కానీ నిర్దిష్ట లక్ష్యాలు లేకుండా కేవలం తాత్కాలిక తాయిలాలకు ఆశపడుతూ ఒకరిపై మరొకరు పగలు, ప్రతికారాలు ఏర్పరచుకుంటున్నారు. యువతకి కావాల్సిన ఫెసిలిటీస్ ఇచ్చి ప్రజాసేవ చేయామనే నిజాయితీ ఉన్న పార్టీ ఒక్కటన్నా ఉందా! కులము, ప్రాంతము, చుట్టరికము, వారసత్వము, ఆర్థిక స్థోమత, నేర చరిత్ర కావాలి మనకి.కొన్ని కోట్లు ఖర్చు పెట్టి జనాలని కొనాలి, రాజకీయ పార్టీలని కొనాలి, వ్యాపారావేత్తలని కొనాలి, దొంగ వ్యాపారాలు చేయాలి, బ్లాక్ మని సంపాదించాలి, tv ఛానెల్ న్యూస్ పేపర్ స్థాపించుకొని ప్రచారం చేసుకోవాలి, పోలీస్ లని జడ్జి లని కొనాలి, మర్డర్లు మానభంగాలు చేసే దమ్ము ఉండాలి, కబ్జాలు చేసి రౌడీ ఇజం చేయాలి.అవన్నీ దేశభక్తి ఉన్న యువత వల్ల కాదు. అందుకే రాజకీయాల్లోకి యువత రావట్లేదు. కుల పునాదులపై రాజకీయాలు నిర్వహిస్తే భవిష్యత్తులో విలువలతో కూడిన రాజకీయ వ్యవస్థ లేకుండా పోయే ప్రమాదం ఉంది. కాబట్టి ఇప్పటికైనా సమాజం ఆలోచించి రాజకీయ పార్టీలతో కాకుండా వ్యక్తిగత విధానంపై ఆలోచించి ఓటు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎన్నికలలో ధన ప్రభావం ఎక్కువగానే ఉంది. ఇప్పటికే ప్రతి ఓటుకు ఐదు నుంచి 6 వేలు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. సమాజాన్ని కూడా ఓటు అనే విధంగా తీర్చిదిద్దడానికి రాజకీయ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇది ఇలాగే కొనసాగితే సమాజానికి పెద్ద ప్రమాదం పొంచి ఉంది.



**డాక్టర్. రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
**కాకతీయ విశ్వవిద్యాలయం**

# శంషాబాద్ ఎయిర్‌పోర్టులో బాంబు బెదిరింపు



## ఫోన్ కాల్స్‌తో ప్రయాణికులో టెన్షన్-టెన్షన్

శంషాబాద్, నవంబర్ 1 (జనంసాక్షి)

శంషాబాద్ అంతర్జాతీయ ఎయిర్పోర్టులో బాంబు బెదిరింపు ఫోన్ కాల్స్‌తో ప్రయాణికులలో టెన్షన్ మొదలయ్యింది. ఆగంతకుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. విమానయాన సంస్థలకు బాంబు బెదిరింపులతో హడలెత్తిస్తున్నారు. రోజుకు పదుల సంఖ్యలో కాల్స్, ట్వీట్స్ చేసి బెదిరిస్తున్నారు. హైదరాబాదులో ప్రధాన ఎయిర్ పోర్టు అయన శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి దేశంలోని వివిధ నగరాలకు విదేశాలకు రాకపోకలు సాగించే విమానాలకు, విమానాసర్వీస్‌లకు కేవలం నెల రోజుల్లోనే అత్యధికంగా బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో ఓ వైపు ప్రయాణికులకు, మరోవైపు అధికారులకు టెన్షన్ మొదలయ్యింది, ఏ సమయంలో ఏం జరుగుతుందో అని ఆందోళనలో ప్రయాణికులు, శంషాబాద్ ఎయిర్పోర్ట్ లో భారీ బందోబస్తుతో విమానాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. గత నెల అక్టోబర్ 1 నుంచి 30వ తేదీ వరకు దాదాపు 65 బాంబు బెదిరింపులు వచ్చినట్లు సమాచారం. అయితే ఇవన్నీ ఉత్తిత్తివే అని అధికారులు గుర్తించారు. బెదిరింపు దారులు కేవలం ఉద్దేశపూర్వకంగానే చేస్తున్నారు. ప్రయాణికుల భద్రత అంత తేలిగ్గా తీసుకోలేని పరిస్థితి వచ్చింది. ఇందులో భగంగానే తనిఖీలతోనే విమానాలు ఆలస్యం అవుతున్నాయి. దీని కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారాని పౌర విమాన అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు.

### ఏటా 2.5 కోట్ల మంది ప్రయాణికులు

కాగా శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి సంవత్సరానికి 2.5 కోట్ల మంది ప్రయాణాలు జరుగుతున్నాయి. అందులో దేశ, విదేశాల నుంచి చాలా మంది ప్రయాణిస్తున్నారు. అంటే రోజుకు సగటున లక్షమంది ప్రయాణిస్తున్నారు. అదే సమయంలో 450 నుంచి 500 సర్వీసులు నడుస్తున్నాయి. అంతేకాకుండా ప్రయాణికులే కాకుండా టూరిస్టుల రూపంలో 4 లక్షల కంటే ఎక్కువ మంది ప్రయాణాలు చేస్తున్నారు. అందువల్లనే బాంబు బెదిరింపులు ఉత్తిత్తివే అని భావించినా.. ప్రయాణికుల సేఫ్టీ విషయంలో భద్రతా అధికారులు ఎలాంటి నిర్లక్ష్యం చేయడం లేదు.

### సంస్థలపై భారం.

అయితే ఇలా వరుసగా బాంబు బెదిరింపులు రావటం, దీంతో కట్టుదిట్టంగా తనిఖీలు చేయటంతో ప్రయాణికులు గంటల కొద్ది వెయిట్ చేయాల్సి వస్తోంది. దీనివల్ల విమానయాన సంస్థలపై భారీ భారం పడుతోంది. ఎందుకంటే గంటకు మించి ఆలస్యమైతే ప్రయాణికులకు కావలసిన సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. అదే సమయంలో గంటలకొద్దీ వెయిట్ చేయాల్సి వచ్చినపుడు విశ్రాంతి తీసుకోవడానికి వందల మందికి హెూటల్ రూమ్స్ ఇవ్వాల్సి ఉంటుంది. అంతేకాకుండా విమానాలు లేట్ అయితే మొత్తం ప్రయాణాన్నే క్యాన్సిల్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే పైలట్లు, ఎయిర్ హూస్టెస్, స్టాఫ్ కు బస సైతం ఏర్పాటు చేయాలి. ఇలా వీటన్నింటిని చూసుకుంటే విమానయాన సంస్థలపై భారం ఏ రేంజ్ లో పడుతుందో అర్థం చేసుకోవచ్చు.

### ప్రయాణికులని తేలిగ్గా తీసుకోలేని పరిస్థితి

రోజుకు పదుల సంఖ్యలో వస్తున్న బాంబు బెదిరింపులు ఒత్తిత్తివే అని పోలీసులు గుర్తించారు. కానీ వాటిని అంత తేలిగ్గా తీసుకోకుడదని భావిస్తున్నారు. ప్రయాణికుల సేఫ్టీ కోసం వందల మంది సామగ్రిని పూర్తిస్థాయిలో తనిఖీలు చేసి లోపలికి పంపుతున్నారు. మరోవైపు వేర్పాటువాదల బెదిరింపుల దృష్ట్యా శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు పోలీసులు ఇప్పటివరకు దాదాపు 8 కేసులు నమోదు చేశారు.

# దోబీ ఘాట్ సమస్య పరిష్కరించకపోతే ధర్నాకు దిగుతా..!



## ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి,నవంబర్1(జనంసాక్షి)

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని జ్యోతినగర్ 856 సర్వే నంబర్‌లో గల దోబిఘాట్ సమస్య పరిష్కరించకపోతే తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నాకు దిగుతానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం తహసిల్దార్ కార్యాలయంలో రజకులతో కలిసి ఎమ్మార్వోతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 1985 నుండి2021వ సంవత్సరం వరకు రజకులు తమ కులవృత్తిని జ్యోతి నగర్ ధోబిఘాట్‌లో కొనసాగించారు, అయితే శిధిలావస్థకు చేరిన దోబిఘాట్ ను అన్ని సౌకర్యాలతో పునర్ణిమించిస్తామని బల్దియా అధికారులు దోభిఘాట్ ను కూల్చివేశారు,చుట్టూ ప్రహరీ గోడ నిర్మించిన తర్వాత స్థానిక కాలనీ వాసులు ఒకరిద్దరు అడ్డంకులు సృష్టించడంతో ధోభిఘాట్ పనులు నిలిచి పోయినాయి, అప్పటి నుండి రజకులకు కుల వృత్తి చేసుకోవడం ఇబ్బందికరంగా మారింది. అధికారులు మాత్రం నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు, ఈ విషయంపై పలుమార్లు అధికార దృష్టికి తీసుకువెళ్లిన సమస్య పరిష్కారం కాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సమస్యను వారం రోజుల లోపు పరిష్కరించకపోతే తహసిల్దార్ కార్యాలయం ఎదుట తానే స్వయంగా ధర్నాకు కూర్చుంటానని హెచ్చరించారు. దశాబ్దాలుగా అక్కడే జీవన్ సాగిస్తున్న రజకులకు అన్యాయం చేయాలని కొంతమంది స్వార్థపరులు చూస్తున్నారని, అధికారులు రాజకీయ నాయకులకు తలొగ్గితే, సమాజంలో సామాన్యుడి బ్రతుకు ప్రశ్నార్థకంగా మారుతుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జికే హనుమంతరావు, ఉపేందర్ రెడ్డి, రాము యాదవ్, రావుల అంజయ్య,వాసు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు

## శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బిఆర్ఎస్ నాయకులపై, కార్యకర్తలపై ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతూ ఇబ్బందులకు గురి చేస్తుందని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి అన్నారు. శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహబూబ్ నగర్ లో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ను రాజకీయంగా ఎదుర్కోలేక ఆయన కుటుంబ ప్రతిష్టను దెబ్బతీసేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారని, ఇలాంటి మీ ఆటలు ఇక సాగవని ఆయన హెచ్చరించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో శ్రీనివాస్ గౌడ్ ఉద్యోగాన్ని సైతం లెక్కచేయకుండా రాష్ట్ర సాధన కోసం పోరాడారని అన్నారు. మహబూబ్ నగర్‌లో అందుల, వికలాంగుల కాలనీ కుల గొడితే బాధితులకు శ్రీనివాస్ గౌడ్, ఆయన కుటుంబం అండగా నిలిస్తే వారిపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల సోషల్ మీడియా ప్రతినిధి వరద



భాస్కర్‌ను పోలీసులు స్టేషన్‌కు పిలిపించి కొట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. మహబూబ్ నగర్ జిల్లాలో శ్రీనివాస్ గౌడ్ కుటుంబానికే కాకుండా బిఆర్ఎస్ నాయకులకు కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందన్నారు. అనంతరం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పెట్టే అక్రమ కేసులకు భయపడవద్దని, రాబోయేది భారత రాష్ట్ర సమితి ప్రభుత్వమేనన్నారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, సీనియర్ నాయకులు శివరాజ్, మల్లు నర్సింహా రెడ్డి, ఆంజనేయులు, దేవేందర్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, జంబులయ్య, రాఘువేందర్, నవకాంత్, అహ్మదుద్దిన్, ఇమ్రాన్, పాల సతీష్, సుధాకర్ పాల్గొన్నారు.

# సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో తప్పులు లేకుండా చూడాలి

## ఇళ్ల జాబితా రూపకల్పన ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)



రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాల సేకరణకై ప్రభుత్వం ఈ నెల 6వ తేదీ నుండి ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను జిల్లాలో పక్కాగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించి ఆయా నివాస ప్రాంతాలలో ఇళ్ల జాబితాల రూపకల్పన ప్రక్రియ శుక్రవారం ప్రారంభమవగా, జిల్లా కలెక్టర్ శుక్రవారం భూత్పూర్ మున్సిపాలిటీ 9వ వార్డులో, భూత్పూర్ మండలం శేరిపల్లి గ్రామంలో, మూసాపేట మండలం పొల్కంపల్లి గ్రామంలో క్షేత్రస్థాయి సందర్శన జరిపి ఇళ్ల జాబితా రూపకల్పన ప్రక్రియను నిర్వహిస్తున్న తీరును, అధికారులు, సిబ్బంది ఇళ్ల జాబితా రూపకల్పన కోసం చేపడుతున్న చర్యలు, పాటిస్తున్న పద్ధతులను కలెక్టర్ పరిశీలించారు. సర్వేకు సంబంధించిన స్టిక్కర్లను ఇళ్లకు అతికిస్తూ, వాటిపై నమోదు చేస్తున్న వివరాలను కలెక్టర్ పరిశీలించి అధికారులకు కీలక సూచనలు చేశారు. ఏ ఒక్క నివాస గృహాన్ని సైతం వదిలిపెట్టకుండా పక్కా పరిశీలనతో ఇళ్ల జాబితాను తయారు చేయాలని, ఎలాంటి గందరగోళానికి తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. ముఖ్యంగా మున్సిపల్ పట్టణాల పరిధిలో ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. సర్వే కోసం ఎన్యుమరేషన్ బ్లాక్‌లోని ప్రతి ఇంటికి క్రమానుగత సంఖ్యను కేటాయించాలని, ఇళ్ల జాబితా పక్కాగా రూపొందితే సర్వే సమగ్రంగా చేపట్టబడుతుందని అన్నారు. నిర్దేశిత సర్వే ప్రణాళికను అనుసరిస్తూ మూడు రోజుల్లోపు ఇళ్ల జాబితా ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ జిల్లాలో సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ నెల 6వ తేదీ నుండి ప్రారంభమయ్యే ఇంటింటి సమగ్ర సర్వే ప్రక్రియపై ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. కలెక్టర్ తో పాటు భూత్పూర్ మండల ప్రత్యేక అధికారి, ఉద్యాన శాఖ డి.డి.వేణు గోపాల్, ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ శంకర్, మండల సిబ్బంది తదితరులున్నారు.




# పిఎఫ్ విత్ డ్రాల్ సమస్యను పరిష్కరించాలి

## సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ ముందు ధర్నా

జహీరాబాద్,నవంబర్ 1( జనం సాక్షి)

జహీరాబాద్ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ పిఎఫ్, ఈఎస్ఐ డబ్బులను వెంటనే జమచేయాలని, పీఎఫ్ విత్ డ్రా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మున్సిపల్ ముందు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మహిపాల్ మాట్లాడుతూ గత అనేక సందర్భాల్లో పిఎఫ్ విత్ డ్రా సమస్యపై ఆందోళన నిర్వహించిన పరిష్కరించకుండా, డబ్బుల్ని జమ చేయకుండా నిలక్షంగా వ్యవహరించడం సరింది కాదని, తక్షణమే పెండింగ్లో ఉన్న పీఎఫ్ ఈఎస్ఐ డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ఈ ఆందోళన కొనసాగుతుందని అన్నారు. తక్షణమే అధికారులు స్పందించి సమస్యను పరిష్కారం చెయ్యాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ (సీఐటీయూ)నాయకులు యశోద, మోహన్, చంటి, కాంతమ్మ, నాగమ్మ, తదితరులున్నారు



# శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రికను అందించిన ఎమ్మెల్యే

మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)

శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి హాజరుకావాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలోశ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్, ఈవో, అర్చకుల బృందం మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ రెడ్డి, తదితర కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలసి శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు తప్పకుండా విచ్చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపినట్లు ఎమ్మెల్యే జిఎంఆర్ తెలిపారు.

# మినీ ట్యాంక్ బండ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

## రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



సూర్యాపేట ప్రతినిధి నవంబర్ 01(జనంసాక్షి):

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో మినీ ట్యాంక్ బండ్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం సద్దల చెరువు మినీ ట్యాంక్ బండ్ వద్ద బోటింగ్‌ను ఆయన పరిశీలించారు. మినీ ట్యాంక్ బండ్ పరిసర ప్రాంతాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖమ్మం, సిద్దిపేట మాదిరిగా మినీ ట్యాంక్ బండ్ ను అభివృద్ధి చేసి సూర్యాపేట ప్రజలకు అందుబాటులోకి తీసుకుని వస్తామని అన్నారు. కోటి రూపాయల వ్యయంతో ఆధునిక క్రూజ్ ఎసి బోట్ ను తీసుకుని వస్తామని అన్నారు.బర్త్ డే పార్టీలకు, కుటుంబంతో సరదాగా గడపడానికి ఎసి క్రూజ్ బోట్ అనుకూలంగా ఉంటుందని అన్నారు.మినీ ట్యాంక్ బండ్ వద్ద ప్రముఖ కంపెనీల సహకారంతో అద్భుతమైన పార్క్ నిర్మాణం చేస్తామని అన్నారు. మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి కోసం పర్యాటక శాఖ నుండి 10 కోట్ల రూపాయలు కేటాయించినట్లు చెప్పారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కంటైనర్ రెస్టారెంట్లు ఏర్పాటు చేస్తామని, సూర్యాపేట ప్రజలకు పండుగలు, సెలవులలో కుటుంబంతో కలిసి సంతోషంగా గడిపే విధంగా మినీ ట్యాంక్ బండ్ ను అభివృద్ధి చేస్తామని చెప్పారు. మినీ ట్యాంక్ బండ్ వద్ద సిసిటివి కెమెరాలు, ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు షఫి వుల్లా, వెలుగు వెంకన్న, నామా అరుణ, ఎడ్ల గంగాభవాని, నాయకులు ముదిరెడ్డి రమణారెడ్డి, గట్టు శ్రీనివాస్, జ్యోతి కరుణాకర్, బంటు చొక్కయ్య, డాక్టర్ రామ్మూర్తి యాదవ్, ఫరూక్, రమేష్ నాయుడు, ధర్మా నాయక్, వల్దాస్ దేవేందర్, యాట ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మాభూములు పాడు చేయొద్దు

- ఇథనాల్ కంపెనీ నిలుపుదలకు గ్రామ గ్రామాన పెల్లుబుకుతున్న నిరసనలు
- బతికున్న మనుషులను చంపే కంపెనీలు మాకొద్దు
- చిన్నతాండ్రపాడులో రచ్చబండ దగ్గర తీర్మానం

గద్వాల నడిగడ్డ, నంబర్ 1 (జనంసాక్షి)



జోగులాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడ గ్రామంలో ఇథనాల్ కంపెనీ ఇక్కడ ఏర్పాటు చేయవద్దని ప్రక్కనే ఉన్న చిన్న తాండ్రపాడు గ్రామరైతులందరూ కలిసి ఊరి రచ్చబండ దగ్గర నిర్ణయం తీసుకోవడం జరిగిందని తెలుగుదేశం నాయకులు సుధాకర్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ పల్లెటూరిలే దేశానికి పట్టుకొమ్మలని ఆనాడు పెద్దలు ఊరికే అనలేదని, ఇటువంటి పల్లెలను నాశనం చేయడానికి తుంగభద్ర నది సమీపాన వేల కోట్లు విలువచేసే ఇథనాలు కంపెనీ ఏర్పాటు చేయడానికి పూనుకున్నారని, నది కాలుష్యం కావడమే కాక నది పరివాహక ప్రాంతాల్లో నీటి కాలుష్యము వాయు కాలుష్యము అవుతుందని అన్నారు. ఈ కంపెనీ నుండి వెలువడే వ్యర్థ పదార్థాల వల్ల తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలలో చాలా ప్రాంతాలు కాలుష్యపు కోరల్లో చిక్కుకొని జన ప్రాణ నష్టానికి గురయ్యే అవకాశం ఉందని అందువల్ల ఎట్టి పరిస్థితిలోనూ ఈ కంపెనీ ఇక్కడ నిర్మించకూడదని సుధాకర్ గౌడ్ అన్నారు. ఈ నది పరివాహక ప్రాంతంలో ఉన్నటువంటి పుణ్యక్షేత్రాలైన అష్టాదశ శక్తిపీఠమైన జోగులాంబ అమ్మవారి ఆలయం, శ్రీశైల మల్లికార్జున భ్రమరాంబిక ఆలయా లను దర్శించుకునే కోట్లాదిమంది భక్తులు నీటి కాలుష్యంలో చిక్కుకొనే ప్రమాదమున్నదని అన్నారు. అంతేగాక ఈ కంపెనీ చుట్టూ దాదాపు 20 కిలోమీటర్ల వరకు భూగర్భ జలాలు కలుషితమై భూసారం తగ్గి పంటలు నాశనమై భవిష్యత్తులో పంటలు పండే అవకాశం లేదని నిపుణులు చెబుతున్నారని, ఈ తుంగభద్రా నది నీరు దాదాపు సగం రాయల సీమకే నీటి సరఫరా చేస్తున్నదని, తెలంగాణ ఎంపీ మల్లురవి, కర్నూలు ఎంపీ లక్ష్మీనారాయణ, నంద్యాల ఎంపీ శబరి వీరు విషయాన్ని పార్లమెంటులో తప్పకుండా చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, కేంద్ర ప్రభుత్వం నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి ఇక్కడి ప్రజాభిప్రాయ సేకరణను దృష్టిలో ఉంచుకొని తక్షణమే కంపెనీకి ఇచ్చిన అనుమతులను రద్దుచేసి ప్రజలప్రాణాలను కాపాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మాజీ సర్పంచ్ ఉప సర్పంచ్ మహేష్ నాయుడు, సత్యం నాయుడు, మృత్యకారుల సంఘ అధ్యక్షులు మీసాల సత్యన్న పాల్గొన్నారు.



# ఇంటింటి సర్వే పగడ్బందీగా నిర్వహించాలి

## జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్ జిల్లా బ్యూరో నవంబర్ 1 (జనం సాక్షి):

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్ తెలిపారు.శుక్రవారం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను వికారాబాద్ మండలం మదనపల్లిలో అదనపు కలెక్టర్ సుధీర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లను ఉద్దేశించి అదనపు కలెక్టర్ సుధీర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో సర్వే నిమిత్తం వెళ్లినప్పుడు ఇంటి యజమానిని పూర్తి వివరాలను అడిగి తెలుసుకోవాలన్నారు. యజమాని ఇచ్చిన వివరాలను మాత్రమే ప్రొఫార్మాలో పొందుపరచాలని ఆయన సూచించారు. ఎలాంటి తప్పులు లేకుండా ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకొని ఇచ్చిన ఫారాల్లో సమాచారాన్ని క్రోడీకరించాలని ఆయన సూచించారు. అదనపు కలెక్టర్ తో పాటు ఎంపీడీవో వినయ్ కుమార్, సర్వే అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.




# సిడిని ఆవిష్కరించిన ఎమ్మెల్యే మైనంపల్లి

శివ్వంపేట నవంబర్ 1 (జనంసాక్షి)

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని శివ్వంపేట మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొడకంచి శ్రీనివాస్ గౌడ్ కుమారుడు, శివ ప్రసాద్ గౌడ్ ప్రత్యేకంగా రూపొందించిన, ఆ ఆడియో సిడిని శుక్రవారం రోహిత్ రావు తన జన్మదిన వేడుకలకు హాజరైన మెదక్ జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, ముఖ్యంగా శివంపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కొడకంచి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీటీసీ విజయ వెంకటేష్ నర్సాపూర్ ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ సూర్యం చౌహన్, నాయకులు కొడకంచి గణేష్ గౌడ్, ముద్దగళ్ల నర్సింలు, యూత్ నాయకులు భరత్ రెడ్డి, ప్రదీప్ గౌడ్, జంగం చిన్న, చింటులు అలాగే మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే తన తండ్రి మైనంపల్లి హనుమంతరావుల సమక్షంలో తన కోసం ప్రత్యేకంగా తయారు చేయించిన ఆడియో సిడిని ఆవిష్కరించి, దానిని వెంటనే ప్లే చేయించారు. ఇది విన్న రోహిత్ రావ్, మైనంపల్లి హనుమంతరావు లు తన్మయత్వం పొంది, సంతోషం వ్యక్తం చేస్తూ, కొడకాంచి శ్రీనివాస్ గౌడ్ ను, ఆయన కుమారుడు శివ ప్రసాద్ గౌడ్ లను, అలాగే మండల నాయకులను ప్రత్యేకంగా అభినందించారు. అంతకుముందు కొడకాంచి శ్రీనివాస్ గౌడ్ బృందం ఎమ్మెల్యే రోహిత్ రావు ను శాలువాలు, పూల బొకేలు, పూలమాలతో ఘనంగా సన్మానించి, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. చివరగా అందరి ఆనందోత్సవాల మధ్య ఎమ్మెల్యే రోహిత్ రావు కేక్ కట్ చేసి ఆనందోత్సవంలో పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులపై కలెక్టర్ ఆగ్రహం

- ఇరిగిపల్లిలో ప్రాథమిక పాఠశాలను పరిశీలించిన కలెక్టర్
- ప్రణాళిక బద్ధంగా ఇంటింటి సర్వే చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి



**సంగారెడ్డిప్రతినిది, నవంబర్ 1(జనంసాక్షి)**

ప్రణాళిక బద్ధంగా ఇంటింటి సర్వే కార్యక్రమం నిర్వహించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణంలోని శివాజీ నగర్, సంగారెడ్డి మండల పరిధిలోని ఇరిగిపల్లి గ్రామాలలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కొన్ని ఇండ్లను సందర్శించి వారి కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సమగ్ర సర్వేలో ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ సర్వే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ సూచించారు. కుటుంబ సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య ,ఉద్యోగ, రాజకీయ అంశాలను సమీక్షించడం జరుగుతుందన్నారు. ఈ సర్వే కోసం ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు బ్లాక్ ల వారీగా ఇండ్ల వివరాలను సిద్ధం చేసుకోవాలన్నారు. సంగారెడ్డి మున్సిపల్ పరిధిలో అన్ని ఏర్పాట్లు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోనని మున్సిపల్ కమిషనర్ను కలెక్టర్ ఆదేశించారు. సర్వే కోసం అవసరమైన ఇంటి జాబితా, ఫారాలు, స్టిక్కర్లు కలెక్టరేట్ ద్వారా తీసుకోవాలన్నారు. ఇంటి జాబితా ప్రక్రియను ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు ప్రారంభించేలా చూడాలని తహసిల్దారులు మున్సిపల్ కమిషనర్లు కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఇంటికి ఎన్యుమరేటర్లు వెళ్లి నిర్ణీత ప్రొఫార్మాలో సర్వే వివరాలను నమోదు చేయాలన్నారు. సర్వే పూర్తయిన ఇంటికి స్టిక్కర్లను అతికించాలన్నారు. ఇంటి జాబితా ఫారంలో అన్ని ప్రశ్నలకు నమోదు చేయాలని సూచించారు. ఇంటింటి సర్వే ఏర్పాట్లు పరిశీలించిన అనంతరం కలెక్టర్ ఇరిగిపల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తక్కువగా ఉండటం చూసి ఉపాధ్యాయులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు నమోదు పెంచడానికి ఉపాధ్యాయులు సిబ్బంది మరింత కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ బొంగుల విజయలక్ష్మి, మండల ప్రత్యేకధికారి ఖాసీం బేగ్, తహసిల్దార్ దేవదాస్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గృహాల జాబితా సమగ్రంగా
# నమోదు చేయాలి



### ఎన్యుమరేటర్లకు కలెక్టర్ సూచన

**మెదక్ బ్యూరో నవంబర్ 1 (జనం సాక్షి):**

గృహాల జాబితా సమగ్రంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఎన్యుమరేటర్లుకు సూచించారు. శుక్రవారం మెదక్ మున్సిపాలిటీ పరిధిలో నవాబ్ పేట నందు సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వే ప్రక్రియలో భాగంగా గృహాల జాబితా నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర కుటుంబ సర్వే ఈనెల 6 నుండి 18 వరకు నిర్వహణలో భాగంగా గృహాల జాబితా నమోదు ప్రక్రియను పరిశీలించడం జరిగిందని, మెదక్ మున్సిపాలిటీ పరిధిలో 18 వేల 563 గృహాలు ఉన్నాయని, ఎన్యుమరేటర్లు 126, మంది , 11 మంది సూపర్వైజర్ నియమించామని ,126 బ్లాకులుగా ఏర్పాటు చేసుకుని సర్వే ఎటువంటి లోటుపాట్లు జరగకుండా సమర్థవంతంగా నిర్వహించడానికి ఇమిలేటర్లకు తగు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ కుల సర్వే పై మున్సిపాలిటీ నుంచి పట్టణంలో విస్తృత ప్రచారం గావించాలని తద్వారా గృహాల్లో నివసించే ప్రజలు సర్వే నిర్వహించడానికి వచ్చే అధికారులకు సమగ్ర సమాచారం అందివ్వడానికి సిద్ధంగా ఉంటారని సర్వే వేగవంతం అవ్వడానికి కూడా దోహదపడుతుందన్నారు. ఈనెల 6 నుండి చేపట్టే సర్వే ప్రక్రియకు ప్రతి ఇంటి యజమాని ఫోన్ నెంబర్ కుటుంబ సభ్యుల యొక్క ఆధార్ కార్డు, రేషన్ కార్డు, భూమికి సంబంధించిన పట్టాదారు పాస్ పుస్తకం సమగ్ర సమాచారంతో సిద్ధంగా ఉండి సర్వేకు వచ్చిన అధికారులకు సహకరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రతి ఇంటిని కచ్చితంగా ఈ సర్వే ప్రక్రియలో భాగస్వామ్యం చేయాలని, హౌస్ లిస్ట్ ప్రక్రియ చేపట్టినప్పుడు ప్రజలకు ఈ సర్వేపై పూర్తి అవగాహన చేసుకుంటూ కొనసాగింపు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు సంబంధిత సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోళ్లు లేక కల్లాలలో పేరుకుపోతున్న ధాన్యం

- మిల్లర్లకు ధాన్యం కేటాయించడంలో ఆలస్యం
- బ్యాంకు గ్యారెంటీ ఇస్తేనే ధాన్యం కేటాయింపులు
- ప్రభుత్వ మార్గదర్శకాల కోసం అధికారుల ఎదురుచూపులు



**మెదక్ బ్యూరో, నవంబర్ 1 (జనం సాక్షి):**

మెదక్ జిల్లాలో కొనుగోలు కేంద్రాలు తెరుచుకున్నా కొనుగోళ్లు జరగక ధాన్యం కుప్పలు కుప్పలుగా పేరుకుపోతుంది... రోడ్లు, కాలి స్థలాలు ధాన్యం రాశులతో నిండిపోతున్నాయి. అకాల వర్షాలతో ధాన్యం రాశులు తడిసి ముద్ద అవుతుండడంతో అన్నదాతలు ఆగమాగం అవుతున్నారు. మిల్లర్లకు ధాన్యం కేటాయించడంలో ప్రభుత్వ మార్గదర్శకాల కోసం సివిల్ సప్లై అధికారులు ఎదురుచూస్తున్నారు. గతంలో కేటాయించిన బియ్యానికి తగినంత సీఎంఆర్ ఇవ్వకుండా పలువురు మిల్లర్లు ఎగవేయడంతో ఈసారి అధికారులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. బ్యాంకు పూచికత్తు ఇస్తేనే ధాన్యం కేటాయిస్తామని పేర్కొంటున్నారు. కానీ ఇందుకు సమయం పడుతుందని మిల్లర్లు పేర్కొంటు ఒడడంతో వడ్ల కొనుగోళ్లు మరింత ఆలస్యమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. మెదక్ జిల్లావ్యాప్తంగా 486 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే 442 కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఇప్పటి వరకు 50 శాతం వరి కోతలు పూర్తయ్యాయి. నెల రోజులుగా వరి కోతలు సాగుతున్నాయి. కోసిన వడ్లను సెంటర్ల వద్దకు తరలించిన రైతులు ఆరబోయడంలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా ప్రభుత్వం ఇప్పటి వరకు రైస్ మిల్లర్లకు ధాన్యం కోటా కేటాయించలేదు. తీసుకున్న ధాన్యానికి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ఇవ్వకుండా కొందరు మిల్లర్లు అక్రమాలకు పాల్పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకుంటోందని అధికారులు చెబుతున్నారు. బ్యాంకు గ్యారెంటీ ఇచ్చేంతవరకూ దాన్యాన్ని కేటాయించకూడదని నిర్ణయం తీసుకోవడంతో కాస్త ఆలస్యం అవుతోందని వివరిస్తున్నారు. బకాయిలు లేకండా సీఎంఆర్ సక్రమంగా ఇస్తూ వచ్చిన రైస్ మిల్లర్లకు మాత్రం 10 శాతం బ్యాంకు గ్యారెంటీతో ధాన్యం కేటాయించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఒకవేళ డీఫాల్టర్ అయినప్పటికి బాకీ తీర్చిన మిల్లర్లకు జిల్లాలో బ్యాంకు గ్యారెంటీని 20 శాతానికి పెంచనున్నట్లు తెలుస్తోంది. బకాయిలు తీర్చి, అపరాధ రుసుము చెల్లించిన మిల్లర్లకు 25 శాతం బ్యాంకు పూచీకత్తు కోరనున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ ధాన్యం సేకరణ ప్రారంభించకపోవడానికి ప్రధాన కారణం రైస్ మిల్లర్లతో ఒప్పందం కుదరకపోవడమేనని తెలుస్తున్నది. కొల్చారం మండలంలో గురువారం కురిసిన అకాల వర్షాలతో ధాన్యం తడిసి ముద్దయింది. తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతాంగం విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే వరి ధాన్యం తూకం వేసి కొనుగోళ్లు ప్రారంభించాలని కోరుతున్నారు.



## అన్నదాతలు ఆగమాగం

### వర్షం ధాటికి తడిసిన వరి ధాన్యం
### రైతు కళ్ళల్లో కన్నీటి సుడులు

**హత్నూర, నవంబర్ 1 (జనం సాక్షి)**

అమ్మబోతే అడవి కొనబోతే కొరివి అన్నట్టు ఉంది అన్నదాతల పరిస్థితి.ఎన్నో వ్యయప్రయాసాలకోర్చి ఆరుగాలం శ్రమించి పండించిన పంటను ఇటు అమ్ముకోలేక,అటు వర్షం నుండి దానిని కాపాడుకోలేక గుండెలు బాదుకుంటున్నారు. మండలంలో శుక్రవారం కురిసిన వర్షం ధాటికి వరి ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. మధ్యాహ్నం వరకు ఎండగా ఉన్న వాతావరణం ఒక్కసారిగా మబ్బులు కమ్మి వర్షం కుమ్మరించడంతో రైతులు ఆరబెట్టిన ధాన్యం కుప్పలు తడిసి నీరుగారాయి. చేతికొచ్చిన పంట తమ కళ్ళముందే వర్షార్పణమవుతుంటే ఏమి చేయాలో తోచక రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఓ వైపు అకాల వర్షాలు వెంటాడుతుండగా మరో వైపు ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి రైతుల పాలిట శాపంగా మారింది.ఎంతో అట్టహాసంగా కొనుగోళ్లు కేంద్రాలను ప్రారంభించిన ప్రభుత్వం వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెల రోజులు కావస్తున్నా ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం నిరాసక్తత కనబరుస్తుందని రైతులు మండిపడ్డారు. ప్రభుత్వం అవలంబిస్తున్న మొండి వైఖరిపై కన్నెర్ర చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వరి ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలని రైతులు డిమాండ్ చేశారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ



**ఝరాసంగం, నవంబర్ 1(జనం సాక్షి):**

ఝరాసంగం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా చేపడుతున్న సోయాబీన్ కొనుగోలు కేంద్రానికి జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా సోయాబీన్ కొనుగోలులో నాణ్యత ప్రమాణాలు పక్కాగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కొనుగోలు ఇన్చార్జికి సూచించారు. తేమ 12 శాతం కంటే తక్కువ ఉండేలా రాళ్లు, మట్టి, చెడిపోయిన, రంగు మారిన,మొలకెత్తిన, ముడుకుపోయిన ధాన్యం వీటన్నిటికి ప్రామాణికంగా ఉండేలా చూసుకోవాలని రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని సూచించారు. అదే విధంగా మండల కేంద్రంలోని వివిధ ఎరువుల దుకాణాలను తనిఖీ చేయడం జరిగింది. ఎరువులు పురుగు మందుల సంబంధించిన రిజిస్టర్లు ఏప్పటికప్పుడు పొందుపరిచేలా చర్యలు తీసుకోవాలని డీలర్లను సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు బిక్షపతి, మండల వ్యవసాయ అధికారి వెంకటేష్, టెక్నికల్ ఏవో వినోద్ కుమార్ పాల్గొన్నారు.

## కుటుంబ జాబితాను పకడ్బందీగా
# సిద్ధం చేయాలి



### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో నవంబర్01 (జనంసాక్షి)**

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా ఎన్యుమరేటర్ బ్లాకులను ఏర్పాటు చేసుకొని కుటుంబ జాబితాను పకడ్బందీగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లాలోని తహశీల్దార్లు, మండల అభివృద్ధి అధికారులు, గణాంక అధికారులతో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పై వెబ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వివరిస్తూ నవంబర్ 6 నుండి ప్రారంభమయ్యే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ముందస్తు ప్రణాళికలు పకడ్బందీగా సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. 2011 జనాభా లెక్కల సమయంలో రూపొందించిన ఎన్యూమరేటర్ బ్లాక్‌ల ఆధారంగా ప్రస్తుతం పెరిగిన కుటుంబాలతో కొత్త ఎన్యూమరెటర్ బ్లాక్‌లను సిద్ధం చేసుకొని అందుకు అనుగుణంగా ఒక నిర్దిష్ట మ్యాప్ తయారు చేసుకోవాలని సూచించారు. ఈ రోజు మధ్యాహ్నం వరకు ఎన్యుమరేటర్ బ్లాక్ లు సిద్ధం చేసుకొని అందులో ఉన్న కుటుంబాల జాబితా తయారు చేసుకోవాలని సూచించారు. నవంబర్ 4 లోపు కుటుంబాల జాబితా సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రతి కొత్త ఎన్యూమరేటర్ బ్లాక్ కు ఒక ఏన్యుమారెటర్ ను ఎంపిక చేసి జాబితా పంపాలని ఆదేశించారు. స ర్వేకు అవసరమైన అన్ని మెటెరిలియల్ క్షేత్రస్థాయికి పంపించడం జరిగిందన్నారు. నేటి నుండి కుటుంబాల జాబితా రూపొందించాలని సూచించారు. సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎన్యుమరెటర్ల పనితీరును పర్యవేక్షిస్తూ అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవిన్యూ జి వెంకటేశ్వర్లు, సిపిఓ భూపాల్ రెడ్డి, మండల ప్రత్యేక అధికారులు, ఎమ్మార్వోలు ఎంపీడీవోలు, గణాంక అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## యూనిఫామ్ వేసుకున్న ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ ముఖ్యం

### జిల్లా ఎస్పీ యోగేష్

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**

యూనిఫాం వేసుకున్న ప్రతి ఉద్యోగికి క్రమశిక్షణ తప్పనిసరి అని నారాయణపేట జిల్లా ఎస్పి.యోగేష్ గౌతం అన్నారు.శుక్రవారం ఉదయం జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని హోంగార్డ్స్ అందరికీ హోమ్ గార్డ్ కమాండెంట్ ఆర్. వెంకటేశ్వర్లు టి కలిసి ఎస్పి యోగేష్ గౌతం హోంగార్డ్ దర్బార్ నిర్వహించారు.ఈ సందర్భంగా వారి సమస్యలు అడిగితెలుసుకున్నారు. అనంతరం ఎస్పి మాట్లాడుతూ..ఎం హోమ్ గార్డ్స్ బదిలీ గురించి లిస్టు తయారు చేయడం జరిగిందని వారు 66 మంది ఉన్నారనీ.వారి ప్రపోజల్స్ పంపించడం జరిగిందని తెలిపారు. త్వరలో వారిని ట్రాన్స్ఫర్ చేయడం జరుగుతుందని వారి ప్లేస్ లో ఉమ్మడి జిల్లాల నుండి 66 మంది జిల్లాకు రావడం జరుగుతుందని తెలిపారు. అలాగే హోంగార్డ్ సిబ్బందికి యూనిఫామ్ అలవెన్స్ గురించి, రైన్ కోట్స్ హెల్త్ కార్డు, గురించి పై అధికారులకు ప్రపోజల్స్ పంపించడం జరిగిందన్నారు. వాటిని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు .ప్రతి ఒక్కరికి హెల్త్ ప్రొఫైల్ తయారు చేయడం జరుగుతుందన్నారు. యూనిఫామ్ వేసుకున్న ప్రతి ఒక్కరికి క్రమశిక్షణ చాలా ముఖ్యమని యూనిఫాంలో ఉన్న వారిని పదిమంది గమనిస్తూ ఉంటారని అది తెలుసుకొని విధులు నిర్వహించాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి దర్బార్ నిర్వహించడంజరుగుతుందన్నారు. హోంగార్డు సిబ్బందికి విధి నిర్వహణలో కానీ వ్యక్తిగతంగా కానీ ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తెలపాలని సూచించారు.సమస్యల పరిష్కారానికి ముందుంటామన్నారు,. ఈ దర్బార్ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ రియాజ్, ఎస్బి ఇన్స్పెక్టర్ రామ్ లాల్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ నరసింహ, ఆర్ఎస్ఐ శివ శంకర్, జిల్లాలో ఉన్న హోంగార్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు వరం పీఎం జన ఆరోగ్య యోజన


- వృద్ధాప్యంలో ఆరోగ్య బీమా (ధీమా) !
- అక్టోబర్ 29న ఆవిష్కరించిన మోదీ
- 70 ఏళ్లు నిండిన అందరికీ ఉచితంగా బీమా
- రూ. 5 లక్షల హెల్త్ కవరేజీ..

**వనపర్తి,నవంబర్01(జనంసాక్షి):**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అక్టోబర్ 29న ఆవిష్కరించిన పీఎం జన ఆరోగ్య యోజన వృద్దుల పాలిట వరంగా మారనుంది.తొలి విడత కింద రూ.3437 కోట్లు కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. గతంలో ప్రభుత్వ రంగంలో ఏర్పాటు చేసిన ధర్మాసుపత్రులు (జనరల్ హాస్పిటల్స్) దగ్గు, జలుబు, తేలికపాటి జ్వరాలకు చికిత్సలు చేయడానికి తప్పా దీర్ఘ కాలిక, ప్రాణాంతక రోగాలను నయం చేయడానికి అక్కరకు రావడం లేదు .క్యాన్సర్, ఊపిరితిత్తులు, మెదడు, నరాల సంబంధిత వ్యాధులకు అవసరమైన సర్జరీలకు కార్పోరేట్ హాస్పిటల్స్ కు పోవాలంటే లక్షలాది రూపాయల ఖర్చును భరించి స్థితిలో పేదలు లేరు.దాని వల్ల పేద కుటుంబాలు మృత్యువు బారిన పడక తప్పడం లేదు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ ఆ లోటును అధిగమించడం లేదు. అందుకే 70 ఏళ్ళు పైబడిన వృద్ధులకు భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన (ఏబీ–పీఎంజేఏవై) కేంద్రం ప్రవేశ పెట్టడం ఆశాజనకంగా వారికి మారనుంది.

### వృద్ధాప్యంలో ఆసరా ఏబీ–పీఎంజేఏవై

ఒక్కసారి ఆస్పత్రి పాలైతే.. కొన్నేళ్ల పాటు కూడబెట్టుకున్నదంతా కరిగిపోయే పరిస్థితి. ఖరీదైన వైద్యం కారణంగా అప్పుల పాలైన కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. కరోనా అప్పుడు జరిగిన అలాంటి సంఘటనలు ఎన్నో ఎదురయ్యాయి కూడా. ఈ పరిస్థితి రాకూడదంటే ముందస్తుగా బీమా రక్షణ కల్పించుకోవడమే మార్గం. కానీ, వృద్ధాప్యంలో ఆరోగ్య బీమా ప్రీమియం పెద్ద మొత్తంలో ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో 70 ఏళ్లు నిండిన వృద్ధులు అందరికీ ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన' (ఏబీ–పీఎంజేఏవై) కింద ఉచితంగా ఆరోగ్య బీమా అందిస్తున్నట్టు కేంద్రం తీపి కబురు చెప్పింది. ఇప్పటి వరకు ఈ పథకం కింద పేదలు, తక్కువ ఆదాయ వర్గాలకే ఉచిత ప్రయోజనం అందుతోంది. ఇకపై ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా 70 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పీఎం జేఏవై కింద రూ.5 లక్షల హెల్త్ కవరేజీ లభించనుంది. అతి త్వరలోనే అమల్లోకి రానున్న ఈ పథకం గురించి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నది.




### రూ.5 లక్షల సమగ్రమైన ఆరోగ్య బీమా

పీఎంజేఏవై పథకం కింద రూ.5 లక్షల సమగ్రమైన ఆరోగ్య బీమా కవరేజీ లభిస్తుంది. ఆస్పత్రిలో చేరడానికి మూడు రోజుల ముందు వరకు అయ్యే వైద్య పరమైన ఖర్చుల (డాక్టర్ ఫీజులు, డయాగ్నోస్టిక్స్ పరీక్షలు)కు సైతం కవరేజీ ఉంటుంది. చికిత్సా సమయంలో ఔషధాలు, కన్స్యూమబుల్స్ కూడా ఉచితమే. చికిత్సలో భాగంగా వేసే స్టెంట్‌లు, పేస్‌మేకర్ల వంటి వాటికీ కవరేజీ లభిస్తుంది. ఐసీయూ, జనరల్ వార్డ్‌లో ఉండి తీసుకునే చికిత్సలకు పరిహారం అందుతుంది. రోగికి చికిత్సా సమయంలో ఉచితంగానే ఆహారం అందిస్తారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత కూడా 15 రోజుల పాటు చికిత్సకు సంబంధించిన వ్యయాలకు చెల్లింపులు లభిస్తాయి.

### ఎంపిక చేసిన ప్రైవేటు ఆస్పత్రుల్లో కవరేజీ

ప్రభుత్వ ఆస్పత్రులు, ఎంపిక చేసిన ప్రైవేటు ఆస్పత్రుల్లో కవరేజీ లభిస్తుంది. ఈ పథకంలో చేరిన మొదటి రోజు నుంచే అన్ని రకాల (ఎంపిక చేసిన) చికిత్సలకు ఉచితంగా కవరేజీ అమల్లోకి వస్తుంది. అంటే ముందు నుంచి ఉన్న ఆరోగ్య సమస్యలకు సైతం ఈ పథకం కింద చికిత్స తీసుకోవచ్చు. వెయిటింగ్ పీరియడ్, కూలింగ్ ఆఫ్ పీరియడ్ అనే షరతుల్లేవు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అమల్లో ఉన్న ఆయుష్మాన్ భారత్ హెల్త్ స్కీమ్ కింద ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో 1,350 మెడికల్ ప్యాకేజీలకు కవరేజీ లభిస్తోంది. 70 ఏళ్లు నిండిన వృద్ధులకు సంబంధించి పథకంలో భాగంగా ఏఏ చికిత్సలకు కవరేజీ లభిస్తుందన్నది ప్రభుత్వ నోటిఫికేషన్‌తోనే స్పష్టత వస్తుంది.

### అర్హత?

70 ఏళ్లు నిండి, ఆధార్ కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పథకం కింద రూ.5 లక్షల హెల్త్ కవరేజీకి అర్హులే. పీఎంజేఏవై కింద ఇప్పటికే రూ.5 లక్షల కవరేజీ కలిగిన కుటుంబాల విషయానికొస్తే.. ఆయా కుటుంబాల్లోని 70 ఏళ్లు నిండిన వారు అదనంగా రూ.5 లక్షల హెల్త్ టాపప్ (కవరేజీ)ను పొందేందుకు అర్హులు. సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీమ్ (సీజీహెచ్‌ఎస్), ఎక్స్ సర్వీస్‌మెన్ కంట్రిబ్యూటరీ హెల్త్ స్కీమ్ (ఈసీహెచ్‌ఎస్), ఆయుష్మాన్ సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ (సీఏపీఎఫ్) కింద కవరేజీ ఉన్న వారు ఎప్పటి మాదిరే అందులో కొనసాగొచ్చు. లేదా వాటి నుంచి పీఎంజేఏవైకు మారొచ్చు. ప్రైవేటు హెల్త్ ఇన్సూరెన్స్ కలిగి ఉన్నవారు, ఈఎస్ఐ కింద కవరేజీ కలిగిన వారు, వీటితోపాటు అదనంగా పీఎంజేఏవై కవరేజీకి సైతం అర్హులే.

### దరఖాస్తు ఎలా..?

పీఎంజేఏవై డాట్ జీవోవీ డాట్ ఇన్ పోర్టల్ లేదా ఆయుష్మాన్ మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే, 70 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకునే ప్రక్రియ ఇంకా మొదలు కాలేదు. అతి త్వరలోనే ఇది ఆరంభం కానుంది. తొలుత ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాంతాల్లో ప్రారంభించి, అనంతరం దేశవ్యాప్తంగా అందుబాటులోకి తీసుకురావాలన్నది కేంద్ర ప్రభుత్వం ప్రణాళికగా ఉంది. ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ (ఏబీహెచ్ఏ/ఆభా) కలిగి ఉంటే, ఈ బీమా ఉచితమని అనుకోవద్దు. ఆభా అన్నది డిజిటల్ రూపంలో హెల్త్ రికార్డులు భద్రపరుచుకునేందుకు ఉపయోగపడే ఖాతా. తమ హెల్త్ రిపోర్ట్‌లను ఈ ఖాతాలోకి ఉచితంగా అప్‌లోడ్ చేసుకుని, వైద్యుల వద్దకు వెళ్లినప్పుడు వాటిని డిజిటల్ రూపంలో పంచుకోవచ్చు. అవసరమైన సందర్భాల్లో డిజిటల్ హెల్త్ రికార్డులను పొందొచ్చు. ఆభాతో సంబంధం లేకుండా పీఎంజేఏవై కింద రూ.5 లక్షల కవరేజీకి విడిగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 70 ఏళ్లు నిండిన వారు, పీఎంజేఏవై కింద ఇప్పటికే హెల్త్ కవరేజీ పొందుతున్న 70 ఏళ్లు నిండిన వృద్ధులు విడిగా దరఖాస్తు చేసుకోవాల్సిందే.

### 30,000 ఆస్పత్రులు ఎంప్యానెల్

పీఎంజేఏవై కింద దేశవ్యాప్తంగా 30,000 ఆస్పత్రులు ఎంప్యానెల్ అయ్యాయి. ఇందులో 13,466 ప్రైవేటు ఆస్పత్రులు కూడా ఉన్నాయి. కానీ, అన్నీ యాక్టివ్‌గా లేవు. యాక్టివ్ హాస్పిటల్ అంటే గడిచిన 45 రోజుల్లో ఆయా ఆస్పత్రుల నుంచి కనీసం ఒక పేషెంట్ అయినా డిశ్చార్జ్ అయి ఉండాలి. యాక్టివ్ ఆస్పత్రులు కేవలం 3,000 మాత్రమే ఉన్నాయి. పైగా ఎంప్యానెల్ అయిన ఆస్పత్రులు అన్నీ కూడా అన్ని రకాల చికిత్సలను ఆఫర్ చేయడం లేదన్నది గుర్తు పెట్టుకోవాలి. అంటే పీఎం జేఏవై కింద ఎంపిక చేసిన ప్యాకేజీలలో కొన్నింటినే ఆఫర్ చేసే వెసులుబాటు ఆస్పత్రులకు ఉంటుంది.

జనంసాక్షి www.janamsakshi.org
శనివారం 2 నవంబర్ 2024 తెలంగాణ

# మర్పల్లి ఘటనపై విచారణకు కమిషన్ ఆదేశం

- 7 రోజుల్లో నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఎస్పీని కోరిన కమిషన్
- నివేదిక సకాలంలో ఇవ్వకపోతే వ్యక్తిగతంగా హాజరు కావలసి ఉంటుందని ఆదేశం



**వికారాబాద్ జిల్లా బ్యూరో నవంబర్ 1 (జనం సాక్షి):** గత నెలలో ఒక గుర్తు తెలియని శవం విషయమై దళిత యువకులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆరోపణపై జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ స్పందించింది. ఈ మేరకు వికారాబాద్ జిల్లా కలెక్టర్ ఎస్పీకి నోటీసులు జారీ చేసింది. ఏడు రోజుల్లో దర్యాప్తు లేదా విచారణకు సంబంధించిన సమగ్ర నివేదికను జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ కు అందజేయాలని ఆదేశించింది. సకాలంలో తాము కోరిన నివేదిక అందించని పక్షంలో వ్యక్తిగతంగా కమిషన్ ముందుకు హాజరు కావలసి ఉంటుందని ఆదేశించింది. అక్టోబర్ నెలలో గణపురం పట్లూర్ శివారులో ఒక గుర్తు తెలియని శవం మర్పల్లి పోలీసులకు దొరికింది. ఒక ఫామ్ హౌస్ యజమాని ఫిర్యాదు మేరకు మర్పల్లి ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. అందులో భాగంగా అనుమానితులుగా భావించిన పట్లూరు గ్రామానికి చెందిన మర్పల్లి నవీన్ కుమార్‌తో పాటు మరో దళిత యువకుని తెల్లవారుజామున పోలీసులు అదుపులోకి తీసుకొని వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని ఆరోపణలు వచ్చాయి. మర్పల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్న నవీన్ కుమార్ అనే వ్యక్తి పోలీసులు చేతిలో నుంచి తప్పించుకొని పోయి జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ ఆశ్రయించారు. తమపై మర్పల్లి ఎస్సై సురేష్ అకారణంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించి తప్పుడు హత్య కేసు నమోదు చేయాలని ప్రయత్నిస్తున్నారని నిజాన్ని ఒప్పుకోవాలని తమపై థర్డ్ డిగ్రీ ఉపయోగించారని జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.

ఈ మేరకు జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ నవీన్ కుమార్ ఫిర్యాదును స్వీకరించి విచారణకు ఆదేశించింది. ఈ మేరకు వికారాబాద్ కలెక్టర్ ఎస్పీకి సమగ్ర నివేదిక నిమిత్తం నోటీసు జారీ చేసింది. ఈ సంఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పోటా పోటీగా నిరసనలు వ్యక్తం చేశారు. దళితులపై దాడిని స్వీకర్‌కు అంటగడుతూ బిఆర్ఎస్ పార్టీ పోలీస్ స్టేషన్ ముట్టడి చేయడానికి ప్రయత్నించింది. తమ నాయకునిపై తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ బిఆర్ఎస్ పార్టీకి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టింది. దీంతో అప్పట్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ విషయమై బాధితులు ఎస్సై సురేష్ తీరుపై పోలీసు ఉన్నత అధికారులకు మానవ హక్కుల కమిషన్ కు జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ విచారణకు ఆదేశించింది. పోలీసు ఉన్న అధికారుల విచారణ మానవ హక్కుల కమిషన్ విచారణ ప్రస్తుతం పరిశీలనలో ఉంది. త్వరలోనే ఈ విచారణ కూడా జరుగుతుందని తెలుస్తుంది. జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ దర్యాప్తు విషయమై బాధితుడు మర్పల్లి నవీన్ కుమార్ కు సమాచారాన్ని అందించింది.

# ఇథనాల్ ఫ్యాక్టరీని ఎత్తివేయకుంటే తీవ్ర ప్రజాగ్రహం

- తుంగభద్ర, కృష్ణా నదులను కూడా కాపాడుకుందాం
- బీజేపీ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు ఎస్ రామచంద్రారెడ్డి



**రాజోలి (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో నిర్మించబోయే ఇథనాల్ ఫ్యాక్టరీ దుష్పరిణామాలు భవిష్యత్ తరాలను నాశనం చేస్తాయని, అయినప్పటికీ అధికారులకు లంచాలిచ్చి, తప్పుదోవ పట్టించి వ్యవసాయ యోగ్యమైన భూముల్లో ఫ్యాక్టరీ తెచ్చుకున్నారని బీజేపీ జోగులాంబ గద్వాల జిల్లా అధ్యక్షులు ఎస్ రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... చిన్నధన్వాడ, పెద్ద ధన్వాడ గ్రామాల్లోని జనావాసాల మధ్య ఫ్యాక్టరీ వేయడం పర్యావరణానికి వ్యతిరేకమన్నారు. మనుషుల సంచారం, జంతుజీవజాలం లేనిచోట ఈ ఫ్యాక్టరీలను వేసుకోవాలని, ఈ పరిశ్రమ ఉన్నచోట 20 కిలోమీటర్ల రేడియస్‌లో ఎలాంటి ఊర్లు ఉండకూడదని తెలిపారు. పెద్ద ధన్వాడలో పరిశ్రమ ఏర్పాటైతే తుంగభద్ర, తుమ్మిళ్ల ఎత్తిపోతల నుంచి నీళ్లు కూడా కరువైపోతాయన్నారు. మనుషులకు కాన్సర్‌తో పాటు ఊపిరితిత్తులు పాడావుతాయని, చర్మరోగాలు, సంతానలేమి, జెన్యూపరమైన రోగాలు, అదేవిధంగా ఫ్యాక్టరీ నుంచి వెలువడే వ్యర్థాలు తుంగభద్రలో కలిపితే పది, పదిహేను పల్లెల్లో తాగునీరు దొరకదని ఆందోళన వెలిబుచ్చారు. 'ప్రధానంగా అలంపూర్ పరివాహక ప్రాంతాల్లో కూడా పదుల సంఖ్యల్లో గ్రామాలకు తుంగభద్ర నుంచి తాగునీరు అందుతోంది. సుంకేశుల వద్ద కెసి కెనాల్‌లోనూ ఈ వ్యర్థాలు కలిపే అవకాశముంది. ఈ కెసి కెనాల్ వాటర్‌ను డ్రికింగ్ వాటర్‌గా చాలాచోట్ల వినియోగిస్తున్నారు. జలశయాలు కూడా నింపుకుంటున్నారు. తెలంగాణతో పాటు కర్నూల్, కడప ఈ రెండు జిల్లాలకు కూడా ఫ్యాక్టరీ వల్ల ప్రమాదం ఉంటుంది' అని వివరించారు. తుంగభద్ర కృష్ణ నదికి ఉపనది. సంగమేశ్వర వద్ద తుంగభద్ర నీళ్లు కూడా కృష్ణా నదిలో కలిసిపోతాయి. దీంతో మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలోని చాలా ప్రాంతాల్లో నీటి కలుషితం ఏర్పడుతుందన్నారు. రాబోయే రోజుల్లో సోలార్‌వైపు వెళ్లే అవకాశాలున్నాయని, పెట్రోల్, డీజీల్ వినియోగాలు కూడా తగ్గిపోతాయని, ఇలాంటి పరిస్థితుల్లో ఈ ఇథనాల్ ఫ్యాక్టరీ వల్ల దేశానికిగానీ, ప్రజలకుగానీ ఎలాంటి ఉపయోగం ఉండదన్నారు. ఫ్యాక్టరీ ప్రారంభ దశలో ఉంది కాబట్టి ఇకనైనా పూర్తిగా నిలిపివేయకుంటే తీవ్ర ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని ఫ్యాక్టరీ యాజమాన్యాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షులు దేవదాస్, రాజోలి మండలం బీజేపీ అధ్యక్షులు సంజీవరెడ్డి, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ గవ్వల శ్రీనివాసులు, డబ్ల్యూ.నర్సింహా, సిద్దార్థ, హేమంత్, తేజ, నవీన్ శెట్టి, గీతరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై ఐదుగురు లైంగిక దాడి

- నిందితుల్లో ముగ్గురు మేజర్లు ఇద్దరు మైనర్లు
- దోమ పోలీస్ అదుపులో నిందితులు
- దర్యాప్తు వేగవంతం చేసిన పోలీసులు

**వికారాబాద్ జిల్లా బ్యూరో నవంబర్ 1 (జనం సాక్షి) :** అరచేతిలో శృంగారం చూస్తూ... మొబైల్లో ఫోర్న్ వీడియోలకు అలవాటు పడి జులాయి గా తిరుగుతున్న ఐదుగురు మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారు. పోలీస్ అమర వీరుల వారోత్సవాల సందర్భంగా కాలేజ్ పాఠశాలల విద్యార్థులకు పోలీస్ శాఖ డ్రగ్స్ మత్తు పానీయాలు లైంగిక దాడి సంఘటనలు పోలీసులు చట్టాలు ఆయుధాల గురించి విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న తరుణంలో ఒక మైనర్ బాలికపై ఐదుగురు సామూహికంగా లైంగిక దాడికి పాల్పడడం సంచలనం సృష్టించింది. వారి చెర తప్పించుకొని పరుగులు తీసి జరిగిన దారుణం గురించి తల్లిదండ్రులకు తెలియజేయడంతో ఈ దారుణ ఉదాంతం వెలుగులోకి వచ్చింది. లైంగిక దాడికి పాల్పడిన ఐదుగురిలో ముగ్గురు మేజర్లు కాగా ఇద్దరు మైనర్ బాలురు ఉన్నారు. మత్తు మందుకు అలవాటు పడి దారుణానికి వడిగట్టినట్లు విశ్వసనీయ సమాచారం వల్ల తెలుస్తుంది. ఈ దారుణ సంఘటన వికారాబాద్ జిల్లా దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానిక పోలీసులు బాధిత బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఒక పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న ఒక మైనర్ బాలికపై ఒక గ్రామానికి చెందిన ఐదుగురు వ్యక్తులు లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటన దీపావళి పండుగ రోజున జరిగింది. తనపై లైంగిక దాడి జరిగిన విషయమై బాధిత మైనర్ బాలిక వారి తల్లిదండ్రులకు తెలియజేయడంతో ఈ దారుణ సంఘటన వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు బాధ్యత మైనర్ బాలిక తల్లిదండ్రులు దోమ పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో దోమ పోలీసులు లైంగిక దాడి ఫోక్స్ కో కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధిత మైనర్ బాలికకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన ముగ్గురు మేజర్ వ్యక్తులు ఇద్దరు మైనర్ బాలురు మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారు. వీరంతా స్నేహితులే. గ్రామంలో జులాయి గా తిరుగుతూ మత్తు ముందుకు అలవాటు పడి మత్తులో దారుణానికి ఒడిగట్టినట్లు తెలుస్తోంది. రోజంతా ఒక దగ్గర గుమ్మిగుడి చేతిలో శృంగారాన్ని చూస్తూ మొబైల్ ఫోన్ లో ఫో ర్నీ వీడియోలు చూస్తూ మత్తులో ఈ దారుణానికి ఒడిగట్టినట్టు ప్రాథమికంగా తెలుస్తుంది. కాగా మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఐదుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ ఐదుగురు వేరు వేరు సందర్భాల్లో మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు జరిపిన దర్యాప్తులో తేలింది. పోలీస్ అమరవీరుల దినోత్సవ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులను పోలీస్ శాఖ జాగృతం చేస్తున్న తరుణంలో ఈ సంఘటన వెలుగులోకి కొసమెరుపు....

## ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి: అదనపు కలెక్టర్

**బొంరాస్ పేట,నవంబర్ 1 (జనం సాక్షి):** దుద్యాల మండల కేంద్రంలో శుక్రవారం అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, తాండూరు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 6 నుండి 18వ తేదీ వరకు సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పకడ్బందీగా ఎలాంటి పొరపాట్ల కు తావు లేకుండా నిర్వహించాలని దుద్యాల గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎన్యుమరె టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు పాల్గొన్నారు.

# ఎరవేసి.. వలపన్ని.. ఉచ్చు బిగించిన ఫలితం

## వైద్యుడి ఇంట్లో 18 లక్షల మాదకద్రవ్యాల స్వాధీనం



**శేరిలింగంపల్లి, నవంబర్ 01 (జనంసాక్షి) :** సస్పెన్స్ థ్రిల్లర్ ను మించిన ఓ డ్రగ్ కేసులో చందానగర్ పోలీసులు అత్యంత నాటకీయ పద్ధతిలో విజయాన్ని సాధించి దోషుల ఆటలు కట్టించారు. వివరాలలోకి వెళితే... శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుల్మోహార్ పార్క్ ప్రాంతంలో ఓ వైద్యుడి ఇంట్లో డ్రగ్స్ పార్టీకి ప్లాన్ చేసిన సమాచారం చందానగర్ పోలీసులకు లభించింది. విశ్వసనీయ సమాచారం మేరకు చందానగర్ పోలీసులు శుక్రవారం సదరు వైద్యుని ఇంటిపై దాడిచేసి విచారణను కొనసాగించగా... వైద్యుని ఇంట్లో మాదకద్రవ్యాలు(డ్రగ్స్) లభ్యం కావడం సంచలనాన్ని కలిగించింది. చందానగర్ సిఐ వెల్లడించిన వివరాల ప్రకారం... రాజస్థాన్ నుండి తరచుగా మాదకద్రవ్యాలను సరఫరా చేయడం ప్రవృత్తిగా మార్చుకున్న ఓ వైద్యుడు గురువారం 18 లక్షల రూపాయల విలువచేసే 150 గ్రాముల ఎండిఎంఏ డ్రగ్స్ ని హైదరాబాద్ కు తరలించి నగరంలో విక్రయించడానికి ప్రయత్నిస్తుండగా అకస్మాత్తుగా పోలీసులు దాడి చేసి ఎండిఎంఏ మాదకద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు దాడి చేసిన సమయంలో ఘటనాస్థలంలో 18 లక్షల రూపాయల విలువ చేసే ఎండిఎంఏ డ్రగ్ ప్రత్యక్షంగా లభించడంతో దాన్ని సీజ్ చేయడం జరిగిందని సిఐ తెలిపారు. ఈ కేసులో ఒకరిని అదుపులోకి తీసుకోగా మరో ఐదుగురు పరారీలో ఉన్నట్లు తెలిసింది. నిందితులలో రాజస్థాన్ జలోర్ ప్రాంతానికి చెందిన కృష్ణారాం(28), ఇండోర్ మధ్యప్రదేశ్ ప్రాంతానికి చెందిన సమీర్ ఖాన్, లాథూరామ్, విజయవాడ ప్రాంతానికి చెందిన విక్రమ్ సింగ్, అనంతపూర్ కు చెందిన రామ్ సింగ్, పక్ రాజ్ రాజపురోహిత్, చాలిసింగ్, సుమేర్ తదితరులు ఉండగా సమీర్ ఖాన్, సుమేర్ ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు.

## వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా వెంకటరమణ

**వికారాబాద్ జిల్లా బ్యూరో, (జనంసాక్షి):** వికారాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా ఇటీవల బదిలీలలో నియమించబడిన . వెంకట రవణ నేడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.అనంతరం డిఎంహెచ్ఓ కార్యాలయ సిబ్బంది, ప్రోగ్రాం అధికారులు నూతనంగా నియమింపబడిన డిఎంహెచ్ఓకి పుష్పగుచ్ఛము, శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ లింగయ్య నాయక్ ని, అడిషనల్ కలెక్టర్ సుధీర్ ను నేను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓలు డా.జీవరాజ్, డా.రవీంద్ర యాదవ్, వి.శ్రీనివాసులు డిప్యూటీ డెమో పాల్గొన్నారు.



# విధుల పట్ల అలసత్వం

## అధికారులపై కొరడా ఝులిపించిన కలెక్టర్

- సమయపాలన పాటించని ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

**భువనగిరి కలెక్టరేట్, నవంబర్ 1 (జనంసాక్షి) :** సమయపాలన పాటించక విధుల పట్ల అలక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులపై జిల్లా కలెక్టర్ హనుమంతరావు కొరడా జూలిపించారు. శుక్రవారం జిల్లాలోని ఆలేరు, గుండాల మండలాలలో ఆకస్మిక పర్యటించి తనిఖీలు నిర్వహించారు. అక్టోబర్ 28 సాయంత్రం కలెక్టర్ గా బాధితలు స్వీకరించిన రెండు రోజుల వ్యవధిలోనే విస్తృతంగా పర్యటనలు తనిఖీలు చేపట్టి ,అధికారులలో విధుల పట్ల అలసత్వం వహిస్తే సహించేది లేదని ,క్షేత్రస్థాయిలో అధికారుల పనితీరు మెరుగుపరచాలని, పర్యటిస్తున్నట్లు వివరించారు. ఆలేరు వ్యవసాయ , ప్రత్యేక అధికారి, గోపాల్ విధుల పట్ల ఆలక్ష్యం వహించి సకాలంలో గైర్హాజర్ అయినందున షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఆలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర లో ఉదయం 10 గంటల సమయం దాటిన డాక్టర్ లు, సిబ్బంది ,విధులకు హాజరు కాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. హాస్పిటల్ మెడికల్ సూపరిండెంట్ డాక్టర్ స్వప్న రాథోడ్ తోపాటు, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ రజిని ల కు నోటీసులు జారీ చేస్తూ వెంటనే సంజాయిషీ ఇవ్వాలని లేదంటే చర్యలు తీసుకోవడం తప్పదని హెచ్చరించారు. అంతేకాకుండా ఆస్పత్రిలో పారిశుద్ధ్య నిర్వహణ ఏజెన్సీ సక్రమంగా లేదని అపరిశుభ్రమైన బెడ్ షీట్ లు పరిశుభ్రత సక్రమంగా లేని కారణంగా తక్షణమే సమాధానం ఇవ్వాలని ఏజెన్సీ తొలగించి కొత్తవారిని తీసుకోవాలని ఆదేశించారు.

గుండాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హాజరు రిజిస్టర్ తో పాటు, ఓపి పేషెంట్, మందుల స్టాక్ వివరాలను సంబంధించిన రిజిస్టర్ లను పరిశీలించారు. అంతకు ముందు స్వాతి నక్షత్రం పురస్కరించుకొని యాదగిరిగుట్ట లో లక్ష్మీనరసింహస్వామి గిరి ప్రదక్షిణ లో కలెక్టర్ తో దేవస్థాన ఈవో భాస్కరరావు పాల్గొన్నారు. ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరై సేవలు అందిస్తే ,సామాన్య పేద ప్రజలు, ప్రైవేట్ వైపు చూడరని అన్నారు. సకాలంలో వైద్యం అందించి నట్లయితే ప్రభుత్వ ఆస్పత్రుల నే ఆశ్రయిస్తారు అని తెలిపారు. సామాజిక ,ఆర్థిక ,విద్య తదితర అంశముల పై కుల గణన కార్యక్రమానికి ప్రభుత్వం చేపడుతున్నందున క్షేత్రస్థాయిలో అధికారులు ఉద్యోగుల పనితీరుపై పరిశీలన చేస్తున్నారని నిరంతరం తనిఖీలు నిర్వహిస్తానని సందర్భంగా హెచ్చరించారు.





# నేటి నుండి నాగార్జునసాగర్ టు శ్రీశైలం లాంచీ ప్రయాణం

- నల్లమల అటవీ,ఎత్తైన కొండల మధ్య సాగనున్న లాంచీ ప్రయాణం
- ఆసక్తి చూపుతున్న పర్యాటకులు
- పర్యటకులతో సందడిగా మారనున్న కృష్ణమ్మ తీరం
- ఆహ్లాదాన్ని పంచనున్న లాంచీ ప్రయాణం

**నాగార్జునసాగర్,అక్టోబర్ 01(జనంసాక్షి) :** పరవళ్లు తొక్కే కృష్ణమ్మపై ప్రయాణం ఓ మధురానుభూతిని పంచుతుంది. నాగార్జున సాగర్ టు శ్రీశైలం వరకు ప్రతిక్షం నల్లమల అటవీ ప్రాంతం,ఎత్తైన కొండలు .. అడుగడుగనా ప్రకృతి అందం మనసుకు ఆహ్లాదాన్ని ఇస్తూ ఉంటుంది. అలాంటి మధురానుభూతిని పొందాలి అనుకునే వారికి అవకాశం కల్పిస్తోంది పర్యాటక శాఖ.. నేటి నుండి నాగార్జునసాగర్ టు శ్రీశైలం లాంచీ ప్రయాణం ఉదయం 9గంటలకు ప్రారంభం కానున్నట్టు తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ అధికారులు తెలిపారు.

**పర్యటకులతో సందడిగా మారనున్న కృష్ణమ్మ తీరం**

కృష్ణమ్మ తీరంలో పర్యాటకం సందడిగా ప్రారంభమవబోతుంది, కృష్ణమ్మ అలలు, భవానీ ద్వీపం అందాలు రెండు మూడేంటి.. అడుగు అడుగునా పర్యాటక ప్రాంతాలే దర్శనమిస్తాయి. ప్రకృతి అందాలే కాదు.. ఆధ్యాత్మిక భావన కూడా మదిని హాయిగా ఉండేలా చేస్తుంది. అందుకే ఈ టూర్‌కు ఎంతో ఆసక్తి చూపిస్తుంటారు తెలుగు ప్రజలు.. ప్రస్తుతం సాగర్ నీటిమట్టం దాదాపు 589 అడుగులు ఉండడంతో తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఈ టూర్‌కు పచ్చజెండా ఊపింది.తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో సాగే లాంచీ ప్రయాణం పర్యాటకులకు అంతులేని ఆనందాన్ని ఇస్తుంది.


ఆహ్లాదకరమైన దృశ్యాలతో పాటు ఆధ్యాత్మిక వాతావరణంలో సాగే లాంచీ ప్రయాణం హాయిగా ఉంటుంది. ఈ ప్రయాణం మరవలేని స్మృతులను అందించనుంది. పక్షుల కిలకిల రావాలతో, నీటి సవ్వడుల మధ్య సాగే ఈ జర్నీలో ఆద్యంతం ఆసక్తిగా సాగుతూ కొండల మధ్య తిరుగుతూ ఉంటుంది. మనకు తెలియని కొత్త, వింతైన విషయాలను తెలుసుకునేందుకు దోహద పడతాయి. లాంచీ నేడు ఉదయం 9గంటలకు నాగార్జునసాగర్ నుండి బయలుదేరి సాయంత్రానికి శ్రీశైలం చేరుకుని ప్రయాణికులు రాత్రికి అక్కడే బస చేసి మరుసటి రోజు ఆదివారం మల్లికార్జున స్వామి దైవదర్శనం అనంతరం తిరుగుప్రయణమయి సాయంత్రానికి నాగార్జునసాగర్ చేరుకుంటారు.

**ప్రత్యేక ప్యాకేజీని కల్పించిన పర్యాటకశాఖ**

ఛార్జీల వివరాలిలా ఇవే..సాగర్ నుంచి శ్రీశైలానికి ఒకవైపు పెద్దలకు 2,000 రూపాయలు వసూలు చేస్తారు.. అదే పిల్లలకు అయితే 1,600 రూపాయలు ఛార్జ్ చేస్తారు. అలాగే శ్రీశైలం నుంచి సాగర్ వైపు కూడా సేమ్: ఇదే ఛార్జీ వసూలు చేస్తారు. అలాకాకుండా రెండు వైపులా ఒకే సారి బుక్ చేసుందాం అనుకునే వారికి ప్రత్యేక ప్యాకేజ్ ఉంది. రెండు వైపుల పెద్దలకు 3,000 రూపాయలు, పిల్లలకు 2400 రూపాయలు వసూలు చేస్తారు. ప్యాకేజీని బుకింగ్ చేసుకునేందుకు https://tourism.telangana.gov.in/ వెబ్‌సైట్‌ను సందర్శించాలి. లేదా 9848540371 లేదా 9848306435 నెంబర్లను సంప్రదించాలి. marketing@tgtdc.inకు మెయిల్ కూడా చేయవచ్చని పర్యాటకశాఖ పేర్కొంది.


# శంషాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత

## హ్యాష్ ఆయిల్ ముఠా అరెస్ట్



**శంషాబాద్, నవంబర్ 1 (జనంసాక్షి) :** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి. బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఇద్దరు యువకుల్ని, వారి లగేజీలను తనిఖీ చేయగా.. చాక్లెట్ల, 13 వాక్యూం ప్యాకెట్లో ద్వారా హైడ్రోఫోలిక్ వీడ్‌ను స్మగ్లింగ్ చేస్తున్నట్లు గుర్తించారు. వారి నుంచి 7.096కిలోల హైడ్రోఫోలిక్ వీడ్ ను స్వాధీనం చేసుకున్నారు. 7.096 కేజీలు సుమారు దీని విలువ 7 కోట్ల రూపాయలు బహిరంగ మార్కెట్లో ఉంటుందని అంచనా. ఇద్దరు ప్రయాణికులను అరెస్టు చేసి విచారణ చేస్తున్నట్లు డిఆర్ఐ అధికారులు తెలిపారు. వారిద్దరినీ అధికారులు అరెస్ట్ చేసి, ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేశారు. మరోవైపు బాలానగర్‌లో హ్యాష్ ఆయిల్ విక్రయిస్తున్న ముఠాను ఎస్ఓటీ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు సుమన్, లాలు, విజయ్ కుమార్‌ల నుంచి 2.6 లీటర్ల హ్యాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ సుమారు రూ.13.50 లక్షలు ఉంటుందని తెలిపారు.

# సమగ్ర ఇంటింటి సర్వేను పరిశీలించిన కలెక్టర్ గౌతం



**శామీర్ పేట్ (జనంసాక్షి ):** రాష్ట్ర ప్రభుత్వం ఏంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య,ఉపాధి,రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా శుక్రవారం శామీర్ పేట్, బాబాగూడలో నిర్వహిస్తున్న సర్వేను జిల్లా అదనపు కలెక్టరు రాధికా గుప్తాతో కలిసి మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టరు ఇంటింటికి అతికించిన స్టిక్కర్లను పరిశీలించి, సర్వేకు సంబంధించిన ప్రొఫార్మలను పరిశీలించి ఏ విధంగా నమోదు చేస్తున్నారని, కుటుంబ సభ్యులను ఏమేమి ప్రశ్నలు అడుగుతున్నారని, మీకు ఎన్ని ఇండ్లు కేటాయించారని సర్వే నిర్వహిస్తున్న ఎన్యుమరేటర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సర్వేలో కుటుంబయజమాని గాని, సభ్యులు గాని స్వచ్ఛందంగా తెలిపిన వివరాలను మాత్రమే ప్రోఫార్మాలలో నింపాలని కలెక్టరు సూచించారు. సూపర్ వైజర్లు, ఎన్యుమరేటర్లు హాజరవు తున్నారా అని ఎంపిడిఓ మమతా బాయిని కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. తెలంగాణరాష్ట్ర ఆధార్, ఓటరు కార్డులు ఉన్న వారి వివరాలను తప్పక నమోదు చేయ్యాలని కలెక్టరు సూచించారు.





# దివిస్ పరిశ్రమ కాలుష్యం నుంచి కాపాడాలి : ఆరేగూడెం రైతుల ధర్నా

**చౌటుప్పల్,నవంబర్ 1(జనం సాక్షి):** చౌటుప్పల్ మండల పరిధిలోని దివిస్ పరిశ్రమ నుంచి వెలువడే కాలుష్యం నుంచి తమను కాపాడాలని ఆరెగూడెం గ్రామ రైతులు పరిశ్రమ గేటు ఎదుట ధర్నా నిర్వహించారు,కలెక్టర్ దగ్గరికి వెళ్లినా కానీ సమస్యకు పరిష్కారం దొరకలేదని,కలెక్టర్ ని కూడా గ్రామంలోకి రాకుండా కంపెనీ యాజమాన్యం అడ్డుకుందని,ప్రతి ఒక రైతు మందు డబ్బా తెచ్చుకొని తాగి ఇక్కడే చనిపోవాల్నా అని వాపోయారు,పశువులు కూడా చనిపోతున్నాయని,బోరు మోటర్లు ఆన్ చేయగానే విషతుల్యమైన నీరు వస్తుందని తెలిపారు. పరిశ్రమ చుట్టూ ఉన్న గ్రామాలు తంగడపల్లి, ఆరెగూడెం,కాట్రేవు గ్రామ రైతులు వ్యవసాయం చేయలేకపోతున్నారని ఈ పరిశ్రమ పైన పోరాటం చేయని రైతు లేదని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ లో కేసులు నడుస్తున్నయని రైతులు తెలియజేశారు

# తుది శ్వాస వరకు ప్రజాసేవలోనే ఉంటా

### మాజీ మంత్రి వనమా

**భద్రాద్రి కొత్తగూడెం నవంబర్ 1 (జనం సాక్షి)**

తుది శ్వాస వరకు ప్రజా జీవితం లోనే గడుపుతానని, ప్రజల సమస్యల పరిష్కారానికి రాజీ లేని పోరాటం చేస్తాననీ మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన స్వగృహంలో జరిగిన జన్మ దినాన్ని పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫ్లెక్సీలు, తోరణాలు ఏర్పాటు చేశారు. బాణాసంచా పేలుస్తూ వనమా జిందాబాద్ అంటూ కేరింతలు కొట్టారు. భారీ కేకే కట్ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ వార్డ్ మెంబర్ స్థాయి నుంచి మంత్రి వరకు తన ఎదుగుదలకు కృషి చేసిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. నాలుగు సార్లు ఎంఎల్ఏ గా ఆదరించిన ప్రజలకు సదా అండగా ఉంటానని, ఎన్ని జన్మలు ఎత్తినా వారి రుణం తీర్చుకోలేనిదని భావోద్వేగంతో అన్నారు. తమ కుటుంబం పట్ల చూపుతున్న ఆదరణకు కృతజ్ఞతలు చెప్పారు. రాష్ట్రంలో కేసిఆర్, కొత్తగూడెంలో వనమా క్యాడర్ ఎప్పటికీ చెక్కు చెదరకుండా ఉంటుందని దీమా వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఖచ్చితంగా గెలిచి ప్రజా క్షేత్రంలో తన సత్తా నిరూపించుకుంటానని, ఈ ప్రాంత సర్వతోముఖాభివృదికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్వంచలో సీనియర్ నాయకులు కిలారు నాగేశ్వరావు, దిండిగాల రాజేందర్,మాజీ ఎంపీపీ మడివి సరస్వతి,కనగాల బాలకృష్ణ,మల్లెల రవిచంద్ర, మంతపురి రాజు గౌడ్, కాంపెల్లి కనకేష్ పటేల్, మల్లెల శ్రీరామ్మూర్తి, పూసల విశ్వనాథం, బట్టు మంజుల కరాటే సింధు తపస్వి,డిష్ నాయుడు, దాసరి నాగేశ్వరావు, కాల్వ ప్రకాష్, సమ్మయ్య గౌడ్, భూక్యా వీరన్న, డాబా శంకర్ బీసీ నాయకులు సత్యనారాయణ, రవి, దంతెలబోర వీర్రాజు,నారకట్ల రాజాశేఖర్,జూపెల్లి దుర్గప్రసాద్, కంచర్ల రామారావు, యూనియన్ నాయకులు చారుగుండ్ల రమేష్, కొత్వాల సత్యనారాయణ,ఏనుగుల శ్రీను ముత్యాల రమణమూర్తి,బండ్ల పవన్,నవభారత్ రాంబాబు,బట్టు సురేష్ జవహర్,కుంపటి శివ,రాష్ట్ర గిరిజన నాయకులు వాసం రామకృష్ణ, 1104 యూనియన్ కోటి,327 యూనియన్ అధ్యక్షులు వజీర్, 1535 యూనియన్ శ్రీధర్ సాక్షి ప్రసాద్ కాంగ్రెస్ నాయకులు జాలే జానకి రెడ్డి, ఎర్రంశెట్టి ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు



## అరుణాచల గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తులకు శుభవార్త

**భద్రాచలం నవంబర్ 1 (జనం సాక్షి):**

కార్తీక పౌర్ణమి సందర్భంగా నవంబర్ 15 న అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణ కు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడుపుతున్నట్లు టిఎస్ఆర్టిసి భద్రాచలం డిపో మేనేజర్ తిరుపతి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ 13న రాత్రి 8 గంటలకు భద్రాచలం బస్టాండ్ నుండి బయలుదేరి విజయవాడ మీదుగా శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం (గోల్డెన్ టెంపుల్)లను దర్శింపచేసి రాత్రి 10 గంటలకు అరుణాచలం చేరుతుందన్నారు. అరుణాచలేశ్వర స్వామి వారి గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత నవంబర్ 15 సాయంత్రం 5 గంటలకు బయలుదేరి నవంబర్ 16 వ తేదీ సాయంత్రం 4 గంటలకు భద్రాచలం చేరుకుంటుందని డిఎం తెలిపారు. ఈ ప్యాకేజీ ధరను అన్ని సెస్ చార్జీలు, బోర్డర్ టాక్సు టోలు టాక్సులు, నాలుగు దేవస్థానములు కలుపుకొని రూ.4 వేలుగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఈ సదుపాయాన్ని అరుణాచల గిరి ప్రదక్షిణ చేయాలనుకునే భక్తులు వినియోగించు కోవాలని కోరారు. అలాగే అన్నవరం, పంచారామాలకు కూడా కార్తీక మాసంలో వచ్చు అన్నీ ఆదివారాలలో బస్సు లు నడపడం జరుగుతుందని డి ఎం పేర్కొన్నారు. ఈ టూర్ ప్యాకేజీని సంస్థ అధికారిక వెబ్ సైట్ టిజిఎస్ ఆర్టిసిబస్. ఇన్‌లో ముందస్తు రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. భద్రాచలం, పాల్వంచ, కొత్త గూడెం, చుట్టుపక్కల ప్రాంతాల వారు తమ దగ్గరలోని బస్టాండ్ తో పాటు సమీప టీఎస్ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్లలోనూ బుక్ చేసుకోవచ్చని, ఈ టూర్ ప్యాకేజీకి సంబందించిన పూర్తి సమాచారం కోసం 7386326102, 7382856625, 9347797952 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.



## ఐదు గ్రామపంచాయతీలను భద్రాచలంలో కలిపేందుకు చొరవ చూపండి

**భద్రాచలం నవంబర్ 1 (జనం సాక్షి):**

ఆంధ్రాలో విలీనమైన ఐదు గ్రామపంచాయతీలను భద్రాచలంలో కలిపి భద్రాచలం అభివృద్ధికి చొరవ చూపాలని తెలంగాణ జనసమితి అధినేత, ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాంను వారి నివాసంలో జర్నలిస్ట్ జంగిలి నవీన్ శుక్రవారం కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భద్రాచలం పట్టణంలో అంతర్భాగంగా ఉన్న ఐదు గ్రామ పంచాయతీలు యటపాక, కన్నాయిగూడెం, గుండాల, పిచ్చుకలపాడు, పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీలను తెలంగాణలో కలిపే అంశంపై రూట్ మ్యాప్ అందించారు. భద్రాచలం ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ విషయంపై ఎమ్మెల్సీ కోదండరాం స్పందిస్తూ ఇటీవల తాను భద్రాచలం పర్యటనకు వచ్చినప్పుడు ఐదు గ్రామ పంచాయతీల సమస్యతో పాటు దక్షిణ అయోధ్యగా ఉన్న భద్రాచలం సీతారాముల వారి ఆలయం అభివృద్ధి విషయం అదే విధంగా పర్ణశాల వెళ్లాలంటే ఆంధ్రాలో కలిసిన తొమ్మిది కిలోమీటర్ల పరిధిలో ఉన్న యటపాక, కన్నాయి గూడెం పంచాయతీలను దాటి పర్ణశాలకు వెళ్లాలంటే భక్తులు పడుతున్న ఇబ్బందులు చూసి చలించిపోయానని అన్నారు. తెలంగాణ జన సమితి తరపున రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలతో మాట్లాడి ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో కలిపేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కోదండరాంకు నవీన్ కృతజ్ఞతలు తెలిపారు.



## సమగ్ర కుటుంబ సర్వేలో తప్పులు ఉండొద్దు

### నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ

**శాలిగౌరారం నవంబర్ 01 (జనం సాక్షి)**

కాంగ్రెస్ సర్కారు ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి కుటుంబ సమగ్ర సర్వే లో ఎటువంటి తప్పులు లేకుండా ఈ కార్యక్రమం చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ అన్నారు.శుక్రవారం శాలిగౌరారం మండలంలో అన్ని గ్రామాల్లో కుటుంబ సర్వే చేసే సూపర్ వైజర్ లు,ఎన్యూమరేటర్లు ఇంటింటా నెంబరింగ్ వేస్తున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ శాలిగౌరారం, వల్లాల గ్రామాల్లో కుటుంబ సర్వే చేయడానికి నెంబరింగ్ చేస్తున్న విధానం ను తనిఖీ చేశారు.సర్వే పార్మేట్ లో అన్ని అంశాలను క్షుణ్ణ%శీ%గా పరిశీలించి తప్పులు దొర్లకుండా వివరాలను పొందుపర్చాలని అదేశించారు.ఎన్యూమరేటర్ల వద్ద ఉన్న పార్మేట్ ను ఇంటి యజమానులు పట్టికను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమం లో మండల స్పెషల్ ఆఫీసర్ మాన్యా నాయక్, తహసీల్దార్ పి. యాదగిరి, ఎంపీడీఓ గార్లపాటి జ్యోతి లక్ష్మి, ఎంపీవో పద్మ, ఏపీఎం జానకి, సూపర్ వైజర్లు, ఎండీ. అజారుద్దీన్, రాజు, రాంబాబు, రాములు, రాందాస్, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.



## ఎరువుల షాపులపై వ్యవసాయ అధికారులు దాడులు

**హుజూర్ నగర్, నవంబర్ 1 (జనంసాక్షి):**

పట్టణంలోని లక్ష్మీ సీడ్స్ సంబంధించిన ఎరువుల గోదాంలో వ్యవసాయ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. పట్టణంలో సుమారు కోటి రూపాయలు విలువ చేసే క్రిమిసంహారక మందులు జీరో దందా చేస్తున్నారని సమాచారంతో అధికారులు దాడులు చేసి గోదాంలో ఉన్న సరుకును పరిశీలించారు. లక్ష రూపాయలు విలువచేసే క్రిమ్ సంహారక మందుల్లో కొన్నిటికి పర్మిషన్ లేనట్లు అధికారులు గుర్తించారు. గోదాంలో ఉన్న సరుకు సంబంధించి కొన్నిటికి మాత్రమే బిల్లులు ఉన్నాయి మరికొన్ని మందులకు బిల్లులు లేవని అధికారులు గుర్తించి నోటీసులు జారీ చేయాలని ఏవోను ఏడిఏ ఆదేశించారు. రెండో నోటీస్ కూడా జారీ చేసి తగు చర్యలు తీసుకోవాలని ఏవో ను ఆదేశించారు. లక్ష్మి సీడ్స్ సంబంధించి గోదాముకు ఎలాంటి అనుమతులు లేవని అధికారులు గుర్తించారు. అనుమతులు లేకుండా, ఎలాంటి బిల్లు లేకుండా నిలువచేసిన క్రిమిసంహారక మందులను సీజ్ చేయాలని ఆదేశించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో ఏడిఏ రవి నాయక్, ఏవో స్వర్ణ పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు, వేగవంతం చేయాలి



### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ

**శాలిగౌరారం నవంబర్ 01 (జనం సాక్షి)**

అన్నదాతలకు ఎటువంటి ఆటంకం ఎదురవకుండా సత్వరమే ధాన్యం కొనుగోల్లు వేగవంతం చెయ్యాలని లారీల ద్వారా వెంటనే దిగుమతులు చేయాలని నల్గొండ జిల్లా నూతన కలెక్టర్ ఇలా త్రిపాఠీ సివిల్ సప్లై అధికారులను అదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠీ శాలిగౌరారం వ్యవసాయం మార్కెట్ ను సందర్శించి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడారు.అనంతరం వ్యవసాయం మార్కెట్‌లోని పలు గోదాంల్లో సివిల్ సప్లై ఆధ్వర్యంలో చేస్తున్న ధాన్యం దిగుమతులను పరిశీలించారు.గోదాం ల్లో నిల్వ ఉంచిన దాన్యం ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ గోదాంల్లో అదనంగా మరొక సిబ్బందిని నియమించాలని అధికారులను ఆదేశించారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం ను సత్వరమే లారీల ద్వారా ఎగుమతులు, దిగుమతులు చేయాలని కోరారు.రైతులు నాణ్యమైన ధాన్యం ను మార్కెట్ తీసుకవచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కలక్టర్ వెంట డిఎస్ఓ వెంకటేశ్వర్లు, డిసిఓ పాత్యా నాయక్, సివిల్ సప్లై డిఎం హరీష్, తహసీల్దార్ పి. యాదగిరి, సివిల్ సప్లై డీటీ జ్యోతి, మానిటరింగ్ అధికారి నాగేశ్వర రావు, ఏపీఎం జానకి, సింగల్ విండో సిఈఓ నిమ్మల ఆంజనేయులు, కొనుగోలు కేంద్రం ఇంచార్జ్ కర్నాటి శంకర్, సిబ్బంది నిమ్మల నరేష్, చిలుకూరి సుమన్, రాజు రైతులు పాల్గొన్నారు.

# అభివృద్దే లక్ష్యంగా ఎమ్మెల్యే పాయం

- మోతేలో రూ.1.20కోట్లతో బీటీ రోడ్డుకు శంకుస్థాపన
- పనులు ప్రారంభించిన పాయం



**బూర్గంపహాడ్ నవంబర్ 01(జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం పరిధిలోని మోతే గ్రామంలో పినపాక నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ప్రజాసమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మోతే పట్టీనగర్లో రూ. 1.20కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ ప్రధాన రహదారి నుంచి గ్రామంలో రెండు కిలోమీటర్ల మేర బీటీ రహదారి నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అనంతరం స్థానిక ప్రజలు పలు సమస్యలపై వినతిపత్రాలు ఇవ్వగా సమస్యల పరిష్కారం కోసం పలు శాఖల అధికారులతో మాట్లాడి సమస్య వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజాసమస్యలు లేకుండా అధికారులు కృషిచేయాలన్నారు. తొలుత ఎమ్మెల్యేకు గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, పంచాయతీరాజ్ డీఈ పొదెం వెంకటేశ్వర్లు, ఏఈ చారి, లక్ష్మీపురం మాజీ ఉపసర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, చక్రవర్తి, ఇంగువ రమేష్, మహ్మద్ఖాన్, బాదం రమేష్రెడ్డి, బెల్లంకొండ వాసు, గోనె రేణుక, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# క్షేత్ర స్థాయిలో పని చేసే పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత



- జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కిట్ ఆర్టికల్ పంపిణీ
- జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి

**మెదక్ బ్యూరో నవంబర్ 1(జనం సాక్షి):**

క్షేత్రస్థాయిలో పనిచేసే పోలీస్ సిబ్బంది సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత నివ్వడం జరుగుతుందని జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పి.డి.ఉదయ్ కుమార్ రెడ్డి జిల్లా సిబ్బందికి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం కిట్ ఆర్టికల్ పంపిణి చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి.డి.ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. పోలీసులు చలి వానా ఎండా కాలాల్లో విధులు నిర్వహించే పరిస్థితులు ఉంటాయన్నారు. పోలీసులకు ఏ ఆటంకాలు కలగకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా తమ పై ఉంటుందని, అందుకు శీతాకాలంను దృష్టిలో ఉంచుకొని 'వులెన్ జాకెట్' వులెన్ బ్లాంకెట్స్ ముస్కీటోనెట్, టి షర్ట్స్ లను సిబ్బందికి పంపిణీ చేశామని జిల్లా ఎస్.పి.డి.ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. క్షేత్ర స్థాయిలో పని చేసే పోలీసు సిబ్బంది సంక్షేమానికి తాము అత్యంత ప్రాధాన్యత నిస్తామని, ప్రతి ఉద్యోగి వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబ సభ్యుల ఆరోగ్యం పట్ల కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఈ సందర్భంగా ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ ఎస్. మహేందర్, సాయుధ ధల డిఎస్పీ రంగ నాయక్, ఆర్ఐ శైలేందర్, ఎఆర్ ఎస్. నరేష్, స్టోర్ ఇంచార్జ్ తుడుం రాములు తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు ఇప్పించాలని కేంద్ర హెూం సహాయక శాఖ మంత్రికి వినతి

### త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని ఆదేశం

**బెజ్జంకి, నవంబర్ 01,(జనం సాక్షి):**

మానకొండూరు నియోజకవర్గం బెజ్జంకి మండలంలో బిజెపి యువ నాయకులు సాన వేణు ఆధ్వర్యంలో ఎస్‌డిఎఫ్ నిధులు సాంక్షన్ అయి ఉండి ప్రొసీడింగ్ ద్వారా పనులు అయిన పిదప కొత్త ప్రభుత్వంలో ప్రొసీడింగ్ నిధులు చేసి బిల్లులు ఆపిన విషయమై కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్‌కి గుండారం గ్రామ ప్రజల పక్షాన వినతి పత్రం అందించారు. అనంతరం గుండారం గ్రామ ముఖ్య సమస్యలను సాన వేణు పెండింగ్ నిధుల గురించి బండి సంజయ్ కుమార్‌కి తెలియజేయడం జరిగింది. అనంతరం బండి సంజయ్ కుమార్ స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎలుక శ్రీశైలం, బోడపట్ల రాయమల్లు, కంది శ్రీనివాస్ భారీ సంఖ్యలో బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.






## గిరిజన మహిళపై అత్యాచారయత్నం చేసిన నిందితునిపై చర్య తీసుకోవాలి

### ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి పరిహారం అందించాలి

### కేవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు రెముడాల పరశురాములు

**వేములపల్లి, నవంబర్ 01(జనంసాక్షి):**

వేములపల్లిమండలంలక్ష్మీదేవిగూడెం గ్రామంలో ఎస్టి మహిళపై అత్యాచార యత్నం చేసిన కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు గంట కృష్ణయ్య యాదవ్ పై చట్టపరమైన చర్య తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు రెముదాల పరశు రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో కెవిపిఎస్ మండల, జిల్లా, కమిటీ నాయకులు తక్కెలపల్లి శ్యామ్ కుమార్,బాధితురాలి భర్తతో కలిసి విలేకరులతోమాట్లాడారు. ఈ సంఘటన జరిగి పదిరోజులు గడిచిన వేములపల్లి పోలీస్ స్టేషన్ లో బాదితురాలికుటుంబసభ్యులు కేసు పెట్టినప్పటికీ పోలీసులు వెంటనే స్పందించకపోవడంశోచనీయమన్నారు. ఎస్టీ మహిళపైన అత్యాచార యత్నం జరిగితే అధికార పార్టీ నాయకుడని అధికారులు భయపడి ఆలస్యంగాఎఫ్ఐఆర్ చేయడం జరిగిందన్నారు.ఇప్పటికైనా పోలీస్ అధికారులు పక్షపాతాన్ని విడనాడి నిందితుడుని తక్షణమే అరెస్టు చేయాలని కెవిపిఎస్ డిమాండ్ చేస్తుందన్నారు. దళితులు మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నప్పటికీ గ్రామాలలో ఎస్సీ,ఎస్టీల పైన దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు కొనసాగుతూనే ఉన్నాయన్నారు.ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గిరిజన కుటుంబానికి చెందిన బాధితురాలికి తగిన న్యాయం చేసి నిందితున్ని చట్టపరంగా శిక్షించాలని కోరారు.



## సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలి

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, నవంబర్ 1 (జనం సాక్షి)**

ఈనెల 6 నుండి ప్రారంభం కానున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ పటేల్ అన్నారు. శుక్రవారం పాల్వంచ మండలం పునుకుల గ్రామంలో నిర్వహిస్తున్న కుటుంబాలకు గుర్తింపు కార్యక్రమంలో ఎన్యుమరేటర్లకు తగు సలహాలు ,సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క ఎన్యూమరేటర్ వారికీ కేటాయించిన బ్లాక్ ప్రకారముగా ప్రతి ఇంటిని ప్రతి కుటుంబము గుర్తించాలని, ఈ 3వ తేదీ వరకు పూర్తి చేసి ప్రతీ హౌస్ కు లిస్టింగ్ స్టికర్ ను అతికించాలని చెప్పారు. ప్రతి ఇంటి నుండి స్పష్టత కల్గిన ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలనీ పేర్కొన్నారు. రాష్ట్రము లోని షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతులు ,ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఈ సర్వే దోహదం చేస్తుందనీ వివరించారు.వివిధ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశములు మెరుగు పరచడానికి తగిన ప్రణాళికలు తయారు చేయడం వాటిని అమలు చేయడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె విజయభాస్కర్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి శ్రీ బి నారాయణ, పంచాయతీ కార్యదర్శి బి బాబూరావు, అంగన్వాడీ టీచర్లు,ప్రజలు పాల్గొన్నారు.



## అకాల వర్షం అందరికీ నష్టం

**భువనగిరి కలెక్టరేట్ నవంబర్ 1 (జనం సాక్షి)**

పట్టణంలో భారీ వర్షంతో సుమారు గంటకు పైగా ఎక్కడికక్కడే జనజీవనం స్తంభించి పోయింది. ఒక్కసారిగా అకాల వర్షం కురవడంతో అందరిలో ఆందోళన మొదలైంది. ఆరుగాలం కష్టించి పండించిన పంట నీటి పాలవుతుంది, అనే దిగులుతో రైతులు బిక్కు బిక్కు మంటూ ప్రయాసపడ్డారు. మరోవైపు పంటలు కోసి వరి దాన్య రాశులను అమ్ముకోవడానికి రైతులు మార్కెట్ యార్డులలో కొనుగోలు కేంద్రాలలో నిరీక్షిస్తున్న సమయంలో వర్షం దంచి కొట్టడంతో అందరిలో ఆందోళనలు వ్యక్తం అయ్యాయి. ఏది ఏమైనా ఈ అకాల వర్షంతో అన్ని నష్టాలే అంటున్నారు. ఉదయం నుంచి ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న జనానికి కొంత మేర ఉపశమనం అనే అభిప్రాయం సైతం వినిపిస్తుంది.

# భారత్‌లో మరో నాలుగు స్టోర్లు




- యాపిల్ సంస్థ సీఈవో టిమ్ కుక్


**న్యూఢిల్లీ, నవంబర్ 1 (జనంసాక్షి) :** భారత్‌లో యాపిల్ ఐఫోన్ల విక్రయాలు ఊపందుకున్నాయి. ముంబై, ఢిల్లీలో ఉన్న రెండు స్టోర్ల ద్వారా భారీగా ఆదాయం సమకూరుతోంది. సెప్టెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికంలో కంపెనీకి ఐఫోన్ విక్రయాల ద్వారా భారత్ నుంచి వస్తోన్న ఆదాయం గరిష్ఠ స్థాయికి చేరింది. దీంతో దేశవ్యాప్తంగా ఐఫోన్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని త్వరలోనే మరో నాలుగు స్టోర్లను ప్రారంభించనున్నట్లు సంస్థ సీఈవో టిమ్ కుక్ తాజాగా ప్రకటించారు. 'మొదటి త్రైమాసికంలో రెండు కొత్త స్టోర్‌లను ప్రారంభించాం. ఢిల్లీ, ముంబైలో ఈ అవుట్‌లెట్లను ఏర్పాటు చేశాం. త్వరలోనే భారత్ కస్టమర్లకు నాలుగు కొత్త స్టోర్‌లను తీసుకురాబోతున్నాం' అని యాపిల్ సీసీవో వెల్లడించారు. కాగా, కొత్త స్టోర్లను ఏయే నగరాల్లో ప్రారంభిస్తారన్న విషయాన్ని మాత్రం టిమ్ కుక్ వెల్లడించలేదు. అయితే, పుణె, బెంగళూరు, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబైలలో కొత్త స్టోర్లను నెలకొల్పనున్నట్లు యాపిల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ డియర్డ్రి ఓబ్రియాన్ ఇటీవలే తెలిపిన విషయం తెలిసిందే. ఇక ప్రస్తుతం భారత్‌లో రెండు యాపిల్ స్టోర్లు మాత్రమే ఉన్న విషయం తెలిసిందే. ఒకటి ముంబైలోని బీకేసీలో ఉండగా.. మరొకటి ఢిల్లీలోని సాకేత్‌లో ఉంది. వీటిని 2023లో యాపిల్ అందుబాటులోకి తెచ్చింది. మరోవైపు సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసిక ఫలితాలను యాపిల్ తాజాగా ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఐఫోన్ విక్రయాలు భారీగా పెరిగి ప్రపంచ రికార్డులను నెలకొల్పినట్లు సీఈవో టిమ్ కుక్ ఈ సందర్భంగా తెలిపారు. కంపెనీ రెవెన్యూ గతంలో కంటే 6 శాతం పెరిగి 94.9 బిలియన్ డాలర్లు అంటే రూ.7.9 లక్షల కోట్లుకు చేరినట్లు తెలిపారు. 'యాపిల్ తాజా త్రైమాసిక ఫలితాల్లో రికార్డు స్థాయిలో ఆదాయాన్ని నమోదు చేసింది. ప్రపంచ వ్యాప్తంగా భారీగా ఐఫోన్ అమ్మకాలు జరిగాయి. యూఎస్, యూరప్, బ్రెజిల్, మెక్సికో, ఫ్రాన్స్, బ్రిటన్, కొరియా సహా పలు దేశాల్లో రికార్డు స్థాయిలో ఆదాయం అర్జించింది. ప్రత్యేకించి భారతదేశంలో యాపిల్ ఐఫోన్ సేల్స్ గరిష్ఠాలను చేరుకున్నాయి. భారత్ నుంచి వచ్చే ఆదాయం సరికొత్త రికార్డును నెలకొల్పింది' అని టిమ్ కుక్ వెల్లడించారు.




## ఆర్‌బీఐ రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించే అవకాశం!



**న్యూఢిల్లీ, నవంబర్ 1 (జనంసాక్షి) :** వాస్తవానికి గడచిన మానిటరీ పాలసీలో రిజర్వు బ్యాంక్ అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడ్ ని అనుకరించి వడ్డీ రేట్లను తగ్గిస్తుందని తొలుత అందరూ భావించారు. అయితే ఆ సమయంలోనే ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం తీవ్రతరం కావటంతో ద్రవ్యోల్బణం గణనీయంగా దేశంలో పెరిగింది. అయితే ఇప్పుడు అందరి చూపులో డిసెంబర్ సమావేశంపై పడింది. ఆర్థిక వృద్ధిని పెంచేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిసెంబర్‌లో కీలక పాలసీ రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించి 6.25 శాతానికి తగ్గించవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో ద్రవ్యోల్బణం ఓ మోస్తరుగా ఉంటుందని అంచనా. సెప్టెంబర్‌లో ద్రవ్యోల్బణం 5.49 శాతానికి పెరగగా.. ప్రస్తుత త్రైమాసికంలో ఇది 4.9 శాతానికి తగ్గుతుందని తెలుస్తోంది. జనవరి నుంచి మార్చి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 4.6 శాతానికి తగ్గవచ్చని నివేదిక పేర్కొంది. 2019 నుంచి వరుసగా 10 సమావేశాల్లో అత్యధిక రేట్లను చూస్తున్నాయి. రిజర్వు బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ వచ్చే త్రైమాసికంలో ద్రవ్యోల్బణం తగ్గుతుందని అంచనాలను పంచుకున్నారు. గత మానిటరీ పాలసీలో ఆర్బీఐ తన వైఖరిని తటస్థానికి మార్చుకుంది. ఇప్పుడు ఆర్థికవేత్తలు వృద్ధిలో కనిష్ట మందగమనాన్ని ఆశిస్తున్నందున రేటు తగ్గింపుకు బలమైన అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ క్రమంలో రాబోయే సమావేశంలో వడ్డీ రేట్లపై చేసిన సర్వేలో మెగారిజీ ఆర్థిక వేత్తలు రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించవచ్చని భావిస్తున్నట్లు వెల్లడించారు. భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని అంచనా. అంచనా వేసిన ద్రవ్యోల్బణం 2026 ప్రారంభంలో రిజర్వు బ్యాంక్ మోడరేట్ లక్ష్యం 4 శాతం కంటే ఎక్కువగా ఉంటుందని, దీని వలన సెంట్రల్ బ్యాంక్ రేట్లు తగ్గించడానికి చాలా తక్కువ అవకాశాన్ని ఉంచుతుందని ఆర్థికవేత్త మిగ్యుల్ చాంకో అన్నారు. ప్రస్తుతం నిర్వహించిన పోల్ ప్రకారం డిసెంబరులో రేటు తగ్గింపు తర్వాత వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఆర్బీఐ రేట్ల తగ్గింపును కొనసాగించవచ్చని తెలుస్తోంది. ఇప్పటికే అమెరికా సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్, యూరోపియన్ సెంట్రల్ బ్యాంక్ తమ రేట్లను కనీసం 50 బేసిస్ పాయింట్లను తగ్గించిన సంగతి తెలిసిందే. మానిటరీ పాలసీ రూపకర్తలు అస్థిరమైన ఆహార ధరలు, వినియోగదారుల బాస్కెట్ ఫండమెంటల్స్ ద్వారా తమ జాగ్రత్తను నొక్కిచెబుతున్నారు. కాబట్టి ద్రవ్యోల్బణం డైనమిక్స్ నియంత్రణలో ఉందని బ్యాంక్ విశ్వసించే అవకాశం ఉందని ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ ఆర్థికవేత్త అలెగ్జాండ్రా హర్మాన్ నివేదికలో పేర్కొన్నారు.




## దీపావళి తర్వాత కుప్పకూలిన గోల్డ్ ధర..

- రూ.7700 తగ్గిన పసిడి



**ముంబై, నవంబర్ 1 (జనంసాక్షి) :** రెండు వారాలుగా గోల్డ్, సిల్వర్ రేట్లు దేశంలో విపరీతంగా పెరుగుతూనే ఉన్నాయి. దీపావళితో పాటు పెళ్లిళ్ల సీజన్, కార్తీకమాసం వంటి పండుగల సమయంలో కొనుగోలుదారులకు నిరంతరాయంగా పెరిగిన గోల్డ్ ధరల నుంచి నేడు భారీ ఊరట లభించింది. దీపావళి తర్వాత రోజున గోల్డ్ ధరలు పాతాళానికి పడిపోవటంతో వేచి చూద్దాం అనుకున్న చాలా మంది పసిడి ప్రియులు నేడు తమ ఆభరణాల షాపింగ్ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. 22 క్యారెట్ల పసిడి ధర నిన్నటితో పోల్చితే 100 గ్రాములకు రూ.7000 తగ్గింపును నేడు నమోదు చేసింది. దీంతో దేశంలోని వివిధ నగరాల్లో నేడు తగ్గిన గోల్డ్ రిటైల్ విక్రయ ధరలను పరిశీలిస్తే.. గ్రాముకు చెన్నైలో రూ.7385, ముంబైలో రూ.7385, ఢిల్లీలో రూ.7400, కలకత్తాలో రూ.7385, బెంగళూరులో రూ.7385, కేరళలో రూ.7385, వడోదరలో రూ.7390, జైపూరులో రూ.7400, లక్నోలో రూ.7400, మధురైలో రూ.7385, మంగళూరులో రూ.7385, నాశిక్ లో రూ.7388, అయోధ్యలో రూ.7400, బళ్లారిలో రూ.7385, గురుగ్రాములో రూ.7400, నోయిడాలో రూ.7400గా కొనసాగుతున్నాయి.

ఇదే క్రమంలో 24 క్యారెట్ల పసిడి ధర నిన్నటితో పోల్చితే 100 గ్రాములకు ఏకంగా రూ.7700 తగ్గుదలను చూసింది. దీంతే దేశంలోని ప్రముఖ నగరాల్లో తగ్గిన నేటి రిటైల్ విక్రయ ధరలను గమనిస్తే.. గ్రాముకు చెన్నైలో రూ.8056, ముంబైలో రూ.8056, ఢిల్లీలో రూ.8071, కలకత్తాలో రూ.8056, బెంగళూరులో రూ.8056, కేరళలో రూ.8056, వడోదరలో రూ.8061, జైపూరులో రూ.8071, లక్నోలో రూ.8071, మధురైలో రూ.8056, మంగళూరులో రూ.8056, నాశిక్ లో రూ.8059, అయోధ్యలో రూ.8071, బళ్లారిలో రూ.8056, గురుగ్రాములో రూ.8071, నోయిడాలో రూ.8071 వద్ద విక్రయాలు కొనసాగుతున్నాయి. ఏపీ-తెలంగాణలోని నగరాలైన విజయవాడ, గుంటూరు, కాకినాడ, తిరుపతి, నెల్లూరు, అనంతపురం, గుంటూరు, కడప, విశాఖలో గ్రాము ధర రూ.7385గా ఉండగా.. 24 క్యారెట్ల ధర రూ.8056 వద్ద ఉంది. ఇదే క్రమంలో హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్, నిజాంబాద్, వరంగల్ నగరాల్లో 22 క్యారెట్ల పసిడి నేటి ధర రూ.7385గా ఉండగా.. 24 క్యారెట్ల ధర రూ.8056 వద్ద కొనసాగుతోంది. అలాగే తాజా వెండి ధరలను తెలుగు రాష్ట్రాల్లో రిటైల్ విక్రయ ధరను పరిశీలిస్తే.. ధర కేజీకి రూ.3000 తగ్గి నేడు రూ.1,06,000 వద్ద విక్రయాలు జరుగుతున్నాయి.




## బతికున్న వ్యక్తిని పోస్టుమార్టానికి తీసుకెళ్లిన వైద్యులు

**లక్నో, నవంబర్ 1 (జనంసాక్షి) :** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు మరణించాడనుకుని పోస్టుమార్టం పరీక్షలకు సిద్ధమయ్యారు వైద్యులు. తీరా స్ట్రెచర్‌పై శవ పరీక్షలు చేసే రూమ్‌లోకి తీసుకెళ్లగా యువకుడు బతికున్నట్లు తేలడం వల్ల అంతా ఒక్కసారిగా షాక్ గురయ్యారు. ఈ ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని మేరఠ్ మెడికల్ కాలేజీలో జరిగింది. మేరఠ్‌లోని గోట్కా గ్రామానికి చెందిన షగుణ్ శర్మ తన సోదరుడు ప్రిన్స్‌తో కలిసి బైక్‌పై ఖతౌలీ వైపు వెళ్తున్నాడు. అంతలో వేగంగా వస్తున్న వాహనం షగుణ్ శర్మ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సోదరులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డుపై వెళ్తున్న వారు అంబులెన్స్‌కు ఫోన్ చేశారు. దీంతో ఘటనాస్థలికి చేరుకుని అంబులెన్స్ క్షతగాత్రులిద్దర్ని సీహెచ్‌సీకి తరలించింది. అయితే షగుణ్ శర్మ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడం వల్ల అతడిని మేరఠ్ మెడికల్ కాలేజీకి తరలించాలని వైద్యులు సూచించారు. వైద్యుల సూచన మేరకు షగుణ్ శర్మ కుటుంబసభ్యులు అతడిని మేరఠ్ మెడికల్ కాలేజీకి తరలించారు. అక్కడ వైద్యులు షగుణ్‌కు చికిత్స అందించారు. ఆ తర్వాత షగుణ్ చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. పోస్టుమార్టం పరీక్షల కోసం షగుణ్ మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పంచనామా చేసే వైద్యుడు ఒక్కసారి షగుణ్‌ను పరీక్షించారు. అప్పుడు షగున్ ఊపిరి పీల్చుకుంటున్నట్లు ఆయన గుర్తించారు. అప్పుడు షగుణ్‌లో కదలిక వచ్చి తాను బతికే ఉన్నానని వైద్యుడితో చెప్పాడు. దీంతో ఒక్కసారి షాక్ అయిన వైద్యులు, షగున్ బతికే ఉన్నాడని మెడికల్ కాలేజీ ఉన్నతాధికారులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అలాగే షగుణ్‌ను ఎమర్జెన్సీ వార్డుకు తరలించారు. షగుణ్ బతికే ఉన్నాడని తెలియడం వల్ల ఆయన కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ ఘటన మేరఠ్ మెడికల్ కాలేజీలో కలకలం సృష్టించింది. దీంతో విచారణకు ఆదేశించారు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ ఆర్సీ గుప్తా. నిర్లక్ష్యానికి పాల్పడినవారిపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# మాది మంచి ప్రభుత్వమే.. కానీ మెతక కాదు

- ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే ఊరుకునేది లేదు
- శాంతిభద్రతల విషయంలో రాజీపడేది లేదు
- వైకాపా తీరును సహించే ప్రసక్తి లేదు
- షర్మిల రక్షణ కోరితే తప్పకుండా అండగా ఉంటాం
- ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తూ పోతాం
- ఏలూరు జిల్లాలో ఉచిత దీపం పథకం ప్రారంభించిన పవన్ కళ్యాణ్



**ఏలూరు, నవంబర్ 1 (జనంసాక్షి) :** గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు సరిగా అమలు చేయలేదు.. కుటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేసి చూపుతోందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. దీపం పథకం కింద ఏడాదికి 2,684 కోట్లు, ఐదేళ్లకు13,425 కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు. దీపం ఉచిత సిలిండర్లు కోటి ఎనిమిది లక్షల మందికి ఇవ్వబోతున్నామని పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఏలూరు జిల్లా ద్వారక తిరుమల మండలం ఐఎస్ జగన్నాధపురంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దీపం పథకం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 14 ఏళ్ల క్రితం ఐఎస్ జగన్నాధపురం ఆలయానికి వచ్చాను.. ఇక్కడ స్వయంభుగా వెలసిన లక్ష్మినరసింహ స్వామిని ఎప్పుడు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటానని చెప్పారు. లక్ష్మి నరసింహస్వామి 14 ఏళ్ల పరీక్ష పెట్టాడు.. గతంలో ఎదురైన ఓటమితో జీవితం అంధకారం అయ్యింది.. అలాంటి సమయంలో జనసైనికులతో పాటు ధైర్యం ఇచ్చింది లక్ష్మినరసింహస్వామి అని పవన్ కళ్యాణ్ అన్నారు. దీపం పథకం కేవలం వంటింట్లో వెలగడానికే కాదు.. పేదల ఆకలి తీర్చడానికి అని తెలిపారు. ఐఎస్ జగన్నాధపురం ఆలయానికి రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలన్నీ పక్కాగా అమలు చేస్తాం.. హామీలు అమలు చేయకపోతే జనసైనికుల ప్రేమ ఎంత బలంగా ఉంటుందో కోపం కూడా అంతే బలంగా ఉంటుందని చెప్పారు. పదవి వచ్చాక పదింతలు ఎక్కువగా కష్టపడే వ్యక్తిని అని అన్నారు. అభిమానులు సినిమా పేర్లు జపించడం కంటే భగవన్నామస్మరణ చేస్తే ఇంకా బాగుంటుంది.. సినిమాలో ఒక సరదా మాత్రమే.. సినిమాలు ఉండాలని అన్నారు. వైసీపీ చేసిన తప్పుడు విధానాల వల్ల వ్యవస్థ పాడయింది.. వైసీపీ ఓడి 11 సీట్లు మిగిలినా వాళ్ళ నోళ్ల మూతపడటం లేదు.. వైసీపీ నేతలకు చింత చచ్చినా పులుపు చావలేదు. వైసీపీకి 11సీట్లువచ్చినా విమర్శలు మానలేదు. మూడు నెలలుగా వైసీపీ నేతలకు నోరు ఎక్కువైంది. ఇది మంచి ప్రభుత్వమే కానీ, మెత్తని ప్రభుత్వం కాదు. మీకు యుద్ధమే కావాలనుకుంటే సిద్ధమే.. కానీ అభివృద్ధికి ఉపయోగపడే యుద్ధం కావాలి. ఆడబిడ్డలకు ఆపద కలిగించినా, చాలా తీవ్రంగా పరిగణిస్తాం. నేరాలు పెరిగాయి, శిక్షలు తగ్గాయి. పోలీసులకు డిజిటల్ క్రైమ్ యాక్టు తీసుకురాబోతున్నాం' అని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. లక్ష్మి నరసింహ స్వామి సాక్షిగా చెబుతున్న భవిష్యత్తులో వైసీపీ వాళ్ల నోటి నుంచి ఇంకేమీ రాకుండా చేస్తామని పవన్ కళ్యాణ్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వమే కానీ మెతక ప్రభుత్వం కాదని అన్నారు. వైసీపీ వాళ్ళకి యుద్ధమే కావాలంటే యుద్ధమే ఇస్తాం.. గొడవే కావాలంటే అభివృద్ధికి పాటుపడే గొడవ ఇస్తామని పేర్కొన్నారు. ఆడపిల్లల మాన, ప్రాణాలకు ఎక్కడ ఇబ్బంది కలగకుండా చూడటమే లక్ష్యమని తెలిపారు. సోషల్ మీడియాలో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని పవన్ సూచించారు. తాము ఎవరికీ అన్యాయంగా ఎదురు తిరగలేదు.. ఆడబిడ్డల గురించి, ఇంటి ఆడపడుచుల గురించి అసభ్యంగా మాట్లాడలేదని పవన్ కళ్యాణ్ అన్నారు. సనాతన ధర్మంపై పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మంపై రకరకాలుగా కొంతమంది మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ నేలపై అందరూ నివసిస్తున్నారని.. తాను అన్ని మతాలను గౌరవిస్తానని స్పష్టం చేశారు. మన సనాతన ధర్మాన్ని, హిందూ దేవాలయాలకు వెళ్లినపుడు కొన్ని విలువలు పాటించాలని సూచించారు. ఐయస్ జగన్నాధపురం లోనే మన సనాతన ధర్మం ప్రపంచానికి దిక్సూచిగా ఉండాలని దీక్ష చేపట్టానని గుర్తుచేశారు. సనాతన ధర్మం ఉంటే తప్ప.. ఈ దేశం నిలబడదని ఉద్ఘాటించారు. హైందవ ధర్మాన్ని, హిందూ ధర్మాన్ని కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పడితే, సహించేది లేదని పవన్ కళ్యాణ్ వార్నింగ్ ఇచ్చారు. సనాతన ధర్మ పరిరక్షణ విభాగాన్ని జనసేన పార్టీ తరఫున ప్రారంభిస్తున్నామని తెలిపారు. 'నారసింహ వారాహి గణం' సనాతన ధర్మ పరిరక్షణ పేరుతో ఏపీ, తెలంగాణాలో ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. ఏపీ ఇబ్బందుల్లో ఉన్నప్పుడు.. ప్రజా హక్కులను కాలరాస్తున్న సమయంలో ప్రజల వెంట కూటమి నాయకులు ఉన్నారని చెప్పారు. 'జగన్ ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు బాగా చేసి చూపిస్తున్నాం. డబ్బు దోచుకుని, దాచుకునే నేతల్లా మనం చేయడం లేదు . ఎర్ర కండువా వేసుకుని ఎదురొడ్డి నిలిస్తే ఈ ప్రభుత్వం వచ్చింది. ఈ విజయం మీది.. అన్నారు. 'ఏ పని అయినా అవుతుందో లేదో అధికారులతో చర్చించిన తర్వాత ప్రజలకు మాట ఇస్తాను. ప్రతీ ఏడాది నిరుద్యోగ యువతకు డీఎస్సీ విడుదల చేయాలని మంత్రివర్గ సమావేశంలో చర్చించామని అన్నారు.

# జార్ఖండ్‌లో పొత్తులే కీలకం

- గిరిజన రాష్ట్రంలో పట్టు కోసం పోరాటం
- కాంగ్రెస్ కూటమితో పటిష్టంగా జెఎంఎం
- మరోమారు అధికారం కోసం బిజెపి యత్నం

**రాంచీ, నవంబర్ 1 (జనంసాక్షి) :** ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న జార్ఖండ్‌లో ఇప్పుడు పాలక జెఎంఎం సహకారం లేకుండా ఏమీ చేయలేని స్థితిలోకి కాంగ్రెస్ పార్టీ వెళ్లిపోయింది. సర్ఫరాజ్ అహ్మద్, సుబోధ్ కాంత్ సహాయ్, ఫుర్కాన్ అన్సారీ, రాజేందర్ సింగ్, చంద్రశేఖర్ దూబే వంటి నాయకులతో కలకలలాడిన కాంగ్రెస్ ఇప్పుడు బలం తగ్గిఉంది. పొత్తులు ఫలించడం, సంక్షేమ పథకాలు సానుకూలించడంతోపాటు సోరెన్ అరెస్టుతో రాష్ట్రంలో వ్యక్తమైన సానుభూతి పాలక 'జెఎంఎం', 'ఇండియా' కూటమికి కలిసి వస్తోందని భావిస్తున్నారు. బిజెపికి బయపడి, పార్టీ మార్పిళ్ల నుంచి కాపాడుకోవడానికి సిఎం తమ ఎంఎల్‌ఎలను రెండు మార్లు ఛత్తీస్‌గఢ్‌లో క్యాంపుల్లో పెట్టాల్సి వచ్చింది. ఇకపోతే 2019లో చేజారిన జార్ఖండ్‌ను తిరిగి పొందడానికి బిజెపి ఆదివాసీల మనసు గెలిచే సకల యత్నాలూ చేస్తోంది. జెఎంఎం బలంపై గట్టిగా దెబ్బకొట్టాలనే పట్టుదలతో పని చేస్తోంది. చేసిన తప్పును సరిదిద్దుకుంటున్న భావన జార్ఖండ్ ప్రజల్లోకి వెళ్లేలా, బిజెపి గెలిస్తేఊ డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ది సాగుతుందని ప్రచారంలో చెబుతున్నారు. ఆదివాసీయేతర నాయకుడు రఘుబర్దాస్‌ని ముఖ్యమంత్రి చేసి ఆదివాసీల కోపానికి కారణమైనట్టు పార్టీ నాయకత్వం గ్రహించింది. అలాగే హేమంత్ సోరెన్ పై కేంద్ర దర్యాప్తు సంస్థల కేసు, అరెస్టుతో అది మరింతగా బలపడి, బిజెపి ఆదివాసీలకు వ్యతిరేకం అన్న భావన కలిగింది. అయితే ముర్మును రాష్ట్రపతిని చేయడం కొంత కలసి వస్తోంది. జార్ఖండ్‌లో ఏ కూటమినైనా.. అంతిమంగా పొత్తులే గట్టెక్కించాలి. ఏ ఒక్కరూ సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయగల ప్రజామద్దతు కూడగట్టే స్థితిలో లేరు. పొత్తుల్లో గెలిచి ప్రభుత్వాలు ఏర్పరచడం, విడిగా పోటీ చేసినపుడు ఓడి విపక్షంలో కూర్చోవడం.. ఈ అనుభవం ఇటు బిజెపి, అటు జెఎంఎం ఇద్దరికీ ఉంది. అందుకే పొత్తుల్ని ఖరారు చేసుకొని కూటమిగానే బరిలో దిగుతున్నారు. 81 స్థానాలున్న రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన మ్యాజిక్ నంబర్ 41. పార్టీల మధ్య పొత్తుతో పాటు సామాజిక సమీకరణాలపైన దృష్టిపెట్టి, గెలుపే లక్ష్యం చేసుకుంటున్నారు. 2014లో విడిగా పోటీచేసి 25స్థానాలు గెలిచిన జెఎంఎం, కాంగ్రెస్‌లు 2019 ఎన్నికల్లో కలిసి పోటీచేసి 47 స్థానాలు గెలిచి, ప్రభుత్వం ఏర్పరిచారు. 2014లో ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఎజెఎస్‌యు)తో పొత్తు పెట్టుకొని 42 సీట్లు నెగ్గిన బిజెపి, 2019లో పొత్తులు బెడిసి 25 సీట్లకు పరిమితమైంది. ప్రభుత్వం పోయింది. 16శాతం జనాభాగా ఉన్న కుర్మీ మహతోల్లో పట్టున్న ఎజెఎస్‌యు కనీసం 14 అసెంబ్లీ సీట్లలో ప్రభావం చూపుతుంది. రాష్ట్రంలోని 7 జిల్లాలు, 20 సీట్లలో ప్రభావం గల ముస్లింలు సుమారు 15 శాతంగా ఉన్నారు. ఒబిసి జనాభా 46శాతం ఉంది. అందుకే, బిజెపి(68), ఎజెఎస్‌యు(10), జెడి(యు)(2), ఎల్‌జెపి(1) కలిసి పోటీ చేయాలని సయోధ్యతో ఉన్నాయి. 'ఇండియా' కూటమిలోనూ సీట్ల పంపకాలు జరిగినా.. మూడు స్థానాల్లో మిత్రపక్షాల అభ్యర్థులే పరస్పరం పోటీలో ఉండే పరిస్థితి తలెత్తింది. జెఎంఎం (43), కాంగ్రెస్ (30), రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి)(5), సిపిఐ-ఎంఎల్ (3) పార్టీలు కలిసి మొత్తం 81 స్థానాల్లో పోటీ చేయాలనుకున్నారు. కానీ, కాంగ్రెస్‌కు కేటాయించిన రెండు సీట్లలో ఆర్‌జెడి, సిపిఐ-ఎంఎల్‌కు కేటాయించిన ఒక చోట కాంగ్రెస్.. పొత్తులకు విరుద్ధంగా పోటీలో దిగుతున్నాయి. ఇన్ని సంక్లిష్టతల మధ్య జార్ఖండ్ గెలుపు ఎవరిని వరించనున్నదో నవంబరు 23 న తేలనుంది.

# ఎల్‌ఏసీ వద్ద స్వీట్లు పంచుకున్న సైనికులు



**న్యూఢిల్లీ, నవంబర్ 1 (జనంసాక్షి) :** దీపావళి సందర్భంగా వాస్తవాధీన రేఖ (ఎల్‌ఏసీ) వెంబడి పలు సరిహద్దు పాయింట్ల వద్ద భారత, చైనా సైనికులు స్వీట్లు పంచుకున్నారు. తూర్పు లద్దాఖ్‌లోని దెప్సాంగ్, దేమ్‌చుక్ ప్రాంతాల నుంచి సైన్యాల ఉపసంహరణ ప్రక్రియ కొలిక్కి రావడం వల్ల గురువారం ఉదయం మిఠాయిలు అందించుకున్నారు. ఈ విషయాన్ని ఆర్మీ వర్గాలు తెలిపాయి. "దీపావళి సందర్భంగా ఎల్‌ఏసీ వెంబడి అనేక సరిహద్దు పాయింట్ల వద్ద భారత్, చైనా సైనికులు స్వీట్లను ఇచ్చిపుచ్చుకున్నారు. అక్టోబర్ 25న మొదలైన బలగాల ఉపసంహరణ ప్రక్రియ బుధవారంతో పూర్తయ్యింది. పెట్రోలింగ్ విధి విధానాలను ఖరారు చేసేందుకు క్షేత్రస్థాయిలో స్థానిక కమాండర్ల మధ్య చర్చలు కొనసాగుతున్నాయి. వారే పెట్రోలింగ్ పద్ధతులను నిర్ణయిస్తారు" అని ఆర్మీ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, వాస్తవాధీన రేఖ వెంబడి భారత్-చైనా బలగాల ఉపసంహరణ పూర్తయిందని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. ఇంతకు మించిన పురోగతిని భారత్ కోరుకుంటోందని, అందుకు కొంత సమయం పట్టొచ్చని చెప్పారు. వాస్తవాధీన రేఖ వెంబడి కొన్ని ప్రాంతాల్లో ఉన్న వివాదాలను పరిష్కరించుకునేందుకు ఇరు దేశాలు దౌత్య, సైనిక స్థాయిలో చర్చలు జరిపాయని వెల్లడించారు. చాలా విషయాల్లో ఇరు దేశాలు ఏకాభిప్రాయానికి వచ్చాయని తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని తవాంగ్‌లో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 2020 జూన్‌లో గల్వాన్ లోయలో ఇరుదేశాల సైన్యాల మధ్య జరిగిన హింసాత్మక ఘర్షణ నేపథ్యంలో భారత్-చైనా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. అప్పటి నుంచి రెండు దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆ తర్వాత ప్రతిష్టంభనను తొలగించేందుకు ఇరు దేశాల మధ్య పలుమార్లు దౌత్య, కమాండర్ స్థాయి చర్చలు జరిగాయి.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
02.11.2024

## సంక్షిప్తంగా..



### మంత్రి తుమ్మలను కలిసిన ఎమ్మెల్యే తోట

**జుక్కల్ ప్రతినిధి నవంబర్ 1 (జనం సాక్షి)** కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు మంత్రి తుమ్మల నాగేశ్వర రావుని శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా రైతులకు డ్రిప్, స్ప్రింక్లర్స్ పై సబ్సిడీ ఇవ్వాలని మంత్రిని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా వరి మరియు సోయా కొనుగోలు త్వరితగతిన పూర్తి చేయాలని, సోయా ఎకరానికి 8 క్వింటాళ్లు కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకారానికి తప్పకుండా హాజరు కావాలని కోరారు. ఆయనతో పాటు పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ మనోజ్ కుమార్ ఉన్నారు.

### హమాలి కూలీల డబ్బులు ప్రభుత్వమే చెల్లించాలి



**నాగిరెడ్డిపేట్ (జనంసాక్షి):**వరి ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం వెంటనే ప్రారంభించాలని కోరుతూ శుక్రవారం మండల భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో ప్రధాన రహదారి వెంబడి మండల నాయకులు ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీగా తరలి వెళ్లి తహశీల్దార్ శ్రీనివాస్కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మండల భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు మాట్లాడుతూ వరి పంటలు కోసి నెలరోజులైనా కానీ ఎక్కడ కొనుగోళ్లు ప్రారంభించడం లేదని,కొనుగోలు కేంద్రాల లోని రైతులకు సరిపడా తాటిపత్రిలు అందించాలన్నారు.ప్రతి పంటకు ప్రతి క్వింటాలకు 5 వందల రూపాయల బోనస్ ఇవ్వాలని,వడ్ల బస్తా 40 కిలోలకి 650 గ్రాములు మాత్రమే తరువు తీసి కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతులకు డబ్బులు ఖాతాల్లో వేయాలని, హమాలి డబ్బులు ప్రభుత్వమే చెల్లించాలని రైతులపై వేయకూడదని వినతి పత్రంలో కోరారు. భారతీయ కిసాన్ సంగ్ మండల అధ్యక్షుడు కాంతారెడ్డి,సభ్యులు,నాయకులు పాల్గొన్నారు.

### రిజర్వేషన్లపై బహిరంగ విచారణ



**కరీంనగర్ ప్రతినిధి, నవంబర్ 01 (జనంసాక్షి):**స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ ధమాషాను ఖరారు చేసే అంశం పై కరీంన గర్ జిల్లా కేంద్రం లోని కలెక్టరేట్ ఆడిటోరి యంలో శుక్రవారం బీసీ కమిషన్ సమావేశం నిర్వహించి బీ సీ కమిషన్ కి బీ ఆర్ ఎస్ పార్టీ తరుపున వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గంగుల,కౌశిక్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, మేయర్ సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపారాణి, మున్సిపల్ చైర్మన్‌లు రుద్రరాజు , రాజేశ్వర్ రావు, బీ ఆర్ ఎస్ పార్టీ నగర అధ్యక్షులు చల్లా హరిశంకర్ , మాజీ రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ సింగ్ , మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, కార్పొరేటర్ లు బీ ఆర్ ఎస్ పార్టీ వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.



# అద్దకంకు ఆదరణేది?

**సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో అద్దకం పరిశ్రమలకు ప్రత్యేక స్థానం ఉంది. కాటన్ పరిశ్రమకు అనుబంధంగా ఎదుగుదలలో విడదీయలేని బంధం ఉన్నది. దశాబ్దాల పాటు సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో ఎందరికో ఉపాధి కల్పించిన అద్దకం పరిశ్రమ నేడు ఆసరా కోల్పోయి మనుగడ కోసం తపిస్తోంది.సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని అద్దకం యూనిట్లు పడుతున్న అష్ట కష్టాలపై 'జనంసాక్షి'అందిస్తున్న ప్రత్యేక కథనం...**

- కష్టాల కడలిలో పరిశ్రమ
- ఆదుకోవాలని వేడుకోలు
- 120 యూనిట్ల నుంచి 30 యూనిట్లకు తగ్గిన దైన్యం
- పదేళ్లుగా పట్టని ప్రభుత్వం
- మనుగడ కోసం ఎదురీత..

**రాజన్న సిరిసిల్ల బ్యూరో (జనంసాక్షి):**

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సాంకేతికంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా తనను తాను మలుచుకుంటూ వచ్చింది. ఒకనాడు కుటీర పరిశ్రమగా మొదలైన చేనేత మగ్గాల స్థానంలో మరమగ్గాలు వచ్చాయి. వాటికి అనుబంధంగా సైజింగ్, అద్దకం పరిశ్రమలు వచ్చాయి. గత మూడున్నర దశాబ్దాల కాలంగా సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఎదుగుదలలో చెరగని ముద్ర వేసింది అద్దకం పరిశ్రమ. స్వయం శక్తితో ఎదుగుతున్న వస్త్ర పరిశ్రమలో రాష్ట్రాల హద్దులను దాటుకొని ఇతర రాష్ట్రాలకు మార్కెట్ వెతుక్కుంటూ పోయింది. అనూహ్యంగా 1990 అనంతర కాలంలో పాలిస్టర్ రావడంతో క్రమక్రమంగా కాటన్ పరిశ్రమ అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నది. ఆ ప్రభావం అద్దకం యూనిట్లపై తీవ్రంగా పడింది. 200 పైగా అద్దకం యూనిట్లతో పరిశ్రమ ఎంతోమందికి ఉపాధిని కల్పించి. ప్రధానంగా పరిసర గ్రామాలతో పాటు ఇతర జిల్లాల నుండి కూడా గ్రామీణ యువతరం అద్దకం యూనిట్లలో ఉపాధి పొందిన పరిస్థితి ఉంది.ప్రధానంగా పెట్టి కోట్స్ కోసం వినియోగించే కేస్మిట్ క్లాత్ కు ప్రత్యేక కేంద్రంగా సిరిసిల్ల ప్రాధాన్యత సంతరించుకుంది. అద్దకం పరిశ్రమకు అనుబంధంగా పెట్టికోట్స్ తయారీ రంగం అభివృద్ధి కావడంతో అనేకమంది మహిళలకు ప్రత్యామ్నాయ ఉపాధి లభించింది. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తనను తాను మలుచుకుని క్రమంలో అద్దకం పరిశ్రమ అష్ట కష్టాలు పడింది. గడిచిన 10 సంవత్సరాల కాలంలో ప్రభుత్వాల పట్టింపు లేకపోవడంతో బల్బోత్రా లాంటి ప్రాంతం నుంచి పాప్లిన్ క్లాత్ రావడంతో అధకం పరిశ్రమ అస్తవ్యస్తంగా మారింది. సొంతంగా అద్దకం చేస్తున్న 20 యూనిట్ల, జాబ్ వర్క్ పై అద్దకం చేస్తున్న 23 యూనిట్లకే అర్ధకం పరిశ్రమ పరిమితమైంది. దీనికి తోడు గత మూడు సంవత్సరాల క్రితం అద్దకం యూనిట్లకు ఇస్తున్న విద్యుత్ పై



నాలుగవ కేటగిరి నుండి మూడవ కేటగిరీలోకి మార్చడం తీవ్ర ప్రభావం చూపింది. మిగిలిన యూనిట్ల పరిస్థితి కూడా మరిన్ని కష్టాల ఊబిలో కూరుకుపోయింది.ఉనికి కోసం తండ్లాడుతునే ఉంది. గత ప్రభుత్వం అద్దకం యూనిట్లకు జియో ట్యాగింగ్ పేరుతో హడావుడి చేసిన ఆదుకునే ప్రయత్నం మాత్రం చేయలేదని ఓ అద్దకం యూనిట్ నిర్వాకుడు తెలిపారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో కొనసాగుతున్న విద్యుత్ సబ్సిడీ మొదట్లో అద్దకం యూనిట్లకు కూడా వర్తించేది. గత ప్రభుత్వం లో కొన్ని యూనిట్లకు సంబంధించి కిటగిరి మార్పు వల్ల అట్లా కొన్ని అద్దకం యూనిట్లు మూతసివేత కు చేరుకున్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని ప్రకటించిన క్రమంలో అద్దక యూనిట్ల నిర్వాహకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

#### అభివృద్ధి ప్రణాళికలో అద్దకం యూనిట్లకు అవకాశం కల్పించాలి



*ప్రభుత్వం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలు సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించడం అభినందనీయం. అభివృద్ధిలో అద్దకం పరిశ్రమలను భాగస్వాములను చేయాలి. గతంలో విద్యుత్‌చార్జీల విషయంలో కేటగిరి మార్చడం జరిగింది. అద్దకం యూనిట్ల నిర్వాహకులపై తీవ్ర ప్రభావం ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అద్దకం యూనిట్ల నిర్వాహకులకు స్పష్టత ఇవ్వాలి.సబ్సిడీ పరిధిలోకి అద్దకం పరిశ్రమ కూడా చేర్చాలి. పరోక్షంగా ఎంతో మందికి ఉపాధి కల్పిస్తున్న అద్దకం యూనిట్ల కాపాడాల్సిందిగా ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాం. అద్దకం యూనిట్ల మనుగడ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.*

***– బికోడం ఆనంద్ బాబు, డైయింగ్ ఫినిషింగ్ జాబ్ వర్కర్స్ సంక్షేమ సంఘం అధ్యక్షులు***

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

**పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి.**



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 01 (జనంసాక్షి) :** కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ చర్యల దృష్ట్యా నియమ నిబంధనలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సంబంధిత ఏసీపీ ల నుంచి అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులను నిర్వహించకూడదని తెలిపారు. అనుమతులు లేకుండా ఎటువంటి సభలు సమావేశాలు, ర్యాలీలు నిర్వహించకూడదని సంబంధిత అధికారుల నుండి అనుమతులు తప్పనిసరి అని తెలిపారు అనుమతుల కోసం దరఖాస్తు చేయడం ద్వారా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అట్టి కార్యక్రమానికి తగిన విధంగా పోలీసు శాఖ భద్రతాపరమైన చర్యలు చేపడుతుందన్నారు. ఈ చట్టం అమలులో వుండగా ఇతరులను గాయపరిచే విధంగా ఉండే వస్తువులు, మారణాయుధాలను ధరించి సంచరించకూడదు. రోడ్లు, ప్రజలకు ఉపయోగపడే ఇతర స్థలాల్లో జనాన్ని సమీకరించకూడదు. జన సంచారం, అనుమతి పత్రాలలో పేర్కొన్నబడిన ప్రాంతాలలో మ్యూజిక్ లు, పాటలు, ప్రసంగాలు, రణగొణ ధ్వనులు చేయవద్దని కోరారు. ఈ ఉత్తర్వులు ఈనెల 30 వరకు అమల్లో ఉంటాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై హైదరాబాద్ నగర పోలీస్ చట్టం, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ తెలిపారు.

## ఆటో డ్రైవర్ కూతురికి ఎంబీబీఎస్ సీటు

**శుభాకాంక్షలు తెలిపిన కేంద్రమంత్రి బండి సంజయ్**

**కరీంనగర్ ప్రతినిధి, నవంబర్ 01 (జనంసాక్షి):** ఆటో డ్రైవర్, కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం కోశాధికారి కొడముంజ తిరుపతి కుమార్తె కొడముంజ మానస్విక ఇటీవల వెలువడిన నీట్ ఫలితాలలో విజయం సాధించి జగిత్యాల జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల లో సీటు సాధించింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ను మర్యాద పూర్వకంగా విద్యార్థి, తల్లిదండ్రులు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భవిష్యత్తు లో చదువుకొనేందుకు అండగా ఉంటానని చెప్పారు. అలాగే చొప్పదండి మాజీ ఎం ఎల్ ఏ బొడిగే శోభక్క శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘం నాయకులు పోతు చంద్రశేఖర్, బోటుక ఐలేష్, ఈరవేని కుమార్ తదితరుల పాల్గొన్నారు.



# పకడ్బందీగా ఇంటింటా సర్వే

**కలెక్టర్ సందీప్ కుమార్ ఝా..**
**పలు మండలాల్లో ఆకస్మికంగా తనిఖీ..**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి వేములవాడ(జనంసాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఇంటింటా సర్వే పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు.సామాజిక,ఆర్థిక,విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వే(సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ప్రారంభమైంది.వేములవాడ అర్బన్ మండలంలోని మారుపాక గ్రామంలో, రూరల్ మండలంలోని అచ్చనపల్లె గ్రామంలో,బోయినపల్లి మండల కేంద్రములో సర్వేను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్యుమరేటర్ బ్లాక్ లోని ఐదు ఇండ్లను అయన స్వయంగా పరిశీలించారు. సర్వే కొనసాగుతున్న విధానంపై అధికారాలను ఆరా



తీశారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక,విద్య,ఉపాధి,రాజకీయ మరియు కుల సర్వే(సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే)లో భాగంగా శుక్రవారం ఆదివారం వరకు ఇంటింటా ఎవరెవరు ఉంటున్నారని లిస్టును సేకరిస్తారన్నారు.అయన వెంట వేములవాడ రూరల్, అర్బన్ ఎంపీడీవోలు జయశీల, రాజీవ్ మల్హోత్రా, బోయిన్పల్లి ఎంపీఓ శ్రీధర్, ఎన్యూమరెటర్లు పాల్గొన్నారు.

# స్థానికంలో బీజేపీ పాగా వేయాలి

- **వార్డు సభ్యుని నుండి జడ్పీ చైర్మెన్ వరకు అన్ని స్థానాలు బీజేపీ కైవసం చేసుకోవాలి**
- **ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి**

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనంసాక్షి):** వార్డు సభ్యుని నుండి జడ్పీ చైర్మన్ వరకు అన్ని స్థానాలు బిజెపి కైవసం చేసుకోవాలని, కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమ ణారెడ్డి అన్నారు.ప్రజల మధ్యలో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ,మండలానికి 100 మంది క్రియాశీల సభ్యులుగా చేరాలని, కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా కామారెడ్డి నియోజకవర్గ పరిధిలోని మాచారెడ్డి మండల బీజేపీ కార్యవర్గ సమావేశం మండల కేంద్రంలో నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలో వార్డు సభ్యుని నుండి జెడ్పి ఛైర్మెన్ వరకు అన్ని స్థానాలు బీజేపీ కైవసం చేసుకోవాలనీ అన్నారు. ప్రతి



బీజేపీ కార్యకర్త ప్రజల మధ్యలో ఉండి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలనీ అన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ముగియనుందని క్రియాశీల సభ్యత్వం కోసం ప్రతి బీజేపీ నాయకుడు 100 సభ్యత్వాలు చేసి క్రియాశీల సభ్యత్వము తీసుకోవాలని అన్నారు. మండలానికి 100 మంది క్రియాశీల సభ్యులుగా చేర్చాలనీ అన్నారు.కార్యక్రమం అనంతరం మండలానికి సంబంధించి 100 ప్రాథమిక సభ్యత్వాలు పూర్తి చేసిన 24 మందికి కాటిపల్లి వెంకట రమణ రెడ్డి క్రియాశీల సభ్యత్వం అందజేయటం జరిగింది.

## భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తా

ఎండగట్టడంతోపాటు, పార్టీలను బలోపేతం చేసేందుకు పార్టీ అధ్యక్షులు పాదయాత్రలు చేస్తున్నారు, మీరెప్పుడు చేస్తారని అడిగారు. దీనికి స్పందించిన కేటీఅర్ ఖచ్చితంగా తన పాదయాత్ర ఉంటుందని వెల్లడించారు. దాదాపు గంటన్నపాటు సాగిన ఈ సంభాషణలో కేటీఆర్ అనేక అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. కాంగ్రెస్ పాలన తెలంగాణకు ఒక శాపంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే ఉద్దేశం ఏమాత్రం లేదు. అందుకే అబద్దాలు, అసత్యాల మీద సమయం గడుపుతూ ప్రజలను మోసం చేస్తున్నది. గత పది నెలల కాలంలో కాంగ్రెస్ పార్టీ చేసిన ఒక్క మంచి కూడా గుర్తుకు రావడం లేదు. అబద్ధపు హామీల మీద ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ నుంచి ఇంతకంటే గొప్ప పరిపాలన ఆశించలేం. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రాజకీయ వేధింపులను ప్రారంభించింది. అయితే వీటికి భయపడేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. సన్నవడ్లకు కూడా బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ హామీ బోగస్‌గా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ఓట్లు వేసి మద్దతు ధర లేక రైతుబంధు లేక నష్టపోతున్న రైతన్నల తరపున పోరాడుతామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పాలన ఫ్రమ్ ఢిల్లీ, టూ ఢిల్లీ, ఫర్ ఢీల్లీ అన్నట్లుగా తయారైందని ఎద్దేవా చేశారు. నాలుగేండ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారం పోవడం ఖాయమని కేటీఆర్ అన్నారు. అయితే కొత్త ప్రభుత్వానికి ప్రస్తుత సర్కార్ చేసిన నష్టం నుంచి తెరుకొని ముందుకు తీసుకుపోవడం అతిపెద్ద సవాలుగా మారుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక ప్రగతి పూర్తిగా పతనమైందని చెప్పారు. అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రం వెనక్కి పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆదాయ వనరులు నుంచి మొదలు వ్యవసాయ రంగం, అన్ని రంగాలు తిరోగమనంలో ఉన్నాయన్నారు. నిరుద్యోగిత పెరిగిందన్నారు. తెలంగాణ నుంచి అనేక కంపెనీలు వెనక్కి వెళ్లిపోతున్నాయని చెప్పారు. ఈ అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ప్రణాళికలు ఉన్నాయో ఎవరికీ తెలియడం లేదన్నారు. కాంగ్రెస్ పాలన వలన జరుగుతున్న నష్టాన్ని పూడ్చుకోవడం అప్పుడప్పుడే సాధ్యం కాదు అన్నారు.

## ముస్లిం మైనార్టీల 4% శాతం ప్రాతినిధ్యాన్ని అమలు చేయాలి

**బీసీ కమిషన్ చైర్మన్‌కు జిల్లా కాంగ్రెస్ కమిటీ మైనార్టీ చైర్మన్ తాజోద్దీన్ వినతి**

కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 01 (జనంసాక్షి) :శుక్రవారం కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బీసీ కమిషన్ ఛైర్మన్, సభ్యులు తెలంగాణ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల సామాజిక ఆర్థిక విద్య రాజకీయ కోణాలకు అధ్యాయనం, సమస్యల పరిష్కారం కోసం వారి యొక్క స్థితులను పరిశీలించడానికి వివిధ రాజకీయ పార్టీల నుండి కుల సంఘాల నుండి స్వచ్ఛంద సంస్థల నుండి స్వచ్ఛంద కార్యకర్తల నుండి వినతి పత్రాలు స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగం ద్వారా మైనార్టీ జిల్లా చైర్మన్ ముహమ్మద్ తాజుద్దీన్ ఆధ్వర్యంలో ముస్లిం మైనార్టీ కు సంబంధించిన సమస్యల పైన విన్నపము సమర్పించడం జరిగింది. ఈ విన్నపంలో ముస్లిం మైనార్టీల యొక్క జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ పెంచాలని అదేవిధంగా ప్రభుత్వం నుండి జారీ చేయబడుతున్న వివిధ సంక్షేమ పథకాలలో , ప్రభుత్వ అన్ని



విభాగాలలో బీసీఈ సంబంధించిన 4% శాతం ప్రాతినిత్యాన్ని అమలు చేయాలని, అదేవిధంగా ముస్లిం మైనార్టీల పైన వ్యక్తిగతంగా గుంపులు గుంపులుగా చేరి జరుగుతున్న దాడులను పరిగణలోకి తీసుకొని ముస్లిం మైనార్టీల రక్షణ కొరకు ముస్లిం అట్రాసిటీ చట్టాన్ని రూపొందించాలని, అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తులను రక్షిస్తూ ఇప్పటివరకు అన్యక్రాంతానికి గురైన ఆస్తులను తిరిగి ప్రభుత్వ స్వాధీనం చేసుకొని వక్ఫ్ బోర్డ్ కు అప్పగించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ విభాగం చైర్మన్ మహమ్మద్ తాజుద్దీన్, టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రెటరీ అబ్దుల్ సమద్నవాబ్, ఉపాధ్యక్షులు మొహమ్మద్ కలీమ్, జిల్లా అధికారిక ప్రతినిధి ముహమ్మద్ అబ్దుల్ జమీల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నిహాల్ అహ్మద్, మహమ్మద్ హనీఫ్, మహమ్మద్ ఫెరోస్ తదితరులు పాల్గొన్నారు.



### విద్యార్థిని తీర్చదిద్దవలసిన భాధ్యత ఉపాధ్యాయులదే

**ఆర్‌జీ-1 సెక్టర్-1 పాఠశాలను సందర్శించిన సొసైటీ సెక్రెటరీ శ్రీనివాస్..**

**గోదావరిఖని, జనంసాక్షి:** సింగరేణి ఆర్‌జీ-1 సెక్టార్-1 సింగరేణి హై స్కూల్‌ను కార్పొరేట్ ఎడ్యుకేషన్ సొసైటి సెక్రటరి గుండా శ్రీనివాస్ సందర్శించారు.ఎడ్యుకేషన్ సొసైటి సెక్రటరి గుండా శ్రీనివాస్ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాలలో చదువుచున్న విద్యార్థుల హాజరు శాతం తెలుసుకొని ప్రతి ఒక్క విద్యార్థిని తీర్చదిద్దవలసిన భాధ్యత ఉపాధ్యాయులపైననే ఉంటుందని వారిని ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేపించే బాధ్యత ఉంటుందన్నారు.అలాగే ప్రతి విద్యార్థి గురువుల మాట తూచా తప్పకుండా పాటించాలన్నారు.అంకిత భావంలో కష్టపడి చదివి, మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసు, పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు, ఉపాధ్యాయులు స్వర్ణలత, కుమారస్వామి, శశికళ, పూర్ణచందర్, శ్రీనివాసు, శ్రీలత, సుజాత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



### విశ్రాంత ఉద్యోగుల విధిగా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి

**గోదావరిఖని, జనంసాక్షి:**సింగరేణి విశ్రాంత ఉద్యోగులు, అధికారులు వారి పెన్షన్, కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్యం పొందాలంటే వారు ప్రతి సంవత్సరం నవంబర్ మాసంలో జీవన్ ప్రమాణ లైఫ్ సర్టిఫికెట్ తో పాటు, సీపీఆర్ ఎం ఎస్ మెడికల్ లైఫ్ సర్టిఫికెట్స్ పెన్షన్ కొరకు సీఎంపిఎఫ్ సంస్థ,మెడికల్ రెన్యువల్ వరకు మీ సేవ, ఇంటర్నెట్ కేంద్రాల నుంచి బయోమెట్రిక్ వేలి ముద్రల మెషిన్ ద్వారా సమర్పించాలన్నారు.మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా పోచారం మున్సిపాలిటీ సుప్రభాత్ టౌన్ షిప్ లో నివసిస్తున్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ ఆధ్వర్యంలో జీవన్ ప్రమాణ లైఫ్ సర్టిఫికెట్ లను మొబైల్ ఆప్ ద్వారా సమర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రాజా నర్సు, సత్యనారాయణ, కొట్టే సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ, ప్రతాప్ సింగ్, వెంకట్ రెడ్డి, సర్జిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం కుటుంబానికి దీపావళి శుభాకాంక్షలు

**మర్యాదపూర్వకంగా కుటుంబంతో కలిసిన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్**





**గోదావరిఖని, జనంసాక్షి:** పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు.. రామగుండం శాసనసభ్యులు రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్- మనాలిఠాకూర్ కుటుంబం దీపావళి పర్వదినం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.హైదరాబాదులోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.అనంతరం పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి పండుగను రాష్ట్ర ప్రజలు కన్నుల పండుగగా జరుపుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అంతేకాకుండా రామగుండం నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి ఫలాలు అందే విధంగా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు.రామగుండం ప్రాంతానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు పూర్తి స్థాయిలో సీఎం సహకరించాలని కోరినట్లు తెలిపారు. భవిష్యత్తులో విద్యుత్ పరిశ్రమ ఏర్పాటుతో స్థానికంగా పారిశ్రామిక అభివృద్ధితో పాటు యువతకు ఉపాధి కలిగే అవకాశం ఉంటుందని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ప్లాంటుకు సంబంధించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు.అదే విధంగా మంత్రి శ్రీధర్‌బాబు కుటుంబ సభ్యులను మక్కాన్‌సింగ్ దంపతులు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

## కమ్మేసిన కాలుష్యం

విషపూరితంగా తయారైంది. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ప్రకారం ఢిల్లీలోని ఆనంద్ విహార్‌లో నవంబర్ 1న ఉదయం 6 గంటలకు గాలి నాణ్యత 395గా ఉండటం విశేషం. ఆనంద్ విహార్, సరితా విహార్‌లలో అత్యధికంగా నమోదైంది. అలీపూర్‌లో సగటు గాలి నాణ్యత 318, అశోక్ విహార్‌లో 359, అయా నగర్‌లో 324, బవానాలో 366, టెర్మినల్ 3లో 339, పురంలో 382, ద్వారక, 371లో, నార్త్ క్యాంపస్ 340, పంజాబీ బాగ్‌లో 380 స్థాయిలో నమోదైంది. ఈ క్రమంలోనే అక్కడి ప్రాంతాల ప్రజలు కళ్ల మంట సమస్యను ఎదుర్కొన్నారు.



## దుబాయ్‌లో సానియా-షోయబ్

భారత టెన్నిస్ దిగ్గజం సానియా మీర్జా నిత్యం వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. ఆటకు గుడ్‌బై చెప్పినా ఏదో ఒక విధంగా ఆమె పేరు న్యూస్‌లో నానుతూనే ఉంటుంది. పాకిస్థాన్ క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ షోయబ్ మాలిక్‌తో విడాకుల వ్యవహారంతో ఆ మధ్య వైరల్‌గా మారింది సానియా. డివోర్స్ వల్ల కాస్త డిస్ట్రబ్ అయిన ఆమె ఇప్పుడు ఫ్యామిలీతో ఎక్కువ సమయం గడుపుతోంది. అలాంటిది చాన్నాళ్ల తర్వాత సానియా-షోయబ్ దుబాయ్‌లో దర్శనమివ్వడం ఆసక్తికరంగా మారింది. విడాకుల తర్వాత మళ్లీ కలవడం ఇదే ఫస్ట్ టైమ్ కావడంతో అంతా దీని గురించే మాట్లాడుకుంటున్నారు. సానియా కుమారుడు ఇజహాన్ ఆరో పడిలోకి అడుగుపెట్టాడు. తాను అల్లారుముద్దుగా చూసుకుంటున్న కొడుకు పుట్టిన రోజును టెన్నిస్ లెజెండ్ గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసింది. ఆ తర్వాత బర్త్‌డే ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. 'చిన్నారి బాబు.. నీకు ఆరేళ్లు అంటే నమ్మలేకపోతున్నా. నా నవ్వుకు నువ్వే కారణం. హ్యాపీ బర్త్‌డే లడ్డూ' అని సానియా ఇన్‌స్టా పోస్ట్‌లో రాసుకొచ్చింది. సానియాతో పాటు షోయబ్ మాలిక్ కూడా కొడుకు ఇజహాన్ పుట్టిన రోజును దుబాయ్‌లో ఘనంగా సెలబ్రేట్ చేశాడు. కుమారుడితో కలసి కేక్ కట్ చేసిన వీడియోను పాక్ క్రికెటర్ అభిమానులతో పంచుకున్నాడు. సానియా-షోయబ్ దుబాయ్‌లోనే ఉన్నా ఇజహాన్ బర్త్‌డేను వేర్వేరుగా సెలబ్రేట్ చేసుకోవడం గమనార్హం.



# పట్టుబిగేంచేనా?

### వాంఖడేలో ఆఖరి అరగంటలో టీమిండియా ఆగమాగం..

**మరోసారి నిరాశ పరిచిన రోహిత్, కోహ్లి.. తొలిరోజు స్కోరు 86/4**

న్యూజిలాండ్ మూడు టెస్టుల సిరీస్‌లో భాగంగా జరుగుతున్న చివరి మ్యాచ్‌లోనూ భారత్ ఇబ్బంది పడుతోంది. తొలి రెండు మ్యాచుల్లో పరాజయం పాలైన టీమ్ ఇండియా.. చివరి మ్యాచ్‌లోనూ బ్యాటింగ్‌లో అదే పేలవమైన ఆటతీరును కొనసాగిస్తోంది. తొలి ఇన్నింగ్స్ ప్రత్యర్థిని 235 పరుగులకే కుప్పకూల్చిన భారత్ జట్టు.. మొదటి రోజు ఆటముగిసే సమయానికి 4 వికెట్లు కోల్పోయి 86 పరుగులు సాధించింది. ఇంకా 149 పరుగులు వెనకబడి ఉంది. కెప్టెన్ రోహిత్ శర్మ (18), విరాట్ కోహ్లి (4) మరోసారి నిరాశ పరిచారు. జైస్వాల్ (30) పెద్దగా రాణించలేదు. మహ్మద్ సిరాజ్ (0) ఎల్బీగా వెనుదిరిగాడు. శుభ్మన్ గిల్ (31), రిషబ్ పంత్ (1) క్రీజులో ఉన్నారు. న్యూజిలాండ్ బౌలర్లలో అజాజ్ పటేల్ రెండు వికెట్లు తీయగా, హెన్రీ ఒక వికెట్ పడగొట్టాడు.

తిప్పేసిన భారత్ స్పిన్నర్లు :

తొలుత బ్యాటింగుకు దిగిన న్యూజిలాండ్‌ను భారత్ స్పిన్నర్లు కట్టడి చేశారు. కీలక సమయాల్లో వికెట్లు పడగొడుతూ ప్రత్యర్థి ఆత్మవిస్వాసాన్ని దెబ్బతీశారు. ఓపెనర్లు లాథమ్ (28), కాన్వే (4) తక్కువ పరుగులకే ఔటవ్వడంతో బ్యాటర్లపై ఒత్తిడి పెరిగింది. తొలి డౌన్లో వచ్చిన విల్ యంగ్ (71), మిడిలార్డర్లో వచ్చిన మిచెల్ (81) క్రీజులో నిలదొక్కుకొని ఆడారు. ఫిలిప్స్ (17) మినహా మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. రవీంద్ర జడేజా (5), వాషింగ్టన్ సుందర్ (4) పోటాపోటీగా వికెట్లు పడగొట్టారు. లాథమ్, మిచెల్, అజజ్ పటేల్, రచిన్ రవీంద్ర వికెట్లను వాషింగ్టన్ సుందర్ చేజిక్కించుకోగా.. యంగ్, బ్లండెల్, ఫిలిప్స్, హెన్రీ, సోధి వికెట్లను జడేజా తన ఖాతాలో వేసుకున్నాడు.

జడేజా రికార్డు :

ఈ మ్యాచ్ లో ఐదు వికెట్లు తీసిన జడేజా మరో ఘనత సాధించాడు. మొత్తం 314 వికెట్లు తీసి.. భారత టెస్టు క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన ఐదో ఆటగాడిగా నిలిచాడు. ఈ జాబితాలో ఇషాంత్ శర్మ (311), జహీర్ ఖాన్ (311)లను దాటేసి ఐదో స్థానానికి దూసుకెళ్లాడు. భారత టెస్టు క్రికెట్లో అత్యధిక వికెట్ల రికార్డు అనిల్ కుంబ్లే (619) పేరిట ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో రవిచంద్రన్ అశ్విన్ (533), కపిల్ దేవ్ (434), హర్భజన్ సింగ్ (417) ఉన్నారు.

## ఇంగ్లండ్ స్టార్లకు సెంట్రల్ కాంట్రాక్ట్

**29 మందిలో ఉన్నది వీళ్లే..!**



ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు సెంట్రల్ కాంట్రాక్టులు ప్రకటించింది. తద్వారా జాతీయ జట్టుకు ఆడుతు న్న ఆటగాళ్లకు రెండేండ్ల, వార్షిక ప్రతిపాదికన ఈసీబీ జీతాలు చెల్లించనుంది. టీ20, వన్డే సారథి జోస్ బట్లర్‌తో పాటు టెస్టు జట్టు నాయ కుడు బెన్ స్టోక్స్ రెండేండ్ల కాలానికి బోర్డుతో అగ్రిమెంట్ చేసుకున్నారు. మొత్తంగా 29 మందితో ఇంగ్లండ్ బోర్డ్ కాంట్రాక్ట్ కుదుర్చుకుంది. ఏడుగురికి రెండేండ్ల పాటు సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కింది. 19 మంది క్రికెటర్లు వార్షిక కాంట్రాక్ట్ సొంతం చేసుకోగా.. మరో ముగ్గురు యువ ఆటగాళ్లు ఇంగ్లండ్ డెవలప్‌మెంట్ పేరిట కాంట్రాక్ట్ సాధించారు. ఇంతకుముందు స్టోక్స్ ఏడాది కాంట్రాక్ట్ మాత్రమే తీసుకున్నాడు. మరోవైపు బట్లర్ రెండు సంవత్సరాల పాటు సెంట్రల్ కాంట్రాక్ట్ మీద సంతకం చేశాడు. ఇప్పుడు ఈ ఇద్దరితో ఈసీబీ రెండేండ్ల పాటు ఒప్పందం చేసుకుంది. ఇక వికెట్ కీపర్ జేమీ స్మిత్ సైతం రెండేండ్ల పాటు జాతీయా జట్టుకు ఆడేందుకు సిద్ధమయ్యాడు. ఆల్‌రౌండర్ విల్ జాక్స్, ఓపెనర్ ఫిల్ సాల్ట్, స్పిన్నర్ షోయబ్ బషీర్, పేసర్ ఓలీ స్టోన్‌లకు కూడా 2 ఏండ్ల సెంట్రల్ కాంట్రాక్ట్ దక్కింది. యువ క్రికెటర్లు జాకబ్ బెథెల్, జాన్ టర్నర్, జోష్ హల్‌లు ఇంగ్లండ్ డెవలప్‌మెంట్ కాంట్రాక్ట్ జాబితాలో చోటు సంపాదించారు.

## జడ్డూ మాయాజాలం

### వెటరన్ పేసర్ల రికార్డులు గల్లంతు

భారత సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా సుదీర్ఘ ఫార్మాట్‌లో మరో ఘనత సాధించాడు. వాంఖడే టెస్టులో న్యూజిలాండ్‌పై ఐదు వికెట్లు తీసిన జడేజా టెస్టుల్లో 14వ సారి ఈ ప్రదర్శన చేశాడు. తద్వారా టీమిండియా తరఫున టెస్టుల్లో అత్యధిక వికెట్లు పడగొట్టిన ఐదో బౌలర్‌గా జడ్డూ రికార్డు సృష్టించాడు. వాంఖడేలో అతడి విజృంభణతో వెటరన్ పేసర్లు జహీర్ ఖాన్, ఇషాంత్ శర్మల రికార్డులు గల్లంతయ్యాయి. జహీర్, ఇషాంత్‌లు టెస్టుల్లో 311 వికెట్లు తీయగా జడేజా వాళ్లను అధిగమిస్తూ 312వ వికెట్ పడగొట్టాడు. అంతేకాదు సుదీర్ఘ ఫార్మాట్‌లో 3 వేల రన్స్, మూడొందలకుపైగా వికెట్లతో జడ్డూ దిగ్గజ స్పిన్నర్ హర్భజన్ సింగ్ సరసన నిలిచాడు. జడేజా, భజ్జీల కంటే ముందు కపిల్ దేవ్, రవిచంద్రన్ అశ్విన్‌లు ఈ ఘనత సాధించారు. అంతేకాదు ఇంగ్లండ్ లెజెండ్ ఇయాన్ బోథమ్ తర్వాత వేగంగా టెస్టుల్లో 3 వేల పరుగులు, 300ల వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా జడేజా మరో రికార్డు నెలకొల్పాడు.

వాంఖడేలో జరుగుతున్న మూడో టెస్టులో న్యూజిలాండ్ మూడో సెషన్‌లోనే ఆలౌటయ్యింది. భారత స్పిన్నర్ల ధాటికి కివీస్ బ్యాటర్లు చేతులెత్తేయగా టీ తర్వాత కాసేపటికే కివీస్ కుప్పకూలింది. రవీంద్ర జడేజా(5/65), వాషింగ్టన్ సుందర్(481)లు తిప్పేయగా 250 లోపే పర్యాటక జట్టు ఇన్నింగ్స్ ముగిసింది. సెంచరీ దిశగా దూసుకెళ్తున్న డారిల్ మిచెల్(82)ను ఔట్ చేసిన సుందర్.. అజాజ్ పటేల్(7)ను ఎల్బీగా వెనక్కి పంపి న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. దాంతో, కివీస్ 235 పరుగులకే పది వికెట్లు కోల్పోయింది.



## ఇంగ్లండ్ ఘోర పరాజయం



ప్రస్తుత క్రికెట్‌లో టాప్ టీమ్స్‌లో ఒకటైన ఇంగ్లండ్ కు షాకుల మీద షాకులు తగులుతున్నాయి. ఇటీవల పాకిస్థాన్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో ఓడి నిరాశలో ఉన్న ఇంగ్లీష్ టీమ్‌ను తాజాగా వెస్టిండీస్ దెబ్బ కొట్టింది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో విండీస్ సంచలన విజయం సాధించింది. లియామ్ లివింగ్‌స్టన్, ఫిల్ సాల్ట్, విల్ జాక్స్, సామ్ కర్రన్, జోఫ్రా ఆర్చర్, ఆదిల్ రషీద్ లాంటి స్టార్ ఆటగాళ్లతో పటిష్టంగా ఉన్న ఇంగ్లండ్‌ను ఆతిథ్య జట్టు చావుదెబ్బ తీసింది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో 8 వికెట్ల తేడాతో గెలిచి సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

**209 పరుగులకు ఆలౌట్**

మొదటి వన్డేలో టాస్ నెగ్గిన వెస్టిండీస్ తొలుత బౌలింగ్ చేయాలని డిసైడ్ అయింది. కెప్టెన్ షై హోప్ నిర్ణయం సరైనదేనని ఆ జట్టు బౌలర్లు నిరూపించారు. పేసర్లు మాథ్యూ ఫోర్డ్ (2/48), జేడెన్ సీల్స్ (2/22), అల్జారీ జోసెఫ్ (2/46) చెలరేగి బౌలింగ్ చేశారు. వీళ్ల దెబ్బకు 93 పరుగులకు 4 వికెట్లు కోల్పోయింది ఇంగ్లండ్. ఆ తర్వాత సారథి లివింగ్‌స్టన్ (48), సామ్ కర్రన్ (37) కాసేపు పోరాడారు. కానీ స్పిన్నర్ గుడకేష్ మోతీ (4/41) ఎంట్రీతో సీన్ పూర్తిగా మారిపోయింది. వరుసగా వికెట్లు తీస్తూ పోయాడతను. లివింగ్‌స్టన్, కర్రన్‌తో పాటు మోస్లీ, ఓవర్టన్‌ను ఔట్ చేసి ఇంగ్లండ్ పతనాన్ని శాసించాడు. విండీస్ బౌలర్ల దెబ్బకు పర్యాటక జట్టు 45.1 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌట్ అయింది.

**దూకుడుగా ఆడిన ఇంగ్లండ్**

కష్టసాధ్యం కాని లక్ష్యంతో ఛేజింగ్ స్టార్ట్ చేసిన వెస్టిండీస్ ఆరంభం నుంచి దూకుడుగా ఆడుతూ వచ్చింది. బ్రెండన్ కింగ్ (30) అండతో చెలరేగిపోయాడు ఎవిన్ లూయిస్ (69 బంతుల్లో 94). వచ్చిన బంతిని వచ్చినట్లు బౌండరీ లైన్ దాటిస్తూ పోయాడు. 5 ఫోర్లు, 8 భారీ సిక్సులతో ప్రత్య ర్థి బౌలర్లకు చుక్కలు చూపించాడు. ఆ తర్వాత ఇద్దరు ఓపెనర్లు స్వల్ప వ్యవధిలో వెనుదిరిగినా.. కీసీ కార్టీ (19 నాటౌట్), కెప్టెన్ హోప్ (6 నాటౌట్) మిగిలిన పనిని పూర్తి చేశారు. కాగా, ఇంగ్లండ్ బ్యాటింగ్ ఆర్డర్ వెన్ను విరిచిన స్పిన్నర్ మోతీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

## నాకు ఇది సంపూర్ణ ప్రయాణం

ముంబయి ఇండియన్స్ జట్టులో తనది సంపూర్ణ ప్రయాణమని టీమ్ ఇండియా పేసర్ జస్ప్రిత్ బుమ్రా సంతోషం వ్యక్తం చేశాడు. ఐపీఎల్‌లో తనను రిటైన్ చేసుకోవడంపై అతడు తొలిసారి స్పందించాడు. "19 ఏళ్ల వయసులో టీనేజర్ నేను ఇక్కడికి వచ్చాను. ఇప్పుడు నాకు 31 ఏళ్లు. ఒక కుమారుడు కూడా ఉన్నాడు. అందుకే నాకు ఇది సంపూర్ణ ప్రయాణం. అది ఇంకా కొనసాగుతున్నందుకు సంతోషంగా ఉంది. ఇంతకంటే బెటర్ ఫీలింగ్ ఏమీ లేదు. నేను ఇక్కడికి వచ్చినప్పుడు క్రికెట్ లెజెండ్స్ అందరూ జట్టులో ఉన్నారు. వారిని చాలా ప్రశ్నలు అడిగేవాడిని. ఆ తర్వాత నా పాత్ర మారింది. నా కంటే దాదాపు తొమ్మిదేళ్ల చిన్నవారు జట్టులోకి అడుగు పెట్టారు. వారికి సాయం చేయడం నాకెప్పుడూ సంతోషకరమే. నా తొలినాళ్లలో చాలా మంది అలానే సాయం చేశారు. ఎప్పుడైనా.. ఎలాగైనా జట్టుకు ఉపయోగపడేందుకు సాధ్యమైనంత కృషి చేస్తా. మేము గతంలో విజయాలు సాధించాం. చాంపియన్‌షిప్స్ ఎలా గెలవాలో నాకు బాగా తెలుసు. అందుకు వాటివైపు చూడకుండా.. ఆత్మపరిశీలన చేసుకొని.. సానుకూల దృక్పథంతో లోపాలపై పనిచేయాలి. మా విషయంలో ఇది చాలా సార్లు ఫలించింది" అని బుమ్రా వీడియో సందేశంలో పేర్కొన్నాడు. దీనిని ముంబయి ఇండియన్స్ ఎక్స్ హ్యాండిల్ పంచుకుంది. నిన్న జరిగిన ఐపీఎల్ రిటెన్షన్లో బుమ్రాను ముంబయి జట్టు కొనసాగించింది. జట్టులో అత్యధికంగా అతడికే రూ.18 కోట్లు చెల్లించేందుకు సిద్ధపడింది. ఆ తర్వాత రోహిత్ (రూ.16.30 కోట్లు) సూర్య (రూ.16.35 కోట్లు) హార్దిక్ (రూ.16.35), తిలక్ వర్మ (రూ.8 కోట్లు)కు చెల్లించింది. నేటి నుంచి ముంబయిలో మొదలైన భారత్-న్యూజిలాండ్ మూడో టెస్టు నుంచి బుమ్రాకు విశ్రాంతినిచ్చారు.

## సయ్యద్, పఠాన్, మొగల్, శాఫాయి తెగలను బిసిఈలో చేర్చాలి

- గత 15సంవత్సరాలుగా విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఈ నాలుగు తెగలు తీవ్రంగా నష్టపోతున్నాయి
- బీసీబికి చెందిన వారిని బీసీఈలో సర్టిఫికెట్లు పొందకుండా చర్యలు చేపట్టండి
- ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో బీసీ కమిషన్‌కు వినతిపత్రం
- సానుకూలంగా స్పందించిన బీసీ కమిషన్ చైర్మన్.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ



**కరీంనగర్, నవంబర్ 1 (జనంసాక్షి):** సయ్యద్, పఠాన్, మొగల్, షాఫాయి అనే ముస్లిం తెగలను ఏ ప్రాతిపదికన 4శాతం రిజర్వేషన్ల నుంచి తొలగించారో స్పష్టం చేయాలని, ఎలాంటి కారణం లేకుండా కేవలం ఒకే ఒక్క షేక్ తెగతో పాటు కొన్ని ముస్లిం తెగలను మాత్రమే అప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ముస్లింలను సంతృప్తి పరచడానికి 10శాతం అని చెప్పి, 4శాతమే రిజర్వేషన్లు కల్పించి, పైన తెలిపిన నాలుగు మెజారిటీ తెగలను 4శాతం బీసీఈ రిజర్వేషన్ల కల్పన నుంచి పక్కన పెట్టడాన్ని తీవ్రంగా పరిగణిస్తూ.. ఏఐఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఆపార్టీ కార్పొరేటర్లు నాయకులు బీసీ కమిషన్ చైర్ పర్సన్ కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో స్థానిక సంస్థల రిజర్వేషన్లు కల్పనపై నిర్వహించిన బీసీ కమిషన్ బహిరంగ విచారణకు హాజరై ముస్లింల ఆవేదనను వినిపించారు. ఈ సందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల తరహాలో బీసీ బినీ మినహాయించి ముస్లింల అందర్నీ బీసీఈలో కలపాలని డిమాండ్ చేశారు. గత 15 సంవత్సరాలుగా కేవలం ఒకే ఒక్క షేక్ తెగకు సంబంధించిన వారితో పాటు కొన్ని సంచార జాతుల వారికి ఈ బీసీ రిజర్వేషన్లు అమలు అవుతున్నాయని ముస్లింలలో సయ్యద్, పఠాన్, మొగల్, షాఫాయి తెగలకు సంబంధించిన వారు మెజార్టీగా పేదరికంలో దారిద్ర రేఖకు దిగువన ఉండి దుర్భర జీవితం గడుపుతున్నారని, ఈ నాలుగు తెగలలో పేదలుగా ఉన్న వారిని గుర్తించి బీసీలు రిజర్వేషన్లు కల్పించాలని, చాలావరకు ఈ నాలుగు తెగలకు సంబంధించిన వారు విద్యా, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. బీసీబి ముస్లిం తెగ వారిని బీసీఈ లో సర్టిఫికెట్లు పొందడాన్ని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జిల్లా కలెక్టర్, రెవెన్యూ యంత్రాంగం దృష్టి సారించి నిరోధించేట్లు తక్షణ కర్తవ్యంగా చర్యలు చేపట్టాలని కోరారు. బీసీబీ రిజర్వేషన్లో చదువుకొని కేవలం ఉద్యోగాల కోసం మాత్రమే బీసీఈలో దొంగ చాటున సర్టిఫికెట్లను పొందడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు, ఇందులో కొంతమంది రెవెన్యూ అధికారులు లంచాలు పుచ్చుకొని సరైన విచారణ జరపకుండానే బిసిబి ముస్లిం తెగవారిని బీసీఈ లో సర్టిఫికెట్ ఇస్తున్నారని, దీనిని తీవ్రంగా పరిగణించాలని కోరుతూ తన అభిప్రాయాన్ని బీసీ కమిషన్ ఎదుట వెల్లడించారు. తక్షణమే స్పందించిన బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ ఎంఐఎం పార్టీ చేసిన విజ్ఞప్తులను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సయ్యద్, పఠాన్, మొగల్, షాఫాయి తెగలను బీసీఈ లో కలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నివేదిస్తామన్నారు. అలాగే బీసీబి ముస్లిం తెగకు సంబంధించిన వారిని బిసిఈ లో సర్టిఫికెట్లు పొందకుండా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దృష్టికి తీసుకెళ్తామని, కరీంనగర్ జిల్లాలో సైతం ఈసర్టిఫికెట్లు తప్పుదోవలో తీసుకోకుండా నిరోధించాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించినట్లు గులాం అహ్మద్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ,ఎంఐఎం నగర ప్రధాన కార్యదర్శి సయ్యద్ బర్కత్ అలీ, జాయింట్ సెక్రటరీలు సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, ఆతిన అతిఫ్, ఖమరుద్దీన్, కోశాధికారి ఇబ్రహీం, కోకార్పొరేటర్లు అలీ బాబా, అజర్ దబీర్ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర కులగణనతో వెనుకబడిన వారికి న్యాయం

**పాస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్**




**వరంగల్, నవంబర్ 1 (జనంసాక్షి):** రాజ్యాంగ పదవులు, విద్యా, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయం కులగణన ద్వారానే సాధ్యమవుతుందని పూలే ఆశయ సాధన సమితి (పాస్ ) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగాని మల్లేశ్వర్ అన్నారు. ఈరోజు కాకతీయ విశ్వవిద్యాలయం , జర్నలిజం విభాగంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎప్పుడో బ్రిటిష్ కాలంలో 1872,1901, 1911, 1921,1931ల్లో కులగణన జరిగిందన్నారు. 76 ఏండ్ల స్వాతంత్ర్య భారతంలో పాలకులు స్వార్థంతో కులగణన మానేసి జనగణన మాత్రమే చేస్తున్నారని ధ్వజమెత్తారు, 2014లో కులగణన పేరుతో గద్దెనెక్కిన మోదీ ప్రభుత్వం దశాబ్ద కాలంగా జనగణన కూడ చేయడం లేదని పూలే ఆశయ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. కామారెడ్డి వేదికగా బీసీ డిక్లరేషన్‌కూ హామీ ఇచ్చిన కాంగ్రెస్ రాష్ట్రంలో అట్టడుగున ఉన్న కులాలను గుర్తించి, ఆర్థికంగా, సామాజికంగా రాజకీయంగా గుర్తింపు తేవడానికి కులగణనకు సీఎం రేవంత్ శ్రీకారం చుట్టాడాన్ని స్వాగతించారు. రేవంత్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేస్తున్న సమగ్ర కులగణన సర్వే శాస్త్రీయంగా అధ్యయనం ,గణాంకాలు చేయాలని, అప్పుడే ఈడబ్ల్యూఎస్ లోని పేదలకు, బీసీ, ఎంబిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు సామాజిక న్యాయం జరిగేందుకు సర్వే దోహదపడుతుందని ప్రభుత్వ సిబ్బందికి విన్నవించారు. ఈ కుల గణన యజ్ఞంలో పార్టీలకతీతంగా యువత గుర్తించి, నమోదు అయ్యేవిధంగా సహకరించాలని, కుల గణన లో తెలంగాణ రోల్ మోడల్‌గా నిలవాలని, పాస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సంగని మల్లేశ్వర్ పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ తాడూరి శాస్త్రి, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ నల్లాని శ్రీనివాస్, పాస్ నాయకులు డాక్టర్ కొట్టే భాస్కర్, బిక్కు నాయక్, మోతే చిరంజీవి, నీలం ప్రనూప్ తదితరులు పాల్గొన్నారు

## సిఎం రేవంత్‌కు విద్యార్థుల కృతజ్ఞతలు

- మెస్, కాస్మోటిక్స్ చార్జీల పెంపుదలపై హర్షం
- ధన్యవాదాలు తెలిపిన పాల్వంచ జ్యోతిబా పూలే గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినీలు



**పాల్వంచ నవంబర్ 01 (జనంసాక్షి) :** తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం బీసీ గురుకులాలకు మెస్, కాస్మోటిక్స్ చార్జీల పెంపుదల రోజు నుండే అమల వడంతో పాల్వంచ జ్యోతిబా పూలే గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి హర్షాతిరేకాల మధ్య ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ మేరకు పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ క్రాంతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... బీసీ గురుకులాల్లో చదివే విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా చార్జీలను పెంచినందుకు గాను బాధ్యతతో కూడిన చదువును అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకొని మన విద్యా సంస్థలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. 6,7 తరగతుల విద్యార్థులకు రూ.950 నుండి రూ. 1330 వరకు, 8,9,10 తరగతుల విద్యార్థులకు రూ.1100 నుండి రూ. 1540 వరకు మెస్, కాస్మోటిక్స్ చార్జీలను పెంపుదల చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏటీపీ రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నవంబర్ 3న జిఎన్ సాయిబాబా స్మారక సభను జయప్రదం చేయండి

**మహబూబ్‌నగర్, నవంబర్ 1 (జనంసాక్షి):**

సాయిబాబా జీవితం పోరటం అంశంపై ఈనెల 3న మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎస్ఎం ఫంక్షన్ హాల్‌లో ప్రముఖ ప్రజాస్వామ్యవాది, పౌర హక్కుల సంఘం నేత జిఎన్ సాయిబాబా స్మారక సభను ఉదయం 11 గంటల నుండి నిర్వహిస్తున్నట్లు పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి, టిఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ ఖలీల్, కేఎన్‌పిఎస్ నాయకులు డి చంద్రశేఖర్,చైతన్య మహిళా సంఘం నాయకురాలు శ్రీదేవి, సిపిఐ నాయకులు సురేష్, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకుడు పి అరుణ్ కుమార్, ప్రముఖ విద్యావేత్తలు శ్రీ లక్ష్మణ్ గౌడ్, జగపతిరావు, తెలంగాణ సాహిత్య వేదిక అధ్యక్ష కార్యదర్శులు వల్లభాపురం జనార్ధన్, ఖాజా మైనద్దీన్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు.

నేరం రుజువు కాకుండా పది సంవత్సరాలు అండా జైలులో కఠిన కారాగార శిక్షను సాయిబాబా అనుభవించాడని వారు తెలిపారు. కవులను, రచయితలను, మేధావులను జైలలో నిర్బంధించి భారతీయ జనతా పార్టీ ఫాసిస్టు విధానాలను కొనసాగిస్తుందని వారు తెలిపారు. మతోన్మాద,ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా, పౌర ప్రజాస్వామిక విలువల కోసం, దోపిడీ,పీడన లేని సమాజం కోసం స్వప్నించిన సాయిబాబా ఆశయాలను కొనసాగించడం లో భాగంగా ఈ సభ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సభలో సాయిబాబా కుమార్తె మంజీరా, ప్రొఫెసర్ హరగోపాల్, పాణి, టీపీఎఫ్ నాయకులు రవిచంద్ర, వామపక్ష పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని వారు తెలిపారు. ఈ సభలో విద్యావంతులు, మేధావులు,ప్రజాస్వామ్యవాదులు, విద్యార్థులు, కార్మికులు, ఉపాధ్యాయులు, రైతు కూలీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
02 నవంబర్ 2024

# మా జీవితాల్లో విషం నింపొద్దు!

## ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా తనగల తండ్లాట

### సోమవారం నాడు కలెక్టర్‌ను కలిసేందుకు అన్ని గ్రామాలు సిద్ధం



వడ్డేపల్లి మండలం తనుగుల గ్రామంలో..



**రాజోలి, నవంబర్ 01 (జనంసాక్షి) :** ఇథనాల్ పరిశ్రమను అడ్డుకునేందుకు మీతో కలసి నిలబడతాం.. పోరాడుతాం.. అంటూ వడ్డేపల్లి మండలం తనగల గ్రామస్తులు మద్దతు పలికారు. శుక్రవారం రాత్రి వడ్డేపల్లి మండలం తనగల గ్రామంలో ప్రజలు, స్థానికులు సమావేశం నిర్వహించారు. ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు మాట్లాడుతూ.. ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణం వల్ల గాలిలో, భూమిలో విషపూరితమైన తాగునీటిలో రసాయానిక పదార్థాలు కలుస్తాయి. దీంతో వాతావరణ కాలుష్యం ఏర్పడి చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలకు ప్రాణాంతకంగా మారే అవకాశాలున్నాయని అవగాహన కల్పించారు. సోమవారం రోజు అన్ని గ్రామాలు కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఈ కార్యక్రమంలో ఎల్లప్ప, మాజీ సర్పంచ్ జయరాం రెడ్డి, మాజీ సర్పంచ్ హనుమంతు, వీరన్న గౌడ్, పరమేశ్వర గౌడ్, నర్సింహులు, నాగేష్, హెూటల్ మాణిక్యం, మాజీ సర్పంచ్ జేమ్స్, నారాయణ, తనగల మాజీ ఎంపీపీ రాజు, సత్య రెడ్డి, మానుదొడ్డి బాబురావు, హన్మంత్ రెడ్డి, రాజిరెడ్డి, హరికృష్ణ, బాబురావు, తిమ్మప్ప, జయరాం రెడ్డి, నర్సింలు, నాగేష్, పరమేశ్ గౌడ్, కృష్ణవర్ధన్ రెడ్డి, నారాయణ, హన్మంతు, శ్యాం, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

**రాజోలి మండలంలో నేటి కార్యక్రమాలు :**

- రాజోలిలో – సాయంత్రం 5 గంటలకు..
- ముండ్లదీన్నె (రాజోలి మండలం)– సాయంత్రం 6 గంటలకు..
- పెద్ద తాండ్రపాడు (రాజోలి మండలం) – రాత్రి 7 గంటలకు..

# 68వ ఎస్‌జిఎఫ్ స్విమ్మింగ్ పోటీల్లో రాష్ట్రస్థాయికి 'పారమిత' విద్యార్థులు





**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 01(జనంసాక్షి) :** ఇటీవల నిర్వహించిన 68వ ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలలో స్థానిక అలుగునూర్ లోని పారమిత వరల్డ్ స్కూల్ లోని 10వ తరగతికి చెందిన ఎ. సంజయ్ రెడ్డి, బి.వైష్ణవి మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనారు. అదేవిధంగా నవంబర్ 2 నుంచి 4 వరకు హైదరాబాదులో తెలంగాణ క్రీడ సమైక్య ఆధ్వర్యంలో 68వ ఎస్జీఎఫ్ అండర్ 17 బాల బాలికల సిమ్మింగ్ ఛాంపియన్షిప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల డైరెక్టర్ వి.యు.ఎం ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా పారమిత పాఠశాల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాదరావు రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఎ.సంజయ్ రెడ్డి, బి.వైష్ణవి లను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీకర్ పి.ఈ.టీ లు జెట్టి శ్రీనివాస్, శ్రీధర్, పాల్గొన్నారు.


**రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన పారమిత విద్యార్థులు**

ఇటీవల నిర్వహించిన వివిధ క్రీడల జిల్లా స్థాయి ఎంపిక పోటీలలో స్థానిక కొత్తపల్లి మండలం, పద్మనగర్, పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ గోపిక్రిష్ణ తెలిపారు. ఈనెల 2 నుంచి 4 వరకు మహబూబ్ బాద్ లో తెలంగాణ పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 68వ యస్.జి.యఫ్. అండర్–17 బాల బాలికల బాస్కెట్ బాల్ చాంపియన్ షిప్ పోటీలకు జి శ్రేష్ట (9వ తరగతి) యమ్. శ్రీతేజ్ ఎంపికైనారు. అదేవిధంగా 68వ యస్.జి.యఫ్. అండర్14 బాలుర కరాటే చాంపియన్ షిప్ పోటీలకు యల్. ప్రీతమ్ చౌహాన్(8వ తరగతి) ఈ నెల 2 నుంచి 4 వరకు సంగారెడ్డి లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పాల్గొంటాడు. అదే విధంగా ఈనెల 2 నుంచి 4 వరకు ఆసిఫాబాద్ లో రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 38 వ సబ్ జూనియర్స్ బాలికల హ్యాండ్ బాల్ చాంపియన్ షిప్ పోటీలకు పి. రాఘవి.(9 వతరగతి) సి. హెచ్. భువన (8వ తరగతి) విద్యార్థులు పోల్గొంటారని ప్రిన్సిపాల్, తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులను పారమిత పాపఠశాల అధినేత డా. ఇనుగంటి ప్రసాదరావు, డైరెక్టర్స్ రశ్మిత, ప్రసూన, అనూకర్ రావు, వినోద్ రావు, వి.యు.యం. ప్రసాద్, రమణ హన్మంతరావు, అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, గోపిక్రిష్ణ, సమన్వయ కర్తలు, నాగరాజు, రాము, భవాని, పి.ఇ.టిలు పాల్గొన్నారు.

# దీపావళి రోజు వేర్వురు చోట్ల అగ్నిప్రమాదాలు

### సకలంలో మంటలను ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది





**హైదరాబాద్, నవంబర్ 1 (జనంసాక్షి) :** భాగ్యనగరంలోని మూడు చోట్ల అగ్ని ప్రమాదాలు జరగడంతో కొంత మేర ఆస్తినష్టం సంభవించింది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనల ప్రదేశాలకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సికింద్రాబాద్ మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలోని అర్పీ రోడ్డులోని ఓ గోదాంలో అగ్నిప్రమాదం సంభవించింది. దీపావళి పండుగ నేపథ్యంలో బాణా సంచా కాలుస్తున్న క్రమంలో నిప్పు రవ్వలు గోదాంపై పడడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. రమేష్ ఎలక్ట్రికల్స్‌కు చెందిన గోదాంపైన మంటలు రావడంతో ఒక్కసారిగా స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనాస్థలికి చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. రమేష్ ఎలక్ట్రిక్రల్స్ గోదాం పరిసర ప్రాంతాలలో నివాసాలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది..అగ్ని ప్రమాదంలో గోదాంలోని ఎలక్ట్రిక్ వస్తువులు అగ్నికి ఆహుతవ్వగా కొంతమేర ఆస్తి నష్టం జరిగినట్లు హిమాయత్ నగర్ స్ట్రీట్ నెంబర్ 18లో అగ్నిప్రమాదం జరిగింది. ఓ అపార్ట్‌మెంట్‌లోని నాల్గవ అంతస్తు ప్లాట్‌లో మంటలు చెలరేగాయి. ఉదయం ప్లాట్‌లో పూజలు చేసిన ఇంటి యజమాని బయటకు వెళ్లారు. ఆ సమయంలో బాల్కనీ డోర్‌ను తెరిచి వెళ్లారు. దీంతో ఒక్కసారిగా ఇంటి నుండి మంటలు చెలరేగడంతో భయాందోళనలకు గురైన అపార్ట్‌మెంట్ వాసులు పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన ప్రదేశానికి చేరుకున్న వారు మంటలను ఆర్పి అదుపులోకి తీసుకువచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కొండాపూర్‌లోని ఓ డంప్ యార్డులో మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటన ప్రదేశానికి చేరుకున్న సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## అసంపూర్తి ప్రాజెక్టులను పూర్తిచేసి

# రైతులకు నీరందిస్తాం..

- లక్ష ఎకరాలకు నీరు అందించడమే నా లక్ష్యం...
- నియోజకవర్గం లోని ప్రాజెక్టులను ఈఎన్సీ తో కలిసి సందర్శించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్..



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి నవంబర్ 1 (జనంసాక్షి) :** సాగునీటి ప్రాజెక్టుల్లో అసంపూర్తి పనులను పూర్తి చేసి రైతులకు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం వేములవాడ నియోజకవర్గం లోని మల్కాపేట రిజర్వాయర్, లచ్చపేట ప్రాజెక్టు,కథలాపూర్ మండలంలోని కలికోట సూరమ్మ చెరువు, వేములవాడ రూరల్ మండలంలోని మర్రిపల్లి ప్రాజెక్టును ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ అనిల్ కుమార్,సిఈ సుధాకర్ రెడ్డి,ఈఈ సంతు ప్రకాష్ ,ఇతర అధికారులతో కలిసి సందర్శించారు. అనంతరం వేములవాడలో అధికారులతో కలిసి ప్రాజెక్టులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రాజెక్టులు 90 శాతం పనులు పూర్తయి అసంపూర్తిగా ఉన్న 10 శాతం పనులను పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. రాష్ట్రంలోని 9 ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించిన వాటిలో మల్కాపేట రిజర్వాయర్ కూడా ఉందన్నారు.శ్రీ పాద ఎల్లంపల్లి ప్రాజెక్టును 2005 లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రూ 1737 కోట్లను మంజూరు చేసి ప్రారంభించారన్నారు. 2009 లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టుల తప్ప కొత్త ప్రాజెక్టులు ఏవి లేవన్నారు. వేములవాడ నియోజకవర్గంలో 1 లక్ష ఎకరాలకు సాగునీరు అందించే ప్రాజెక్టులను వినియోగములోకి తెస్తున్నామన్నారు. 90 శాతం పూర్తయిన మలకపేట రిజర్వాయర్ లో మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయడానికి సుమారు రూ 20 కోట్లు వెచ్చించి రైతులకు 30 వేల ఎకరాలకు నీరు అందిస్తామన్నారు. సింగ సముద్రం వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేసి మలకపేట రిజర్వాయర్ నుంచి గ్రావిటీ ద్వారా ఎగువమానేరు జలాశయాన్ని నింపుతామన్నారు. కలికోట సూరమ్మ చెరువు ద్వారా 43 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని తెలిపారు. అనంతరం ఈఎన్సి అనిల్ కుమార్ మాట్లాడుతూ నీటి లభ్యత ఉండి టెక్నికల్ ఫీజుబిలిటీ బడ్జెట్ ప్రకారం ప్రాధాన్యత క్రమంలోని ప్రాజెక్టులను పూర్తిచేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నాయన్నారు.నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రాజెక్టులను సందర్శిస్తున్నట్లు అయన తెలిపారు. రాష్ట్రంలోని పంప్ హౌస్ ల పైన నేడు రంగనాయక సాగర్ లో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మధ్యమానేరు జలాశయం, మలకపేట రిజర్వాయర్, రంగనాయక సాగర్ రిజర్వాయర్లో అవక తవకాలు జరగాయంటూ ఇటీవల వచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు రికార్డులు పరిశీలించిన అంశంపై విలేకరులు ప్రశ్నించగా తనకు తెలియదన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# టూరిజం స్పాట్‌గా నాగార్జునసాగర్

- పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం
- మంత్రి జూపల్లి కృష్ణారావు
- ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంలో స్టార్ హెూటల్ నిర్మాణం
- విదేశాల నుండి వచ్చే బౌద్ధులకు కనిససౌకర్యాలు,వసతుల కల్పన
- అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండే విధంగా కాటేజీల నిర్మాణం



**నాగార్జునసాగర్, నవంబర్ 1 (జనంసాక్షి) :** నాగార్జునసాగర్ ను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తామని, బుద్ధవనం పరిసర ప్రాంతాలలో ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యంలో స్టార్ హెూటల్ నిర్మాణంతో పాటు, వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.శుక్రవారం అయన నాగార్జునసాగర్ హిల్ కాలనీ లో ఉన్న బుద్ధవనం పరిసర ప్రాంతాలను శ్రీ రామచంద్ర మిషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కమలేష్ డి.పాటిల్ (దాజి )తో కలిసి పరిశీలించారు.అంతకు ముందుగా విజయ విహార్ లో బుద్ధవనం లే-అవుట్ ,విజయ విహార్ లేఔట్లను పరిశీలించారు.మొత్తం 270 ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించి ఉన్న బుద్దవనంలో ఉన్న విశేషాలను రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండి .ప్రకాష్ రెడ్డి , బుద్ధవనం కన్సల్టెంట్ శివనాగిరెడ్డిలు మంత్రికి,దాజికి వివరించారు.అనంతరం మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. నాగార్జునసాగర్ ,బుద్ధవనానికి ఆసియా ఖండంలోని పలు దేశాల నుండి బౌద్ధులు ఇక్కడికి వస్తారని ,ప్రత్యేకించి శ్రీలంక, ఇతర ఆసియా ఖండాల నుండి ఎక్కువ మంది వస్తారని ,వారికి అవసరమైన సౌకర్యాలు, వసతులు కల్పించాల్సి ఉందని ,అప్పుడు ఇంకా ఇతర దేశాల నుండి సైతం బౌద్ధులు ఇక్కడికి వచ్చేందుకు అవకాశం ఉందని, బుద్ధవనం పరిసర ప్రాంతాలతో పాటు, విజయ విహార్ లో ఉన్న స్థలం వివరాలు, అలాగే నాగార్జునసాగర్ చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ భూముల వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూములపై సర్వే నిర్వహించి వివరాలు సమర్పించాలని ఈ సందర్భంగా మంత్రి మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ ఆదేశించారు.అనంతరం మంత్రి, దాజితో కలిసి బుద్ధవనం పక్కన ఉన్న విపస్యన ధ్యాన కేంద్రం పరిసర ప్రాంతాలను, ఇతర ప్రదేశాలను పరిశీలించారు.స్టార్ హెూటల్, వాటర్ స్పోర్ట్స్ తో పాటు, ఈ ప్రాంతంలో అన్ని వర్గాల వారికి అందుబాటులో ఉండే విధంగా కాటేజీల నిర్మాణాన్ని చేపట్టనున్నామని, నాగార్జునసాగర్ తో పాటు, నాగార్జునసాగర్ నియోజకవర్గంలో నూటికి నూరు శాతం పెద్ద ఎత్తున టూరిజాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి వెల్లడించారు.అంతకుముందు విజయ్ విహార్ లో స్థానిక శాసనసభ్యులు కే.జయవీర్ మాట్లాడుతూ, నాగార్జునసాగర్ ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు మంచి అవకాశాలు ఉన్నాయని, ప్రత్యేకంగా కృష్ణా నది సమీపంలో ఉండడం ,కొండలు ,ఇక్కడ పరిసరాలు ,బుద్ధవనం పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు మంచి ఆస్కారం ఉందన్నారు .వీరితో పాటు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఎం డి ప్రకాష్ రెడ్డి,ఓఎస్ డి. సూధన్ రెడ్డి, బుద్ధిష్ట్ కన్సల్టెంట్ శివనాగిరెడ్డి, బుద్ధవనం డిజైనర్, ఇంచార్జ్ శ్యాంసుందర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ తదితరులు ఉన్నారు.

# పేలిన ఉలిగడ్డ.. ఒకరి మృతి

**లక్నో, నవంబర్ 1 (జనంసాక్షి) :** దీపావళి పండగా సందర్భంగా కొన్నికొన్నిసార్లు కొందరి కుటుంబాల్లో విషాదాలు చోటుచేసుకుంటున్నాయి. బాంబులను పేల్చే సమయంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉంటే వారి కుటుంబాల్లో తీరని విషయాన్ని మిగుల్చుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఏలూరు జిల్లాలో ఓ వ్యక్తి దీపావళి పటాకులు విక్రయించడానికి 'ఉల్లిగడ్డ' బాంబులతో మోటారు సైకిల్ పై వెళుతుండగా ఒక దేవాలయం వద్ద గుంతలో పడినప్పుడు ఆ ఉల్లిగడ్డ బాంబులు పేలిపోయాయి. దీంతో ఆ వ్యక్తి మరణించగా, మరో ఐదారుగురు గాయ పడ్డారు. ఈ ఉల్లిగడ్డ బాంబుల్లో ఐఈడీ వంటి పేలుడు పదార్థాలు వాడి ఉంటారని అనుమానాలు ఉన్నాయి. ఈ ఘటన గురువారం మధ్యాహ్నం 12.17 గంటలకు జరిగినట్లు సీసీటీవీ కెమెరా ఫుటేజ్ చూపుతోంది. గాయ పడిన ఆరుగురు వ్యక్తులు జిల్లా కేంద్ర దవాఖానలో చికిత్స పొందుతున్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. బాంబు పేలుళ్లతో ఆ ప్రాంతం అంతా పొగ కమ్మేసింది. పేలుడుతో పరిసర ప్రాంతాలు భయానకంగా మారాయి. స్కూటర్ మీద ఉల్లిగడ్డ బాంబులు తీసుకెళ్తున్న వ్యక్తిని సుధాకర్ అని గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సంక్రాంతి లోపు ఏపీలో

# మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణం

**నంద్యాల, నవంబర్ 1 (జనంసాక్షి) :** ఏపీలో మహిళలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఉచిత బస్సు ప్రయాణంపై రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. దీపం పథకం మొదలుకానున్న నేపథ్యంలో మరో పథకంపై మంత్రి గుడ్ న్యూస్ చెప్పారు. సంక్రాంతి లోపల ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణం చేయవచ్చని వెల్లడించారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఇప్పటికే పెంచిన పింఛన్లను పంపిణీ చేస్తున్నామని.. ఇక దీపం పథకాన్ని మొదలు పెడుతున్నామని తెలిపారు. అలాగే సంక్రాంతి లోపల ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణం చేసే చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఉద్యోగాలు కల్పించేందుకు ఎన్నో పరిశ్రమలు తీసుకొస్తున్నా మన్నారు. తల్లికి చెల్లికి న్యాయం చేయలేని జగన్.. చంద్రబాబు ప్రభుత్వంపై మాట్లాడే అర్హత లేదన్నారు. ప్రతిపక్ష హెూదా కూడా లేని జగన్ ఎన్ని మాటలు చెప్పినా జనం నమ్మరన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజా ప్రభుత్వానికి ప్రజల మద్దతు సంపూర్ణంగా ఉందని తెలిపారు. ప్రతిపక్ష హెూదా కూడా దక్కని జగన్ ఏవేవో ఊహించుకొని మాట్లాడుతున్నారన్నారు. రెండు రోజులు ఏపీలో.. ఆరు రోజులు బెంగళూరు ప్యాలెస్‌లో ఉండే జగన్‌కు ప్రజల గురించి ఏం తెలుసు అంటూ మంత్రి బీసీ జానార్ధన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370